UNIVERSAL
LIBRARY
OU_204312
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No. T82 D94S. Accession No. PGT 1869

Author దుర్గ సంకరామాత్యుడు, మూడి రాజు.

Title సంభాజీనిర్వాణము.

This book should be returned on or before the date last marked below. 1931

సంభాజి నిర్యాణము

(మహారాష్ట్రభాషనుంచి తెలిగించినది)

అనువాదకుడు:

మాచిరాజు దుర్గాశంకరామాత్యుడు

పరిష్కర్త:

శ్రీపాద కామేశ్వరరావు

అభినవాంధ్ర
గ్రంథమాల
రాజమండ్రి
1926

ప్రకాశకుడు:

చెఱుకువాడ వేంకటరామయ్య

అభినవాంధ్ర గ్రంథమాలాలయము

రాజమండ్రి

1931

అన్నిహక్కులు
ప్రకాశకునివి

* * *

వెల రూ 1-0-0

PRINTED BY
A. LAKSHMANASWAMY NAIDU
AT
THE SARASWATHI POWER PRESS,
RAJAHMUNDRY.
5715--1931

పీఠిక

హిందూదేశమందలి ప్రజలలో రాజపుత్రులూ మహారాష్ట్రులున్నూ కడు ప్రసిద్ధికన్నవారు. ఛత్రపతి శ్రీశివాజీ మహారాజు పెంపు ఎసగిన హిందువు లగుదు. అతనితరువాత శంభాజీ మహారాష్ట్రమునకు ప్రభువాయెను. ఇతడు తండ్రికి తగినకొడుకు కానందువల్ల రాష్ట్రప్రభ క్షీణించెను.

ఈసందర్భము నాధారముచేసుకొని శ్రీమాన్ విష్ణు ఔంధ్కర్ అను నటకుశలుడు "బేబంద్ శాహి" (నిరర్గళపరిపాలన) అనే పేరున నాటకము వ్రాసెను. గద్యనాటకములలో ఇది సుప్రసిద్ధమని ఎరిగి 1929 సం॥రపు వేసవికాలమున మా మిత్రులు శ్రీమాన్ మాచిరాజు దుర్గాశంకరామాత్యునిచేత తెలుగున తర్జుమా చేయించినాము. ఆమహాశయుడు నిరుడు మార్చి నెలలో స్వర్గస్థులౌటచేత ఆతని ఆత్మశాంతికై దీనిని ప్రచురిస్తూన్నాము.

20—2—31 చె॥ వే॥

ఇందలి ముఖ్యపాత్రములు

పురుషులు

శంభాజి	...	మహారాష్ట్రప్రభువు
రాజారామ్	...	శంభాజి తమ్ముడు
సూర్యాజి పిసాళ్	...	సర్దారు
గణోజి శిర్కే	...	శంభుజి బావ
కలుశాకబ్జి	...	బ్రాహ్మణుడు (శంభుని ఆశ్రితుడు.)
ఖండోజి	...	సర్దారులు
మాహీరు		
ఇక్లాస్‌ఖాన్	...	మొగలు సర్దారు

స్త్రీలు

యేసూ (యశోదా) బాయి	...	మహారాష్ట్రరాణి
తారాఊ	...	రాజరామ్ భార్య
సంతూమాయి	...	ఖండోజి చెల్లెలు
చంద్రావళి	...	మాహీరు భార్య

సంభాజీనిర్యాణము

మొదటి అంకము

మొదటి రంగము.

రాయగడ దుర్గము—తారాబాయి, సూర్యాజీ.

తారా—సూర్యాజీ, ఛత్రపతులైన భోంసలావారి సంబంధము నాకు కుదిరినందుకు నేను గొప్ప అదృష్టవంతురాలనని నా పుట్టింటివాళ్లు భావించడము, నా చెలులు "తారా నరేంద్రుని పట్టపురాణి, కుబేరుని కాంతామణి ఏమి పుణ్యము చేసిందో" అని హెచ్చరించడమూ, సౌఖ్యసంపద గురించి హద్దులేని ఊహాలు కల్పించుకొని నేను సకల విధములా ధన్యనని అనుకోవడమే కాని, కారాగారవాసము మాకు ప్రాప్తిస్తుందని ఎవరూ తలచియుండరు. కుబేరుని ఇల్లాలినైన కూటికి ఇబ్బంది పడతానని నా నుదుట వ్రాసి యున్నది; లేకుంటే పనులపంచ బడి అన్నవస్త్రాలు కరవై అందరికీ ఒదిగియుండడము కూడా నాకెంత లజ్జాకరము! ఇంతకూ "బుద్ధిః కర్మానుసారిణీ".

సూర్యా—అమ్మగారు పోరు ప్రారంభించింది. (పైకి) ఒదినా, ఇప్పుడు మీకు ప్రాప్తించిన అవనతి అస్వప్నమూనా స్వప్నమని రాజారామునగారికి తోచదా? తోచి ఏమి చేయగలరు? ఎటుచూచినా సింహాసనమూ దుఃఖవార్ధిలో రేగుతూన్న తుపానులూ గోచరిస్తూన్నవి. ఇట్టివేళ వారు నిర్బలములు కావడము ఒక వింతా? చెడుకాలము వచ్చినప్పుడు ఎట్టి బుద్ధిశాలులైనా కలవరపడుతారు.

తారా—ప్రారబ్ధకర్మమనుభవించి తీర్చవలసినదే. దుర్దైవాఘాతము తప్పించుకొన యత్నించడమే పౌరుషము కాని పులిని చూచిన మేకలాగు గుండె చెదరి, కాళ్లుచేతు లాడక, కష్టములకు తలయొగ్గి నిలవడము శూరధర్మము కాదు. ఇప్పటికి తొమ్మిదేళ్లనుండి ఒక్కతీరున పడరాని పాట్లపాలయినాము. బావగారి గౌరవము పాలించడము ఇంకెన్నాళ్లు? రాకూడని రాయిడి సంఘటిల్లినది. మే మేలాగు వ్యవహరించినా వారికి శత్రువులమే కాని మిత్రులము కాలేము, మాకు చావు తప్పదు. మరణమాసన్నమైనప్పుడు యాతన తప్పించుకొనడానికి కాళ్లుచేతులు కొట్టుకోవడము సకలజీవులకూ సహజమే కదా?

సూర్యా—రాణీసర్కార్, మీ యభిప్రాయ మవగాహన మయింది. మహత్వాకాంక్షకూ స్వాభిమానముకూ ఆటపట్టైన మహారాష్ట్రీకులముకు తగినమాట ఇది. (తనలో) భోంసలేవంశము నిర్మూల మొనర్ప ప్రతిజ్ఞ పట్టి గణోజిశిర్కే

నా ప్రాపు చేరినాడు. అప్పగారి ఆశ లడుగంటవలసినవే (ప్రకి) విగ్రహశాలినాసక్తుడూ, కాలకరాళచిత్తుడు నైన శంభాజీ మహారాజా వారి రాష్ట్రములో ఇట్టి రహస్యాలోచనలు చేయ నెవరు సాహసించగలరు ?—మూ విషయ మాలోచించండి— నాయి దేశముఖికొర కెంతో తహతహపడి అనచేత ప్రాణాలు పట్టుకొని కూర్చోనడము నాకు ఇచ్ఛ యనుకొన్నారా ?— ఏమి చేయగలను ? ఆఖాసాహెబుగా (శివాజీ) రాసన్నమరణు లై యున్నప్పుడు రాష్ట్రశ్రేయోభిలాషులూ, రాజకార్యప్రవీణు లున్నూ సంభాజీని క్రూరస్వాంతుడు, అప్రయోజకుడనికదా పన్హాళా దుర్గమున బంధించి శ్రీరాజారామ్ ప్రభువును సింహాసనాసీనుని చేసినారు. ఈ వార్త వాయువేగమున చెవిని పడడముతోనే సంభాజీ దక్షిణాపథ మాక్రమించి ప్రజలను గడగడ లాడించి తనకు ప్రతికూలులైన స్వామిభక్తుల నందరినీ చంపి, సకలైశ్వర్యములకూ నిధానము, ప్రత్యక్ష మహారాష్ట్రవైభవలక్ష్మి యైన సోయరాబాయిని కుడ్యస్థాపనము చేసి కూల్చినాడు. అందుపై గోతపుట్టి తండ్రిపై పగదీర్చుకొన పట్టుబట్టి మహారాజుగారి ప్రాపుచేరిన అక్బరు యువరాజు సహాయమున సంభాజీని సంహరించవలెనని అన్నాజిదత్తో శిర్కే గార్లు అన్ని యత్నములూ చేసినారు, కాని "అన్యథా చింతితం కార్యం దైవ మన్యత్ర చింతయేత్" అన్నట్లు ఆమూర్ఖుని మూలాన వారి ఆటలు సాగలేదు. పైపెచ్చు ఆబాసాహెబుగారి సంగిడికాళ్లు హస్తిపాదములచేత అణగత్రొక్క-

బడినారు. శిరస్త్రాలు శిరస్సులు బంతులలాగు మిన్ను కెగసినవి. మాతుశ్రీ యశోదాబాయి అడ్డుపడి, ఖండోజీ నీలోజీలను బ్రతికించింది కాని చిట్నవీస్‌కులము మా దెబ్బతో దిబ్బ కావలసినదే. అట్టి క్రూరమృగరాజు చెంత నెవడు చేరగలడు? అట్లు సాహసించినవాళ్ళు సమూలము సమయింపబడరా? సంభాజి కోపాగ్నివల్ల పూచిన తంగేడువంటి కుటుంబము లెన్నో దగ్ధపటలము లయితీరునని ఎవ రెరుగరు? ఇట్టి పరిస్థితులలో మన కెవ్వరు ప్రాపు కాగలరు?

తారా—సూర్యాజీ, నీవు పేరుపొందిన శూరుడవు, కష్టకాలమందు ధైర్యము విడనాడదగునా? రాష్ట్రవిప్లవమున రక్తస్రావము సహజము కాదా? రాజకార్యనిర్వహణ మను ప్రాణోపద్రవకేళి కరుణార్ద్రమైన బాలక్రీడ అవునా? అకుంఠితధైర్యము అనివార్యసాహసమూ అగుపర్చవలసిన వేళలందు అనుకంప దాక్షిణ్యములున్నూ చిత్తమందు చేర్చతగునా? మీరు మా రాజుగారి కత్యంత విశ్వాసపాత్రులు కావున నా మనసులోమాట సవిస్తరముగా మీకు వెల్లడిచేసినాను...ప్రస్తుత పరిస్థితులకు బాలకునికన్న ఎక్కువ భయపడుతూన్నారే!

సూర్యా—విశ్వసనీయుడను, అకుంఠితవీరుడను మా వళామహారాష్ట్రుడను, అట్టి నన్ను మీరు పరిహాసించినంత మాత్రాన నా ప్రతాపము తగ్గిపోదు...ఇంతవరకు నేను మీతో ప్రసంగించినది ప్రజావిషయము. నే నెన్నటికీ పిశ్వాసఘాతకుడను కాను. కూడుగుడ్డల నొసగి బ్రోచిన ప్రభువు పక్షు

మున బోరవిరిచి నిలువబడువాడనే కాని భీరునివలె పరుగెత్తు వాడను కాను.

తారా—ఇప్పుడు మీ ప్రభువెవరు? వారిని మీ రేలాగు సేవిస్తూన్నారు?

సూర్యా—దక్షిణాపథ ప్రభువులు ఛత్రపతిభోంసలే నరేంద్రుల సేవకుడనై సర్వశ్రేష్ఠమైన రాయగడదుర్గమునకు అధ్యక్షుడనై ఉన్నాను.

తారా—ఆ భోంసలేరాష్ట్రి మిప్పుడు దురాచార దుశ్చరితమనే సుడిగాలిలో దుమ్ము రేగిపోవడము మీకళ్లకు కనబడలేదా? కర్దమదుర్వ్యసనాసక్తిచేత పాడుచెడి భోంసలే రాష్ట్రము అలంగీరు పాదుషా వారి రాష్ట్రమువైపు ఒరుగుతూ న్నదని మీకు తోచలేదా? రాజుగారి కైపు మిక్కుటమై వారి అన్నము తినే మావళాలకు మీకు వాసనగొట్టలేదా? రాష్ట్రదుస్థితి పలుబారలేదా? చతురంగబలసమేతుడైన శ్రీశివాజీప్రభువుగా రస్తమించిన తరువాత ఆతని అగ్ర సుతుడు నిర్జీవమైన చతురంగపురాజుగా మారడము వారి రాష్ట్రహితైషులు అనుపమవిశ్వసనీయులైన మీరు గ్రహించ లేదా?

సూర్యా—గ్రహించ కేమి? అంతమాత్రాన లాభ మేమి? భూకంపమును దాని పూర్వసూచనలబట్టి గ్రహించ డము సులభమే, కాని దాని నివారించు ఉపాయము కనిపెట్ట డము సులభేతరము.

తారా—నిజమే—అందుచేతనే పనిబడ్డప్పుడు ఒళ్ళు దాచుకొనే మతిహీనుల మాటలూ ఆటలూ సాగుతూన్నవి. జంభాలరాయళ్ళ సంభాజీకు తావు యథేచ్ఛముగా కలుగుతూన్నది. నిర్వాహకుల ఘనకార్యములు, సోమరుల తుంటరి పనులూ సరిజేసి చూడబడుతూన్నవి. మునుగుతూ అడుగంటుతూన్న భోంసలే ప్రభుత్వమును తేల్చి పునఃస్థాపనము చేయవలెనని చిన్నరాజుగారు అభ్యర్థిస్తూండగా సంభాజీ భీతి చేత దంభవాక్యములు కండ జేరి దేశీయుల చిత్తములు నిరుత్సాహము లవుతూన్నవని సూర్యాజీపిసాళ్ గండోరా వేస్తూన్నాడు.

సూర్యా—కాలానుగుణమని నాకు స్ఫురించినది నా మనస్సుకు వచ్చినదీ నిష్కపటభావముతో నివేదించినాను; అధికము అప్రస్తుతమూ అయిన ప్రసంగమువల్ల యజమానుల మనస్సు నొప్పించవలెనని నా ఉద్దేశము కాదు. నేనిచ్చిన సలహా వ్యర్థమని కాని అనర్థదాయకమని కాని మీకు తోచినట్లైతే, నాకు సెలవిప్పించండి. సంతతరాజభక్తులమూ ధైర్యశాలులమూ ఐన మమ్ము దంభులతోనూ పిరికిపందలతోనూ సమానముగా పరిగణించడము వింతగా నున్నది. గతమున మేమొనర్చిన సేవ ఏగంగలో కలిసింది? ప్రభువులకు సంభవించిన ఆపత్సంకటమున గుమికి వారి పరపతి నీ సేవకుడు నిలబెట్టని దృష్టాంత మొక్కటి చూపగలరా?

తారా—ఇంతవరకూ అట్టి అవస్థ తటస్థించలేదు తథ్యమే, ఇప్పుడా సన్నమౌనేమో అనే భీతి కలుగుతూన్నది.

సూర్యా—ఎందుచేత? ఇంత హీనమైన నేరము నామీద మోపడానికి హేతు వేమి?

తారా—శంభూజీగారి భీతిచేత నా సలహా నిరాకరించడమే నిదర్శనము.

సూర్యా—నేను రాజభీతిచేత మీమాట త్రోసివేస్తూన్నానని మీ ఊహ కాబోలు!...నామనస్సు అన్యవిషయాక్రాంత మైనది. గురి తప్పకని పూర్ణధైర్యము చిక్కినప్పుడే దెబ్బ కొట్టవలెను. ఎవని బాణ మమోఘమో వాడే విలుకాడు. మన ఆలోచన ఉభయులకూ లాభదాయకమని రూఢి అయితే మీ ఆజ్ఞను తప్పకుండా శిరసా వహిస్తాను, కాని నిరర్థకముగా ప్రాణోపద్రవకరమైన తెలివితక్కువ చిందులు త్రొక్కడానికి నా మన సొప్పదు.

తారా—మతిమాలిన పని చేయడానికి ఎవరి ప్రాణము లంత బరువు? పిసాళ్—కళ్లు తెరిచి కలియబార చూడు. ఢిల్లీ ఆలంగీరు, బొంబాయి పరంగీలు, గోవా బుడతకీచులు, జంజీరా సిద్దీలున్నూ నలుదిక్కులా యుద్ధసన్నద్ధులై మనపైని పడవలెనని కాచుకొని యున్నారు. మనలో మహాయోధులూ, అనుభవశాలులూ మట్టిలో కలిసినారు; ఇప్పుడంతా బాలనాయకమై ఉంది. పన్నులు పెరిగినవి, చిలిపిజగడములు రాష్ట్రమున కల్లోలము కలిగించినవి. అష్టప్రధానుల అధికా

రము కలుషాత్ముడైన కలశాయాను సంక్రమించింది. సంభాజీ గారు సంతతము కామాలోలుడై లోకమే మరచి హీనకులసంజాతమైన తురుష్కకన్యా రాశిలో మునిగియున్నారు. ఈరీతిని మరాఠా మహారాష్ట్రమె ఆ రాజగను ప్రబలుతూన్నప్పుడు నా ప్రాణేశ్వరుని స్వతంత్రభూపతిని చేయు ప్రయత్నము అయుక్తమని నీకు తోచినదా? అతిరహస్యముగా తగిన పూనికతో మన మాలోచించిన పని చేయబూనినచో పరము ఊగులాడుతూన్న మహారాష్ట్రపరిపాలన లోకముగా వేసినాటి యావచ్చంద్రతారాకముగా అస్ఖలితముగా అవలంబించి తీసుకుంది. కలశాకబ్జి దుశ్చరితపాశాలు తెగి మావళేమరాఠాల ముందుగురవుచేత పుడిసి మట్టిలో కలుస్తుంది... నేను చెప్పినట్లు చేస్తే నీవు సంతతమూ అభిలషిస్తూన్న వారు దేశముఖి నీకు ప్రాప్తించడమే కాక భోంసలే సామ్రాజ్యమునకు ధారకుడవైన అసహాయశూరుడవని నీ కీర్తి శాశ్వతముగా నిల్చిపోతుంది.

సూర్యా—(తనలో) ఈమెమాట విన్నట్లుండకుంటే ఇక్కడినుండి బైట పడడానికి వీలుండదు.

తారా—పిసాళ్, నావి పిచ్చి కేకలని తలచి కాబోలు ప్రత్యుత్తరం మీయకున్నావు? లేక ఆపని నీచేత కాదా? అప్రయోజకుడవైతే ఆ ప్రసంగమింకెత్తను.

సూర్యా—రాణీగారూ, మీ దూరదృష్టి రాజ్యతంత్రప్రవీణతా చూచి నేనాశ్చర్యపడుతూన్నాను. నా మనసు

లోకము కనుగొనక పూర్వము సహ్యగుహాంతరవాసులైన రాజా రామ్ ప్రభువుగారికి మన ప్రయత్నము సూచించునో లేదో తెలుసుకొన్నారా?

తారా—లేదు.

సూర్యా—అమ్మగారూ, కాపులేని బంటు కనీసము చావు చావడా? శిరస్సులేని మొండెము ఏమి చేయగలదు? దానికి ప్రాణము పోయగలమా?

తారా—మొండెములో చేవ లేకపోతే ఎట్టి శిరస్సైనా ఏమి చేయగలదు? తగిన దేహము తోడ్పడినప్పుడే శిరస్సు చేతనైన పనులు. ఇవి రెండూ కార్యసిద్ధికి మూల స్తంభములే.

సూర్యా—శిరస్సుకు ప్రతికూలముగా మొండెము వ్యవహరించలేదు. ప్రస్తుత కార్యక్రమము సఫలమైతే సింహాసనముపైని, విఫలమైతే వీరస్వర్గమందున్నూ శిరస్సూ మొండెమున్నూ ఏకమత్యముతో కూడియుండునని నమ్మండి. నాకు సెలవు. (పోవుదురు)

—రెండవ రంగము—

సూర్యాజీ.

(తెరలో—రాయగడదుర్గమునందలి భటులకు హెచ్చరిక! హెచ్చరిక! హెచ్చరిక! ఛత్రపతి సంభాజీ మహారాజుగారిచే అనుమతి పొందిన గణోజీశిర్కే మొగలుల సహాయమున భోంసలేవంశము బుగ్గిచేస్తానని ప్రతినబట్టి ఈ దుర్గములోనే మారువేషముతో మసలుతూన్నాడని చారులద్వారా వార్త తెలిసింది. ఆ కపటాత్ముని కనిపట్టి రాజుగారికి కర్పించిన వారికి ఐదుగ్రామాలు మొఖాసాగా ఇవ్వడమే కాక మహారాష్ట్రసభలో మహాసన్మానము జరుపబడును.)

సూర్యా—(తనలో) బాబో! మోసము మునిగిందే! శిర్కేగాక సంభాజీకి తెలిసింది!

(రాజారామ్ వచ్చును)

రాజా—పిసాళ్! చాటింపువిన్నావా? ఎంత ప్రమత్తత! పారాలు పనికిరాలేదే! కోటలోని గస్తీ కొరంగాలేదా! దుర్గాధ్యక్షుడవైన నీకు తెలియకయుండదే ఈ వార్త మహారాజుగారిచెవి సోకింది! ఇదా నీ ప్రయోజకత్వము? దీనివల్ల నీ పరామరిక తేటతెల్లమౌతూన్నది. ఇప్పుడే రాజప్రాసాదమునకు పొమ్ము. ఇక్కడ నిరర్థకముగా కాలయాపన చేస్తూన్నావని మహారాజుగారికి తెలిస్తే వారి కనుమానము కలిగి మనకందరికీ ముప్పు మూడగలదు.

(తారాడు వచ్చును)

సూర్యా—ఇదిగో! ఇప్పుడే చెక్కులు కట్టుకొని రాజ ప్రాసాదము చేసుతాను.

రాజా—అన్నగారి కుశలవార్త అతివేగము పంపు.

సూర్యా—చిత్తము త్వ కావించెదను. (పోవును)

తారా—అన్నగారిచేత ఆ జీవనము బందిఖానా యందు బంధింపబడ్డ వీరికి నాటి యోగక్షేమములగూర్చి ఎంత చింత! (ప్రకీ) మహారాజుగారిని గురించి ఇంత మమత కలదనము మీ కేందుకు? భోంసలేరాజప్రాసదము పర్వత కందరము కాదు, ఘోరారణ్యము కాదు; వేనవేలు రాతులు, శస్త్రపాణులైన శూరులు కంటికి రెప్పవలె కాముతూండగా అంతటా ఇంద్రవైభవముతో నిండి యున్నది. ఒక్కపెట్టున నూటఎనిమిది తోపులు పేల్చగల రాజదుర్గము—దాని కేమి లోటు?

రాజా—ఆ మాట నిజమే. భవనము కావుననేముఖ్యముగా భయాస్పదమని నాకు బెంగగా నుంది, ఇదే గర్భాదరి దునిగుడిసె అయి మే నుండు నివసించే నిరుపేదల మైత్రే కలవరముకు కారణమే ఉండకపోను!

తారా—బాగు బాగు. మహారాజప్రాసాదములు మరణ భీతి కాలవాలములని మీ అభిప్రాయమా?

రాజా—అందుకు సందేహమా? దుర్విషయాసక్తులైన దుష్టనృపతుల నగరాలు అనేక పాతకములతో నిండి

పట్టపగలు రక్తధారల నెగజిమ్మే కసాయి కొట్టులు. అరాజక రోగగ్రస్తములై పొరలుగప్పిన కళ్లకు దేదీప్యమాన నిజదివ్య తేజముచేత నావరింపబడిన పతివ్రత, ఎగువుసొమ్ములు, ఇతర క్షణికకృతకశృంగారములతో కులుకుతూన్న కులటవలె కాన్పించును. స్వాతంత్ర్యముకై పోరాడు మహానీయుల మస్తకములు హింసకమైన అకాలమృత్యువువాత పడుతూన్నవి. స్వకీయుల ఆకాంక్షామితంబులు బెట్టపెట్టు స్వార్థపరులు తమకార్యము నిర్వహించుకొనదలచి ఎట్టి హీనకార్యము లొనర్చుటకైనా సిద్ధపడి పైకిమాత్రము రాజభక్తులవలె మసలుతూన్నారు. ఇట్టి కల్లోలావస్థలో న్యాయము ప్రతిష్ఠించి, ప్రజాకర్తృత్వ నిర్వహణోత్సాహము సంఘటించి తండ్రిగారి శ్రీరామ రాజ్యము పునరుజ్జీవనము చేయవలెనంటే మహోన్నతసార్వభౌమోదయము కావలెను.

తారా—ఏమి? మన మహారాజుగా రా మహాత్కార్యము సాధించలేరా? మీరు మాత్రము ఛత్రపతులు కారా?

రాజా—ఛత్రపతి మాట సత్యమే. ఇతడు పుట్టు ఛత్రపతి కాని పెట్టుఛత్రపతి కాడు—ఏమని చెప్పుదును? దుఃఖము పొంగి పొర్లుతూన్నది. మా అన్నగారే తండ్రికి తగిన తనయు లయితే మాకు రక్తబంధువులై మేలు కీళ్లయందు మాతో భుజములు కలిపి సామ్రాజ్యక్షేమమునకు ప్రాణము లొడ్డి పోరులాడిన శిర్కేవంశజులు మాపై పగబట్టి ప్రతికక్షులతో చేరి మాసామ్రాజ్యమునే కాక మా వంశము

కూడా నిర్మూలము చేయ ప్రతిజ్ఞ పట్టియుందురా? ఉత్తమో త్తముడైన బాలాజీపంత్ చిట్నీస్ రక్తముచే భోంసలే ప్రభువు హస్తములు రక్తసిక్తము లవునా? శివస్థాపితమైన మాతుశ్రీ సోయరాబాయి కరుణాక్రందనము...వద్దు, వద్దు. ఆమాట తలుచుకొంటే కడుపు చెరుగుకో పోతుంది. భోంసలే కులదేవతా! భవానీ! మా అన్నగారికి ఛత్రపతికి తగిన బుద్ధి దీర్ఘాయువున్నూ ప్రసాదించు మమ్మా! ఇదే మేము కోరేది.

తారా—కులదేవతలారా! వినండి. రాష్ట్రనిర్మూలన మునకు బావగారికిన్నీ వారి బందిఖానాలో నుండడానికి నా ప్రాణేశ్వరునికీ దీర్ఘాయు వొసగండి.

రాజా—తారా! ఒరిసిన పుండుపైని ఉప్పు జల్లుతూ న్నావు! నొచ్చిన మా మానసములకు నీ ఉలుకుమాటలచేత ఉత్సాహము పుట్టునని ఎంచుతూన్నావా? నిత్యకళ్యాణమూ పచ్చతోరణముగా కలకలలాడు మా కోటలో కసితీర్చుకొనే కత్తి ఝళిపించబడుతూండగా సర్వనాశ హేతుభూతమైన దుర్బుద్ధి నీ కెందుకు పుట్టింది? మాత్సర్యమును మచ్చ మాపుకో. ఇప్పుడు మాకు సంఘటిల్లిన అరిష్టములు నశించును కాని మనస్సున నాటిన మాటలు మరపురావుసుమా! తుదకు శల్య రూపములై సకల బాధలు కలిగించును.

తారా—అట్టి మాటలు నే నంటానా? అందువల్ల మీ వంశీయుల అపఖ్యాతి అతిశయించదా? స్వర్గమందున్న

దేవతాకోటి ఒక్క పెట్టున భోగుమని ఏడవదా?...ఇదిగో... నోరు మూసుకొన్నాను. పూర్వజన్మాన నే నొనర్చిన పాపము ప్రత్యక్షానుభూతికి వచ్చి నన్ను మితిలేని వెత బెట్టకమానదు. ఇకముందు ఏమివచ్చినా పెదవికదల్చక అనుభవించి తీరుతాను. కారావాసమో, కరాళమృత్యువో, కాగలచినది కాక తీరదు.

రాజా—మహారాజు గర్భవాసమున పుట్టుక, కారావాసమున పోషణ. బానిసవాని పోలిక పారతంత్ర్యము! గోరుచుట్టుపై రోకలిపోటు వేసే కులకాంత, అనవరతమూ కత్తిదూసి కాచుకొనియున్న ఆత్మీయులు...అంతటా రక్త పిపాస!...కడుపులోని దుఃఖము వెడలపుచ్చవలెనంటే విని శాంతి చేకూర్చే విశ్వసనీయుడైన మిత్రుడొకడైనా కాన రాడే! ఏమి గతి?

(ఖండోజీ త్వరగా వచ్చును)

ఖండో—ప్రభూ! చిట్నవీస్ వంశజుడీ ఖండోజీ లేడా?

రాజా—ఆవ్ జీ కులదీపకా! మాతుశ్రీ చిరుతకార్య దర్శి, ఖండోబా! నీకు నూరేళ్లాయువు! ప్రాణస్నేహితుల మాట తలపువచ్చి నీ విప్పుడే స్మృతికి వచ్చినావు; వెంటనే ప్రత్యక్షమైనావు...ఏదీ, ఒక్కసారి నీ ఆలింగనము. నీవు దగ్గరనుంటే వేయిమంది తోడున్నట్లవును.

ఖండో—ప్రభూ! నేను మిమ్ము హెచ్చరించడమునకే వచ్చినాను. మీ రిప్పుడప్రమత్తులై ఉండవలెను. మహా

రాజుగారు ఉగ్రకోపావిష్టులై గుస్సాగుస్సా గానక వస్తూన్నారు. కలుషచిత్తుడైన కలశా వారి వెంట నున్నాడు.

రాజా—నీ పల్కు నా శాంతిసూచకముగా తోచ లేదు. కొంచెము శాంతించు.

ఖండో—ఇం కెక్కడి శాంతి? మహారాజుగారు మతి తప్పి సన్నిహితు లయినారు. సూర్యాజీ గుర్రమెక్కి వాయు వేగమున వారి ప్రాసాదమునకు పరుగెత్తుతూండగా రాజుగారెదురైనా రట. అతడు వెంటనే తోప్‌ఖానా దగ్గర దాగి ఉండి వారివైపు తొంగిచూచినాడట. అతనిచర్య అనుమానాస్పద మనిన్ని, శిర్కేతో సూర్యాజీకి సన్నిహితసంబంధ ముండి తీరుననీ, మహారాజుగారి చెవి కలశాకబ్జీ కొరికినాడు. వెంటనే సూర్యాజీని బంధించవలెనని మహారాజుగా రాజ్ఞాపించి మీవైపు దయచేస్తూన్నారు. ఇంకేమిదురంతము చేయ నెంచినాడో ఆ పరమోముఖవిషకలశము.

(తెరలో—మోసకాడా, గణోజీశిర్కే ఎక్కడున్నాడో చెప్పు)

అదిగో ఇటే వస్తూన్నారు. మీ రిక్కడే ఉండండి. నేను యేసూ (యశోదా) బాయిగారిని పిల్చుకొని వస్తాను.

(పోవును)

రాజా—దేవీ—నీవు లోని కేగుము. (ఆమె పోవును)

(సూర్యాజీని గెంటుకొని సంభాజీ వచ్చును. వెంట కబ్జీ, ఇద్దరుభటులూ వత్తురు)

సంభా—మూర్ఖా, విశ్వాసఘాతకా కొడిగట్టి ఏమి బావుకొంటినావు? బంగారుగోడలు కట్టిస్తావా? పెళ్లాన్ని రత్నములు చెక్కిన నగలలో ముంచుతావా? మహారాష్ట్రమును నేనొక్కడనే ఉద్ధరిస్తానని మీసములు దువ్వి గెలట వలె కులనాశకుని కొంపలో చేర్చినావా?... రాజారామ్ మహారాజుగారూ, మీరు మాకు సోదరులు కదా ఈ కుట్రవిషయ మునను మేము ప్రశ్నించగలము?

రాజా—మహాప్రభూ! మన మిద్దరమూ శ్రీ ఛత్రపతి శివాజీమహారాజుగారి సంతానములోనివారము — ఏకగర్భజనితులము కాకున్న నేమి? ఇట్టిమేటి మనరాష్ట్రమునకు ప్రతికూలముగా నడుపబడిన కుట్రనుగూర్చి నన్ను ప్రశ్నించవలసిన కారణ మేమి?

కలుశా—అయ్యా, సంభాజీమహారాజుగారిని పన్హాలా దుర్గములో బంధించి మహారాష్ట్రసింహాసన మపహరించ...

రాజా—కలుషాత్మా—నోరు మూసుకో—సోదరులమగు మేము మాటలాడుతూండగ మామధ్య పానకములోని పుడక లాగు పడుదువా?

సంభా—అతనిమాట అసత్యము కాదు. లోగడ జరిగిన ఘటనా సంచయము మరువదగినది కాదు. శిలాశాసన తుల్యమైన మన రాష్ట్రచరిత్రలో ఆ అంశము రూఢిగా చెక్కబడినది. ఆనాటివారు, ఆ రక్తబంధువులు, సోదరులు, మమ్ము బంధించి మాపరిపాలన మంత మొసగించదలచిన రాజా

రామ్ మహాప్రభువుగారు ప్రకృతముగ కూహకమునందు ప్రశ్నించ బడుట తగినదేమో అని అడుగుచున్నాను!...అబ్బా! నా కేమీ తోచకున్నది.

రాజా—కూహకముతో నాకెట్టిసంబంధమూ లేదు. మీ నిరంకుశవ్యసనాసక్తియే అట్టి సంబంధము కల్పించి యుండును. శంభాజీకన్న రాజారామ్ మేలని శ్రీ ఆబా సాహెబుగారు తలచినట్లే అష్టప్రధానులూ ప్రజలూ అనుకొనియుండవచ్చును. అందుకు నాపై దోషారోపణ చేయు నేల?...ఇదివరకు మీయెడ నే నేఅపరాధమూ చేసియుండ లేదు. ఇప్పుడూ చేయలేదు.

సంభా—రాజారామ్ మహారాజా! నేను కేవలం వీరు డను. అడవులలో వేటాడడము, శత్రువులతో సంగరము సల్ప డమూ నాచేతనైన పనులు. వీటికి ప్రతిగా సురాపానమూ మత్తకాశినులతో క్రీడలూ నాకు విశ్రాంతిస్థానములు. ఒరు లెవ్వరైనా నాజోలికి రాకుంటే విలాససహాయకమైన నాసుఖ నిద్రనుండి నేను మేల్కొనడమే అరుదు. భుజబలముచేతనే కాని బుద్ధిబలముచేత కార్యము సాధించడము నావల్ల కాదు; నాయెడ అన్యులు దానిని ప్రయోగించడము నేను సహించ లేను. నేను సింహాసనాసీనుడనైతే మన రాజ్యమునకు ఉపద్ర వము సిద్ధించునని నమ్మకముచేత నన్ను జన్మాంతమూ కారా గారమున బంధించడముకన్న శ్రీరాజారామ్‌గారిని ఛత్ర పతిని చేసి సింహాసనాసీనులు చేయవలసినదని అష్టప్రధానులూ

నన్నడిగియుంటే తక్షణమే రాజపదవి త్యజించి అతివినయముతో నా ప్రభువునకు వందన మాచరించియుందును. అట్లు చేయకుండిన నేను భోంసలేవంశజుడనే కాకపోవుదును.

రాజా—పరమసంతోషము. "యథా రాజా తథా ప్రజాః" రా జెల్లప్పుడూ స్వార్థము త్యజించవలెనని ఆబా సాహెబుగా రంటూఉండేవారు. అందుచేతనే అష్టప్రధానుల కంతరాజ్య మప్పగించి వారు వైరాగ్యసూచకమైన కాషాయ కేతన మెత్తియుండిరి. భోంసలేవంశము వారందరూ అట్లే ఆచరించవలెనని వారి అభిప్రాయము. వారి తనయుల మన్యథాకరించ వచ్చునా ? ప్రభువుగారికి భోంసలేవంశ మర్యాద తెలియనిది కాదు. ఇట్టి సందర్భమున షడ్యంత్ర పాపము నా కారోపించడమున కాధారము కానరాదు. ప్రభుపాదములు సాక్షిగా ప్రమాణము చేసి చెప్పుతున్నాను. యావజ్జీవమూ భోంసలే ప్రభుత్వమును బాగు చేయవలెననే కాని తత్సింహాసనాధిరూఢుడను కావలెనని నాకు కోర్కెయే లేదు.

సంభా—అలాగైతే గణోజీని కోటలోనికి రానివ్వనేల ?

రాజా—నా కతనితో నేమీ సంబంధము లేదు. అతడు కోటలో కేలాగు వచ్చెనో నే నెరుగను. లోగడ జరిగిన కార్యసంచయముచేత ప్రభువారి చిత్తమందు గట్టి అపనమ్మకము కలిగింది. చాలాకాలముకిందటనే మావళాలపై

మీకు సంశయము కలిగినట్లు నే నెరుగుదును. ఇప్పుడు నేను చేసిన ప్రమాణానంతర మట్టి శంక ఉండగూడదని నా ఊహ.

కబ్జీ—ప్రాణోపద్రవ మాసన్నమైనప్పుడు ప్రమాణము చేయడము భోంసలేవంశజులకు పాడికాదు-మహాకాళి మాట తప్పవునా ?

సంభా—రాజాగారూ, భవానీసాక్షిగా చెప్పండి-గడియకిందట పిసాళ్ హాతకుడు ఇక్కడుండెనా లేదా ?

సూర్యా—ఆహా ! ఉన్నాను. వాడుకప్రకారము కారాగారబద్ధుల కుశల మారయుట కిక్కడికి వచ్చినాను.

సంభా—కైదీల క్షేమ మరయుచుంటివా? నీ ప్రభువు మెడపైని శత్రువులు కత్తివేయ యత్నిస్తూంటే అది మరచి నీవితరవిషయము లరయుటకు హేతువేమి ?

సూర్యా—నే నప్రమత్తుడనై ప్రభుసేవయే చేస్తూంటి నని ప్రమాణపూర్తిగా నివేదించుకొంటున్నాను.

సంభా—ద్రోహీ ! ప్రమాణముమాట ఎత్తకు. నీ మాటే నిజమైతే గణోజి రాయగడదుర్గము చొరగలడా ?... రాజారామ్‌మహారాజా, నిస్తుల సత్వసంపన్నులు ప్రభువిశ్వాసధురంధరులు నైన మీబోటిధైర్యశాలురు షడ్యంత్ర మనే సంజీవి పోయకుంటే పిసాళ్ వంటి పీనుగులు మాఎదుట సంచరించగలరా ?...ఒక్కమాట మరువకండి, శిర్కేల పీకలు తెగనరికిన ఈ చేతు లింకా గాజులు తొడుక్కోలేదు. రాజ

ద్రోహులను గాడిదెలపై ఊరేగించి కొండమీదనుండి తోయించితీసుతాను...సూర్యాజీ, ఇప్పుడేనా నిజము చెప్పి ప్రాణాలు దక్కించుకో ... మాట్లాడవేమి ? ... ఎవరురా అక్కడ ? కొరడాతో వీనిని కొట్టు—(అట్లు చేయుదురు) కానీ, కానీ, ఇంకోసారి ... ఆగు ... సూర్యాజీ—ఊరక ప్రాణము లెందుకు పోగొట్టుకొంటావు ? ఇప్పుడైనా నిజము సవిస్తరముగా చెప్పితే క్షమిస్తాము.

సూర్యా—కుట్రయే లేదు—నే నేమి చెప్పగలను ? నన్ను నిష్కారణముగా నిందించి దండిస్తున్నారు మహాప్రభూ !

సంభా—ఆహా. ఇంకా నిరోగము మళ్ళలేదు. దౌలతీ, ఎత్తు కొరడా ! కానీ ! ఇంకా ! ఇంకా ! (యేసూ బాయి ఖండోజిన్ని పత్తురు).

యేసూ—(తెరలో) దౌలతీ, ఆగు.

ఖండో—మహారాణీసర్కార్ దయచేస్తూన్నారు. కవి, ఇక్కడనుండి పో.

కవి—(తనలో) నా పన్నుగడ మధ్యనే మడిసే టట్లుంది. మహారాజుగారి నిక్కడినుండి తొలగించవలెను, లేదా ఖండోజిని తగిలివేయవలెను. లేకుంటే నా పరపతికి భంగము వాటిల్లుతుంది...(పోవును)

ఖండో—(తనలో) గణోజీని కోటలో ప్రవేశ పెట్టినవా డీకలుషాత్ముడే కావచ్చును. వీనిపై నొక కన్ను వేసియుండ వలెను. (వెళ్లును)

(యేసూబాయి వచ్చును)

యేసూ—ఏమి చేసినాడి? ప్రభువుగా రింతదూరము
రావలసివచ్చినదా? సూర్యాజీ, ని వేదో గొప్ప నేరము చేసిన
నుంది. దుర్గాధ్యక్షులు కిట్టి తగునా? నురరగారి మొగము
న్నపోయిందే మిది? కన్నీళ్లు కారుచున్నట్లున్నది. పెడ
మొగము పెట్టినా రేమి? నాతో మాటాడరా?

సంభా—ఏమని మాటలాడగలను? మొగము చూడ
నికి ధైర్య ముండవద్దా? దేవి, నీ విప్పు డెవనిని మాటా
ంచ నెంచుచున్నావో, వాని సహాంగత్యమునకు ప్రతి
లుదు సుమా!

యేసూ—ఈ విషము మీకు పెట్టినవా రెవరు?
లసర్పమునోటినుండియే ఇట్టి విషము వెడలుచుండును.
తరు లింత పాపమున కొడిగట్టి నోరు చెడగొట్టుకోరు. ఇట్టి
సత్య మెవ రాడినారు?

సంభా—దేవీ, కాశీవాసి కాళీభక్తాగ్రసరుడు మహా
మాంత్రికుడైన కలశాకర్షి మహాదేవి ప్రత్యక్షమై స్పష్టాం
కరించిన వార్త అసత్యమగునా?

యేసూ—ఈవిషయమున మాంత్రికుని ఊహించుటకు?
ది నా సౌభాగ్యమునకు సంబంధించినదని మీరే సూచించి
గారు. దాని తొలగింప యత్నించేవారిపక్షము నేను వహిం
పనా? ఇదివరకు అయిదారుమాసములనుండి అర్ధమాసము రెండు
సారులైనా చూడక నేను దేవి నారాధించలేదు, భోజనము

చేయలేదు. అట్టియెడ వారైనా కుట్ర చేస్తూన్నట్టయితే నాకు తెలియకుండునా? కోటలోని చాటింపు విన్నాను. తోడనే పిసాళ్‌ను రాజనగరు కంపి నే నంతఃపురమున కేగినాను.

రాజా—(తనలో) ఈ సాధ్వి నన్ను రక్షించుటకై శుద్ధాబద్ధ మాడింది.

సంభా—దేవీ, కబ్జీ అసత్యవాది అని కాబోలు నీవు చెప్పదలచితివి!

యేసూ—నే నిప్పు డట్లు నిశ్చయముగా చెప్పలేను, చెప్పినా మీరు నమ్మజాలరు. కబ్జీమాటయందలి నిజము నిలకడప్పై తేలును. కాళికాదేవి మాటకు కబ్జీ అపార్థము చేసి యుండునని మాత్రము చెప్పగలను...భోంసలేవంశజులు చేసిన పుణ్యము గొప్పది కావున మూడు తరాలనుండి మహాకాళి వారికి ప్రత్యక్షము కావడ మనుభవసిద్ధము. మాంత్రికుల మాటలు నమ్మడము మన కులమందు లేదు, ఇప్పుడు మొదలు పెట్టడానికి తగినంత ఆవశ్యకత కానరాదు. కలశాను నిర్బంధించి అడుగుతే నిజము తేల్తుంది.

సంభా—దేవీ, నీ మనస్సమాధానమునకు కబ్జీమాట నిజము కాదని ఎంచినా శిర్కేల రహస్యాలోచనలకు గూఢ వర్తనమునకూ రాజారామ్‌గారి ప్రాపు లేదని మేము నమ్మడ మేలాగు? లోగడ ఈశిర్కేల సహాయమువల్లనే కదా అష్ట ప్రధానులూ పహ్నాలాలో మమ్ము పడతోసి ఈ రాజారామ్

గాదిని గద్దెపై కూర్చుండఁబెట్టఁదలఁచినారు. అట్టి శిర్కేలయెడ ఈరాజారామ్‌గారిప్పుడు నిర్దుష్టులై యున్నారని ఎంచవచ్చునా ?

యేసూ—ఎంచడానికేమి ప్రతిబంధకము ? నిస్సందేహముగా నమ్మవచ్చును. ఇతడు నిర్లిప్తుడే... దక్షిణాపథ సామ్రాజ్యశోభ నిలుపఁగలచిన రాజరత్నములు దాయాదవైరము కల్పించుకొని దేశమున కరిష్టము తెచ్చిపెట్ట నుద్యుక్తులు కాఁగూడదు. గతము ననుసరించి ప్రభువుగారికి మరదిగారియెడ సందేహము కల్గడము సహజమే. కేవలానుమానము ప్రమాణము కాదు, సిద్ధాంతము కాదు. పన్నగడకు ప్రత్యక్ష నిదర్శనము లేనిదే ప్రభువువారు తీర్పు నీయరాదు.

సంభా—దేవీ, ఈవిషయమున మన కిద్దరికీ అభిప్రాయభేదము కలిగింది కావున సూక్ష్మతర పరిశోధన ఆవశ్యకమని నిశ్చయించినాను...సరే...తదనంతరము నా అభిప్రాయము కనుకూలములైన నిదర్శనము లగుపడితే ?

యేసూ—అప్పుడు నేరస్థులను నా ఎదుట పర్వతాగ్రమునుండి క్రిందికి పడఁత్రోయించెదను.

సంభా—మంచిది. దాలతీ, ఈపిసాళ్‌ను చెరలో నుంచు. కబ్జీని కలుసుకొని కార్యక్రమము నిర్ణయించవలెను.

(పోవును.)

రాజా—కబ్జీతో కలిసి కార్యక్రమము నిర్ణయించబడునా ? మహారాణీగారూ, వింటిరా ? న్యాయాన్యాయములు

షాహీ—నిస్సందేహముగా. ప్రాణములున్నంతకాలము అందుకు పాటుపడుతాను. కులగౌరవము కాపాడకుండు చంద్రావళి చెరవిముక్తి యత్నోపాయములు నాకుపదేశించినవారికి అత్యంతకృతజ్ఞుడనై యుంటాను.

ఖండో—ఉపాయము నే నెరుగుదును.

షాహీ—ఆహా! కర్ణామృతమైన మాట విన్నాను.

ఖండో—కర్ణామృతము కాదు, కాలకూటము! గణోజి మన కోటలో పిఠూరీలు లేపడము వినియే యుంటారు. నేరుగుదువుకదా?

షాహీ—ఔను. ఆ ఊసిప్పు డెందుకు?

ఖండో—ఆ కుట్రలో కబ్జీ కలిసినాడని నా నమ్మకము. మహారాజవారునూ మహారాజ్ఞీ కూడా ఈ విషయమున నాతో ఏకీభవించినారు—కబ్జీరహస్యాలో చనాసుంచిరము మీరీరాత్రి చొచ్చినట్లయితే మీ అర్ధాంగి చంద్రావళిని మాకడమే కాక ద్రోహులగుట్టు కూడా కనుక్కోవచ్చును.

షాహీ—చంద్రావళి అక్కడెందు కున్నది?

ఖండో—ఆ లావణ్యరాశిని హరించవలె ననే కబ్జీ ఆమెను కారాగారమునను హోమీగా ఉంచినాడు.

షాహీ—ఎంత కుట్ర!...ఇక చాలు...నా సంతాపమనివార్య మౌతూంది...ఇప్పుడే పోయి కబ్జీని కాలునింటికి పంపనా?

ఖండో—అయ్యా! కొంచెము తాళండి. మహారాష్ట్రుల కళ్లలోని నలుసుగా వర్తిస్తూన్న కబ్జీ ప్రమత్తుడై

యుండునా? ఆబాసాహెబుగారస్తమించిన దగ్గరనుంచి కబ్జీ కట్లుబొమ్మలాగు సంభాజీపక్క చేరి చెప్పుడుమాటలచేత అతను తనువంతా విషాక్తము చేసి ఎన్నికగన్న శూరుల నెందరినో రహస్యముగా అంతమొందించినది మీ రెరుగరా? కావ్యవాదులు బుద్ధిశాలురు నైన మహారాష్ట్ర యోధుల నణగద్రొక్కి అష్టప్రధానుల అధికారము తా నొక్కడే చలాయిస్తూన్నది ప్రత్యక్షమేకదా? వీడు యావన కులమునకు ముసలమువలె మహారాష్ట్రమునకు దాపురించి నాడు. వీని నిరంకుశాధికారము మహారాజుగారి అనుమతి చేత సాగుతూన్నది. కోశములో ధనమంతా దుర్వ్యయము చేయించినాడు. మన సేనలకు జీతములు పుట్టలేదని వారు మొరపెట్టితే ప్రజలను లూటీకొట్టి ఎవరికి చిక్కినదానితో వారిని సంతోషించ మన్నాడు. ఆబాసాహెబుగారు యావ జ్జీవమూ ధారపోసి మావళేసేనలో ప్రతిష్ఠించిన శాంతీ దాంతిస్ని క్షణములో సన్నగిల్లినవి. అంతటా అధర్మము తాం డవమాడుతూన్నది. ఈ చక్రము తిప్పుతూన్నవాడు కబ్జీ; వానియందు మహారాజుగారికి తగనినమ్మకము అమితగౌర వము—వాని కపాయము చేయదలచినవారిని తత్క్షణమే నిర్మూలించకుంటే మహారాజుగారి కోపము చల్లారదు; నోటి కాహారము పోదు, కంటికి నిద్ర రాదు. అట్టివానిపై కత్తి నెత్తడము అవిమృశ్యకారిత కాదా? అందువల్ల లాభ మేమి?

షాహీ—నీమాట నిజమే. కాని కలుశాకాలసర్పమును కాలునింటికి పంపితేనేగాని నా చిత్తమునకు శాంతి లేదు. వాని విషమునకు విరుగుడే లేదా ?

ఖండో—లేకేమి, అది యత్నసాధ్యము. నేటిరాత్రి వాని రహస్యాలోచనామందిరము చేరి అచ్చటి వ్యవహారము సమూలముగా రేపు మహారాజుగారితో "ఇదిగో సూర్యుడు, ఇదిగో సైంధవుడ"ని నిర్ధనపూర్వకముగా వెల్లడి చేస్తే అందుమూలాన చంద్రావళికి సంక్రమించిన దేహపీడ మాత్రమే కాక మన గాష్ఠ్రిను నావహించిన తరుగు రోగముకూడా తొలగుతుంది.

షాహీ—అ దెట్లు సాధ్యమగును ?

ఖండో—ఉపాయశాలులగు మీరే ఊహించండి. అతి జాగరూకతతో మెలగవలెను సుమండీ. నేను పోయివస్తాను. మీ కోర్కె సిద్ధించుగాక ! (పోవుదురు)

నాల్గో రంగము

రాయగడకనుమలో మందిరము.

చంద్రావళి—ఖాశాబా.

ఖాశా—ఈ చంద్రావళి మనస్సు తనవైపు తిప్పుమని కబ్జీ నన్ను నియోగించినాడు కాని నాబోటి దరిద్రుల మాటలు నవయువతులకు నచ్చునా? అలాగైతే కబ్జీకి తోసి రాజని నేనే దీనిని దక్కించుకొందును. నా దుష్కర్మవశమున

కురూపి నైనాను, అందుచేత తాడుకట్టి నదే నన్ను తలపదు. చిన్నప్పుడే దానిని తలిదండ్రులు నా మెడకు కట్టినారు గనుక విధిలేక నా పెళ్లాము నన్ను కనిపెట్టుకొని ఉంది...ఈ చంద్రావళి నెలరోజులనుండి నాతో కలిసియున్నా ఒకసారియైనా నావైపు చూడదు, ఒక్కమాటైనా ఆడదు...ఇందుకు నాకొక పోటీదారు ఉన్నాడు సర్జాబా. వాడూ దీనిపైని కన్ను వేసినాడు,...మా కిది లొంగడము పాలుశక్కి.

(తెరలో ఖాశాబా అని పిలుపు.)

అదిగో, కొంప మునిగిపోయినట్లు నా డిప్పుడే వచ్చినాడు. ఓహో! ఏమి ఈ వృద్ధభల్లూకము వైఖరి! గర్భాధానపు పెళ్ళికొడుకులా గలంకరించుకొన్నాడు—రానీ—ఇక్కడికి ముగ్గురము సరసులము దాపురించినాము. ఈ చంద్రావళి మాఅందరి కళ్ళలోనూ దుమ్ము జల్లేటట్లున్నది.

(సర్జాబా వచ్చును)

సర్జా—ఏమండీ దొరగారూ, పిలుస్తే పలకనేలేదు?

ఖాశా—అదేమో? నీవని ఏలాగు గుర్తుపట్టడము? ఇక్కడ భూతాలూ పిశాచాలూ అప్పుడప్పు డరుస్తూంటవి. నీవు మనుష్యుడ వేనా?

సర్జా—బాగా చూడు—నీకళ్ల కేలాగు కనబడుతూన్నాను?

ఖాశా—మనుష్యులలాగు కనబడ్డవా రందరూ మానవులు కారు. నరపశువు లనే జాతి ఒక టుంది.

సర్జా—నీ వాజాతికి చెందిన ట్టున్నావు.

ఖాశా—పహారా విడిచి లోని కెందుకు వచ్చినావు?

సర్జా—కోటనుండి దూత వచ్చినాడు.

ఖాశా—ఏమి విశేషాలు ?

సర్జా—చీకటి పడ్డతరువాత ఏదో అగత్యాపుపని మీాద వాళ్లు కొందరు మహానీయులతో వస్తారట. జాగ్రత్తగా నుండుమని చెప్పినారు.

ఖాశా—రాత్రి అంతా రహస్యాలోచనలు జరుపు తూండడముచేత కును కన్నది లేదు. అప్పుడే చీకటి పడు తూన్నది. కొంచెము వెన్ను వాలిస్తే మంచిది.

సర్జా—నీవు పోయి పడుకో—నేను దీనితో రెండు మాటలాడి వస్తాను.

ఖాశా—నీ కాలు గడపదాటితేనే కాని నా కన్ను మూాతపడదు. దయచేయుండి రామ్‌రామ్.

సర్జా—నేను దీనితో మాట్లాడితే నీ కొం పేమి మునిగింది !

ఖాశా—మెత్తని మాటలతోనే కార్యము సాధించు కొనేవాడవు, ముసలివాడ వైనావు. ఈ చిలిపిఆట లిక మాని భగవద్ధ్యానము చేసుకో.

సర్జా—నన్నెత్తిపొడు స్తున్నావా !

ఖాశా—పని న్నాపకము పెట్టి గాపలో కొంత విశ్రాంతి తీర్చుకొంటాను...(ఇద్దరూ పోదురు)

చంద్రా—హా! దైవమా! నా పాట్లింత మొందినావా? పతివియోగబాధతో ఇంకెంత కాలము ప్రాణములు భరించగలను?...హా నాథా! నేనావారి నంతటికీ సముద్రోత్సాహము జనింపజాలు సజీవమైన నీవాక్కును నీ భార్యమానము సంరక్షింపకుంటే వారికి తలవంపు కాదా? నీ ప్రాణేశ్వరి ఆశామాత్రజీవియై యున్నది...దానికి సుఖము చేకూరునో లేదో?...ప్రాణేశా! నాప్రాణము తహతహ పడుతూన్నది. దుఃఖము నిర్భర మౌతూన్నది—ఏమి చేయగలను?

(సర్జాఖా వచ్చును)

సర్జా—ఖాశాబా కన్ను మూసినాడు. వాడు లేచే లోపల దీనితో మాట లాడుతాను...నే నిదివర కెందరి కాంతలనో వలలో వేసుకొన్నాను కాని ఈ చంద్రావళి ముందర నా పాచిక పారేటట్టు లేదు...ఇది మహాసాధ్వివలె నటిస్తూన్నది...చెప్పవాల్చిక మోహాకృష్టులు పరిపినాను, కథలు చెప్పినాను, పాటలు పాడినాను, మాట లాడినాను...కర్ర బొమ్మలాగు ఒకదానికీ మారు పల్కదు. సామదానభేదములు సాగలేదు. దండింతా మంటే ఖాశాబా కబ్జీతో చెప్పునేమో అని భయము...ఇంకోసారి యత్నిస్తాను. (పైకి) చంద్రావళీ, చంద్రావళీ!

చంద్రా—ఎవ రాపిల్చినది?

సర్జా—నేను సర్జాఖాను.

చంద్రా—పాపాలభైరవుడా ప్రత్యక్ష మైనావా?

సర్జా—పూజనీయురాలా! ఇట్లెంత కాలము పటపట కొట్టుకొంటావు? నీ యవ్వనమంతా వ్యర్థమవుతూన్నది. ఎన్నాళ్ళిట్లు కష్టపడుతావు? నావంటివాడు...

చంద్రా—ఓరీ, కష్టబడడానికి తగినంత ధైర్యము నాకుంది. నీకు నియమింపబడిన పహారాస్థలము విడిచి లోపలికెందుకు వచ్చినావు?

సర్జా—నిన్ను చూడక తీరకుండలేను. నీవు నిరంతరదుఃఖవై బాష్పధారాకలుషితనై కాలము గడుపుతూంటే నాకు ప్రాణసంకటముగా ఉంది. నీ దుఃఖోపశమనము చేయవలెనని కాంక్ష కలుగుతూంది.

చంద్రా—నీకు నేను యజమానురాలవంటిదానను కనుక నా దుఃఖము నీకు నిర్భరము కావడము సహజమే.

సర్జా—వట్టి మాటలవల్ల నీ దుఃఖము తీరునా? నాకోర్కె తీరేనా?

చంద్రా—కోర్కె తీరేది ఏమిటి?

సర్జా—చంద్రా! నీ వెంత బేలవు! ఈమాత్రము గ్రహించలేవా? నీవు నవయువతివి, కమనీయగాత్రవు. నీశోభ అడవిగాచిన వెన్నెలయింది. దానివల్ల నీ వేమి సుఖపడుతూన్నావు?—మానవులకు వివేక ముండవలెను.

చంద్రా—నీమాటలు నాకు బోధపడలేదు.

సర్జా—గడుసు పోకడలకు పోకు. నామనసులో మాట నీకు తెలియనే లేదా? ఏదీ, తెలియులేదని నాచేతిలో చేయి

వెయ్యి. తేటతెల్లముగా తెలియబడ్తాను. ఇది నీ కిష్ట మేనా ?

చంద్రా—ఓరీ పాపీ! ఏటిమీాద ఏడు పడ్డకొద్దీ నీబుద్ధి బూడిద అవుతూాన్న దా? నీ అంతరమేమి? నా అంతరమేమి? నోరు మూాసుకొని పో.

సర్జా—టక్కులాడీ—పెంకెవేషము వేస్తే ఇంక నీపాట్ల కంత ముండదు. బుద్ధికలిగి వర్తించు.

చంద్రా—అది నే ననవలసిన మాట— (ఖాశాబా వచ్చును)

ఖాశా—ఏమి టా కేకలు?

సర్జా—(ఊరకుండును)

ఖాశా—ఏమి మాటాడవు? నీ తపస్సు బెడిసికొట్టిందా ఏమి?

సర్జా—ఖాశాబా! మెలకువ వచ్చిందా?

ఖాశా—దాసి కేమిగాని మంతనము లాడ వచ్చి నావా?

సర్జా—ఇన్నేళ్లు వచ్చినవి—ఇప్పుడు మంతనము లేమి ఆ దినములు గతించినవి.

ఖాశా—అలాగా? దినములు గడిచి రాత్రులు మిగిలి నవా?

సర్జా—పరస్త్రీని పాపదృష్టితో చూడనని ప్రతిజ్ఞ పట్టినాను.

ఖాశా—స్వర్గ భోగము నాలుకలోంటే అంతా మన వాళ్లే!

సర్జా—నీ శ్లోకా—కినితో నేను సంతోషము లేదు. నీవు కుతుకుతీసినావు—దీనిని కాచుకొని ఉండు. నేను బయటనుండి కబ్జీ రాగానే కబురు చేస్తాను—(పోవును, వెంటనే వికారరూపుడైన వేటకాడు విల్లెక్కుపట్టి వచ్చును)

వేట—పులి! పులి! పులి!

ఖాశా—అబ్బా! ఏమి భయంకరమైన రూపు! భూతము కాదుకదా! తడబడ కూడదు—నీ వెవడవు?

వేట—మనిషిని.

ఖాశా—అలాగా? నీరూపము చూస్తే సందేహము గానే ఉంది—అయ్యా, మీ రెవరు?

వేట—మనిషి నని చెప్పలేదూ?

ఖాశా—ఆఁ మనిషివే—అడవిపంది లాగు ముక్కుకి తిన్నగా వచ్చినావు. చీకటిపడ్డతరువాత ఉత్తరువు లేకుండా రాకూడదే?

వేట—నేను వేటాడిన మృగ మీదారిని వచ్చింది.

ఖాశా—ఈ గుహలోని మృగానికెందరు వేటకాళ్లు? ఇప్పటికి ముగ్గుర మున్నాము—నీవు నాల్గో వాడవు—దీనిని పెళ్లి యాడిన షాహీరుమాట తల పెట్టనే లేదు... ఈ మస్తరింకెంత రకూ విస్తరిస్తుందో?... అయ్యా, నీ మృగ మేజాతిది.

వేట—పెద్దపులి.

ఖాశా—మొగదా ఆడదా?

వేట—ఆడది.

ఖాశా—నిజముగా పులియా? లేక పులివంటి ఆడదా?

వేట—టక్కరిమాటలాడితివా తల బద్దలవుతుంది జాగ్రత్త!

ఖాశా—ఇతడు పిచ్చిదులా గున్నాడు—మచ్చిక చేసుకొంటే మేలు—మిత్రమా! ఇదిగో యిప్పుడే వస్తాను, నీ విక్కడ నుండు—(వెళ్లును)

వేట—చంద్రావళీ!

చంద్రా—ఎవరది?

వేట—మెల్లగా మాట్లాడు.

చంద్రా—నీవెవడవో ముందు చెప్పు.

వేట—(వేషముతీసి) ఇప్పుడు తెలిసిందా?

చంద్రా—హా! ప్రాణేశా! (కౌగలించును)

వేట—గోల చేయకు—కడచిన రెండుదినములలో కబ్జీ ఇక్కడికి వచ్చినాడా?

చంద్రా—రావడమే కాదు—గణోజీతో నేదో రహస్యాలోచన నడుపుతూన్నాడు.

షాహీ—ఖండోజీమాట నిజమే.

చంద్రా—నేడుకూడా వస్తాడు.

షాహీ—ఇప్పుడే వస్తాడా? ఎవడో వస్తూన్నట్లుంది, లోనికి పో (ఆమె పోవును)

(ఖాశాబా వచ్చును)

ఖాశా—నా అదృష్టము నేడు పండింది, సర్జాబా లేడు. ఈవేటకానితో మైత్రి చేస్తే నాకు చాలాలాభ ముంటుంది. (పైకి) మిత్రమా, నాకు కొంచెము నోటివడి ఉన్నది, లోపల కపట మేమీ లేదు.

వేట—అయ్యా, నే నడవిమనిషిని, నాకూ కపటము తెలియదు.

ఖాశా—ఓరి బాబో! ఈత డిప్పుడు ఉషారుగా నున్నాడు—(పైకి) అయ్యా పహారాలన్నీ దాటి లోని కెట్లు రాగల్గినావు? ఎవరికంటా నీవు పడ లేదుకదా?

వేట—పహారాలతో పనేమి నాకు? తాడు పట్టు కొని దిగి వచ్చినాను.

ఖాశా—ఈ కొండమీదినుంచే దిగినావా? మంచి సాహసికుడవే. లోగడ హీరా అనే గొల్లపిల్లని ఒక కొండ గుహలో చెరబెట్టినా రట—బురుజుమీాది నుండి ఆమె తప్పించు కొని తాడుసహాయమున పారిపోయిందని శ్రీ శివాజీమహా రాజుగారు దాని సాహసమునకు మెచ్చి ఆబుర్జుకి హీరాబుర్జని పేరు పెట్టినా రట—నేడు నీవు వరహావతారము ననుకరించి ఈ బురుజుమీాదనుండి దిగినావు గనుక దీనికి నేను వరాహబురుజని పేరు పెట్టుతూన్నాను. నీతోడి పరిచయము చేసుకోవడము మేలయింది.

వేట—మేలా! మరీ మేలా!

ఖాశా—నీ పేరు?

వేట—గోవిందు;

ఖాశా—నీ కిల్లూ వాకిలీ ఉన్నవా? లేక శాఖా మృగములాగు చెట్లకొమ్మలమీద వసింతువా?

వేట—శివాయి లోయలో నాయిల్లు—వేట నాకు జీవనోపాధి.

ఖాశా—ఒంటివాడవా? వెనకా ముందూ ఎవరైనా ఉన్నారా?

వేట—నా కెవరూ లేరు.

ఖాశా—నీవు నాకు బాగా నచ్చినావు—ఇక్కడ నాతో నుంటావా?

వేట—ఇంతకన్నా నా కేమి కావలెను? తప్పకుండా ఉంటాను.

(తెరలో—జే! అంబికే!)

ఖాశా—(తనలో) అదిగో కబ్జీ వచ్చినాడు. చిక్కు వచ్చింది. ఒకటి చేయబోతే ఇంకొకటి తారసిల్లింది. కబ్జీ కంట వీడు పడితే అతడు నాగొంతు కొరుకక మానడు. స్త్రీలోలుర కిట్టి చిక్కులు ప్రాప్తిస్తూంటవి. వీని నేమి చేయడము?

(తెరలో—జే! అంబికే!)

మిత్రమా, వచ్చినట్లే పారిపో. కొంతసేపు పోయిన తరువాత వృత్తాంత మంతా చెప్పుతాను.

వేట—పరుగెత్తి పోవడానికి ఏి లేదీ?

ఖాశా—ఈ తోవను పో!

వేట—సూటిగా పహారాజవాను చేతిలో పడు మంటావా?

ఖాశా—తాడుంధిగా. అది పట్టుకోని పైకి పో.

వేట—పిట్ట ననుకొన్నావా ఎగిరిపోవడానికి? నేనెక్కడికీ పోలేను. నీవన్నట్లిక్కడే ఉంటాను.

(తెరలో—జే! అంబికే!)

ఖాశా—నాకు మేకు వైనావే! వాడు వాకట్లో గొంతు బద్దలు చేసుకోంటున్నాడు. నీ విక్కడినుండి కదల కున్నావు. మధ్య నాప్రాణాలమీాదికి వచ్చినది. ఆ గూటిలో కూర్చో. లేకుంటే ఆరాతిచాటున అగుపడకుండా పడుకో.

(తేరలో జే! అంబికే!)

ఖాశా—జే! భవాని!

(తెరలో—జే! మహిషాసురమర్దనీ!)

ఖాశా—జే! అంబికే!

(తెరలో—జే! అంబికే!)

ఖాశా—(ద్వారము తెరచును. నల్లగుడ్డ ముసుగు చేత దివిటీతో కబ్జీ వచ్చును)

కబ్జీ—జగదంబ! జగదంబ! జగదంబ! ఖాశాబా! ఇంతాలస్యమేమి? ఏమి విశేషాలు?

ఖాశా—విశేషా లేమీా లేవు.

కబ్జీ—ఖుర్రదాని మనసు నావైపు మళ్లినదా ?

ఖాశా—కొంచమైనా మళ్లలేదు. ఎప్పటిలాగే ఉన్నది. ఈ ప్రసంగము తెస్తే దానినోరు కట్టిపోతుంది పెడ మోము పెట్టుతుంది.

కబ్జీ—కానీ కానీ— ఇంకా కొన్నాళ్లిలాగుంటేనే కాని దీని రోగము చప్పగా కుదురదు. శిర్కేవద్దనుండివార్త వచ్చిందా ?

ఖాశా—రాలేదు.

కబ్జీ—పాదుషావారి భృత్యుడు కానీ దూతగాని రానే లేదా ? మన గణోజీకి కష్టము రాలేదు కదా ? పహారాలు జాగరూకతతో నడుస్తూన్నవా ?

ఖాశా—అంతటా అతిజాగ్రత్తతో ప్రవర్తిస్తూన్నాము.

కబ్జీ—గణోజీ కబురు తెలియలేదు. నా పితూరీవల్ల అతనికి సంశయము పొడమినదా ?...జాగీరు నాశించి సంభాజీని మొగలుల కర్పిస్తానని ఒప్పుకొన్నాను. ఈకోరిక కొనసాగే దాకా విఘ్నములు కలుగుతూండును కాబోలు ! మహారాష్ట్రప్రభుత్వమును ఉత్పాటనము చేయవలెనని ఎంతో పాకులాడుతూన్నాను. ఈశిర్కే అజాగ్రత్తవల్ల నా ధైర్యమనుతుణమూ కుంగిపోతూన్నది. ఈ దేశమందలి అరాజకమునకు మూలకారణమనిన్నీ సంభాజీ దుశ్చరిత్రములకు సూత్రధారుడననిన్నీ నాపేరు జగమెల్ల మోగిపోతూన్నది-

నాకుట్రలు అచిరకాలమున ఫలవంతములు కాకపోతే ఈ ఖండోజీగాడు నాభరతము పట్టకమానడు.

(తెరలో జే! అంబికే!)

అదిగో గణోజీ వచ్చినట్టుంది. జే! భవానీ!

(తెరలో జే! మహిషాసురమర్దనీ!)

జే! అంబికే! (తెరలో జే! అంబికే!)

(ఖాశాబా తలుపు తెరవగానే ఇద్దరు వ్యక్తులు నిండు ముసుగులు దివిటీలతో వత్తురు.)

కబ్జీ—ఎవ రది?

గణో—సంభాజీ మృత్యుదేవత! నిరంకుశమైన భోంసలా ప్రభుత్వము పట్టపగలు నిర్మూలముచేయ నుద్యుక్తుడైన గణోజీశిర్కే!

కబ్జీ—గణోజీ! తాల్మి వహించుము! నీదెబ్బ నిరాఘాటమైనది—నేను మాత్రము వారికి ఛత్రమూ చామరమూ పట్టి అర్చిస్తున్నా ననుకొన్నావా? భోంసలా ప్రభుత్వము బూడిదెలో కలపవలెనని మన కందరికీ అభిలాష ఉన్నది. నీ వొక్కడవే తత్కార్యావిష్టుడవు కా నక్కరలేదు.

గణో—ఆవేశము వద్దంటావా? నే నాగలేను. నా శరీరము ఆపాదమస్తకము కోపాగ్నిచేత మండుతూన్నది. ఈ రాజాధముడు నా వంశమంతా నాశనము చేయడము నేను ప్రత్యక్షముగా చూసినాను. అదెట్లు మరువగలను? నా ఆప్తుల కళంబములు "వగబట్టి, కసిదీర్చుకో" అని అను

తీణముగా నా చెవులు బద్దలవునట్లు మొగసెట్టుతున్నవి— అభ్యంతరగృహము చేరేసరికి సౌభాగ్యచిహ్నములు లేక నిరంతరశోకాస్పదములైన మొగములతో బాష్పవృష్టి వర్షింప చూసి ఎట్లోర్వగలను? మావాళ్ల బొబ్బలు వింటే మతిపోయి తల పగిలిపోతుందనిపిస్తూంది. పరిస్థితు లీలాగుండగా ఆవేశ మనవసర మంటావా?

కబ్జీ—నే ననేదీ కాదు. మీవంశము నిర్మూల మయింది. ముసలివాళ్లూ ముద్దులొలుకు ముగ్ధబాలురూ బాలికలూ కూడ తెగనరుకబడ్డారు. మీ మేడలలో దీపము పెట్టు దిక్కులేదు... ఇవన్నీ వేరే చెప్పనక్కరలేదు. మీ జాగీరు తెలుసుకొంటే దాని నన్యాయముగా అపహరించిన భోంసలే వంశము నీవు నిర్మూలము చేయలేకపోతే వీరులకు పుట్టినిల్లైన శిర్కేవంశమందు మగవాడు మిగులనే లేడని లోకమంతా భావిస్తుంది; రేపు మేమే అంటాము... నీవు చేయవలసిన కార్యము ఘనమైనది. దాని నతిజాగ్రత్తతో సాధించుకోవలెను. కడుపులో కాలాగ్ని రగులుతూన్నా ముఖమందు మొలకనవ్వు తాండవమాడవలెను. ఇప్పుడే అల్లరిచేస్తే ఈ అరాజక మభివృద్ధి చెందదు.

గణో—ఆమాట నిజమే. ఇంక పల్కులవల్ల ప్రయోజనము లేదు, పని కావలెను. భోంసలా వంశనిర్మూల మయినప్పుడే నా ప్రతాపము ప్రకటిత మవుతుంది.

కబ్జీ—అదీ మాట—మీ గీవంశము నిర్మూలించవలసి నదే—నేనూ నాచేతనైన సాయము చేస్తాను. ఖాశాగా! దివిటీ తీసుకొని పో—చంద్రావళిని దూరముగా నుంచు. (వా డలాగు చేయును) మీరు రావడ మాలస్యమయిందేమి? (క్రొత్తవానిని చూపి) ఇత డెవడు?

గణో—మన యత్నములు కనిపెట్టి వీలైన సాయము చేయవలసిందని పాదుషావారు పంపిన శూరశిఖామణి—ఇక్లాస్ ఖాన్.

కబ్జీ—మంచిమాటే...అయ్యా! పాదుషావా రేమి నిశ్చయించినారు?...వారికి నావృత్తాంతము సవిస్తరముగా మనవిచేసుకొన్నాను. సంభాచారిద్యైన సంభాజీని వారి కొప్ప చెప్పుటకూ అందుకుగాను నాలుగు పదిలక్షలు రాబడి గల జాగీరు ఢిల్లీప్రాంతమున వారు నాకు బహుమతి చేయుటకూ ఒడంబడిక అయింది. ఆపైని పాదుషావారి చిత్తము నా భాగ్యము. రాయగడము శత్రునిర్భేద్యము కావున దీనికి పంచ క్రోశము లోగా నా కార్యము సాధించడమునకు వీలుండదు.

గణో—కార్యము నెరవేరిననాటిమాట చెప్పడెం దుకు? నిన్నెలాగు గౌరవిస్తారో పాదుషావారి ఖుషీ...మన మిప్పు డాలోచించవలసిన దేమంటే—సంభాజీగారిని పట్టి యిచ్చినందుకు పదిలక్షలజాగీరు అడుగడము భావ్యమా?

కబ్జీ—రాజకార్యములలో ఆరితేరినవారు మీరు... నే నడిగిన దెక్కువని మీ అభిప్రాయమా? సంభాజీ సాధా

రణరాజని మీరా లెంచకండి. మహారాష్ట్రమంతటికీ నిరంకుశాధికారి. అతడు చేతచిక్కితే కోటిరూపాయీ లాదాయము గల రాష్ట్రము పాదుషావారికి లభిస్తుంది—దక్షిణాపథమంతా వారి కవుతుంది. ఇంతలాభము వారికి చేకూర్చినందుకు పది లక్షలు బహుమాన మడుగకూడదా ?

గణో—సంభాజీని మహారాష్ట్రసార్వభౌమునిగా నెంచితే అతని వెల అనంతము. వెలలేని దానికి వెలవేయగలమా ?...తప్పతాగి తనకు తోచినరీతి వ్యవహరిస్తూన్న ఆ నరాధముని సార్వభౌమునిగా నెంచతగదు.

కబ్జీ—మన దృష్టికి సంభాజి చచ్చురాజు కావచ్చును కాని లోకమంతా అతనిని సమర్థుడనే పరిగణిస్తారు...నేటికి దాదాపు పదేళ్లనుండి పాదుషాపై కత్తినెత్తి, అసంఖ్యాకము లైన రోహిలా పఠాను సైన్యములతో ఏకధాటిని పోరాడుతూ, నలుదెసల మరాఠాబల్లెములను తిప్పుతూన్న సంభాజీ బాహుబలము ఔరంగజేబు నెదుర్కొనడానికి జంకేటంత దుర్దశకు రాలేదు...గణోజీ...మంచి ముత్యాలసరము సడలినంతమాత్రాన దానివెల తగ్గితే, తలమాసినవాళ్లంతా తనువులు ముత్యాలతో నలంకరించుకొందురు. ఎంత కాంతిమాసినా ముత్యము ముత్యమే; నిరంకుశుడైనా రాజు రాజే. అట్టి మహనీయుని ప్రాణము పాదుషా అరచేతిలో పెట్టినప్పుడు పది లక్షలపారితోషికము పాడికాదా ?

ఇఖ్లా—సంభాజీని చంపవలెనని పాదుషావారి కోర్కె కాదు.

కబ్జీ—ఖాన్‌సాహెబ్గారూ! నిసర్గశూరులకు నిధనము నిరతిశయసౌఖ్యదాయకము. అవమానము చావుకన్న అధమము. పాదుషాచేత చిక్కిన సంభాజీ ప్రాణాలతో బైటపడుతాడని ఎవరు చెప్పగలరు? సంభాజీ చస్తే నాకేమి? శిర్కే, నీ వేమంటావు?

గణో—కబ్జీ, నిపక్షము నీవు విశదీకరించినావు. సంభాజీని తనవశము చేయవలెనని పాదుషావారి పట్టుబట్టడము దక్షిణాపథమంతా నక్కించుకోవలెననే ఊహతోనే అని అందరూ ఎరిగినదే! రాయగడమునుండి ఐకుకోసుల దూరమునగాని తనకార్యము నెరవేరదని చెప్పుతూన్నావు. అలాగైతే పాదుషావారికి దక్షిణాపథము దక్కదు. భోంసలా వంశ మూలాలగోపాలము పాదుషావారి పరమైతేనే వారి కోర్కె నెరవేరగలదు. కబ్జీ చేతన్నెసపని మతితప్పిన మహారాజు నొక్కనినే పట్టియివ్వడమే. రాయగడము కూడా స్వాధీనము చేస్తే పదికాదు పాతికలక్షల జాగీరైనా కోరవచ్చును. ఒక్క సంభాజీ తలకు పదిలక్షల అవసరము లేదు.

కబ్జీ—అయ్యా, ధనాశకు లోపడి తలకు తగనిపని చేయజాలను. చేతకాని పనులకు పోయేవాడను కాను, నన్ను మీరు వీరుడన్నా సరే, భీరుడన్నా సరే.

గణో—అలాగైతే పదిదాకా పగుగైస్తు. కొంచెము తగ్గు.

కబ్జీ—నేను తగ్గను. సంభాజీ నా కేమి లోటు చేసినాడు? ఇరవై ఏళ్లనుండి ఈ రాష్ట్రములో నున్నాను. ఏదో రీతిని ప్రభువుపజ్జను చేరి పరపతి సంపాదించినాను—నే నాడిన దాట, పాడినది పాటగానుంది. రాజ్యతంత్ర మంతరి గుట్టూ మట్టూ నే నెరగనిది లేదు. నా కేవిధమైన లోపము రానివ్వ లేదు. నేనిక్కోసము కదా ఎంగిలి తినడానికి సిద్ధపడ్డాను. ఈవ్యవహారములో ఒకజాగీరు చిక్కితే నా దేశము పోయి హాయిగా పుత్రపౌత్ర పారంపర్యమూ ఎందునా లోపము లేకుండా జీవనయాత్ర గడుపుకొంటాను. కానికూడు తిన్నా కడుపు నిండకపోతే ఏమి ప్రయోజనము? ఆశాపూర్తి కాక పోతే పాదుషావారి ప్రాపుకై పాకులాడడ మెందుకు? ఇక్కడ నాకు ప్రాప్తించినదే పదిలక్షలు. అది తగ్గిస్తే ఇం కేముంది?

ఇక్లా—పాదుషావారు కార్యవాదులు గనుక మీరు కోరినంతా మీ కిస్తారు. అయినా గణోజీ చెప్పినట్లు మీరు కొంచెము తగ్గడమే మేలు. మీ కోరిక సుకర మౌతుంది.

కబ్జీ—అట్లు వీలులేదు. ఇదేమి కూరగాయల బేరమా? మహామండలాధిపతిని మభ్యపరచుట సులభకార్యమా? ప్రాణోపద్రవకరమైన పని; ఏమాత్రము గురితప్పినా సర్వనాశమే కదా?

ఇక్లా—గణోజీ! ఏ మంటావు?

కబ్జీ—నేను బైటికి పోతాను, మీ రాలోచించి ఏదో నిశ్చయించండి...(వెళ్లుతూ) నేనుతప్ప మీకు గత్యంతరము లేదు. సూర్యాజీని కారాగారమున భద్రపరిచినాను, అది మీకింకా తెలియదు. (పోవును)

ఇక్లా—గణోజీ—ఈమూర్ఖుడు భల్లూకపు పట్టు పట్టినాడే!

గణో—వాడి వేలుతో వాడికన్ను పొడుద్దాము. ఇప్పుడీమగతు కొప్పుకొందాము—నేను పాకులాడింది జాగీరుకోసము కాదు, రాయగడము కూడా దక్కుతుందేమో అని ఆశ పడ్డాను—అది వీడిచేత కాదు.

ఇక్లా—గణోజీ! నీకు మతిపోయి నట్లుంది. పదిలక్షల జాగీ రివ్వడానికి పాదుషావా రొప్పుకొంటారా? పదివేలన్నా నాకు సంశయమే.

గణో—ఈ మొండివాడు మనమాట వినడు. మన మేమి చేయగలము?

ఇక్లా—గొడ్డుగలవాడు గొడ్డుకేడిస్తే గొడ్డారివాడు తోలు కేడ్చినాడట. నీకు పగదీర్చుకోవలెనని ఉంది—సంభాజి పాదుషాపర మైతే నీకోర్కె సిద్ధించదని నీగోల! వీడి అవసరము వచ్చిందని వీడు కొర్రెక్కినాడు—కాస్తా కూస్తా కాదు—పదిలక్షలజాగీరుకి ఫైసలుచేసినా నంటే నా ప్రాణాలు తీసి వేయరా పాదుషావారు? వారి అనుమతి లేక నేనేమీ చేయలేను.

గణో—సమయానికి హాలకుండలో పటిక వేస్తారా? మిమ్మాశ్రయించినందు కిదా ఫలము? నాయత్న మంతా వ్యర్థము కావలసినదే?

ఇఖ్లా—వ్యర్థమేమి? సూర్యాజీ ఉన్నాడంటివిగా, వాడి మూలాన కార్యము సాధించుకొందాము.

గణో—అది వట్టిభ్రమ. వా డీపని చేయలేదు—ఇం కోటి—ఈకబ్జీ బ్రాహ్మణుడే కాని అతి నీచుడు స్వార్థపరుడు. వాడిని తోసివేసి మనము యత్నముచేస్తున్నామని తెలిసినదా మనకార్య మవశ్యము చెడగొట్టి తీరుతాడు. మనగుట్టు వీడికి తెలిసింది—ఎంతో కొంతకు ఫైసలుచేయడమే యుక్తము... కార్యార్థియైనవాడు గాడిదెకాళ్లు పట్టుకోవలసి వస్తుంది—ఇంకోమాట. సంభాజీ మాకులము ధ్వంసము చేసేటప్పుడు వీ డతనికి సహాయభూతుడైనాడు, కనుక నాశత్రుకోటిలోని వాడే వీడు. సంభాజీని మనకు వీ డప్పగించినవెంటనే వీడిని నేనంత మొందిస్తాను. హాగుహా జాగీరివ్వ నక్కరలేదు, నాచేతి చావే వీడి జాగీరు. కనుక నామాట విని ఒప్పుకోండి.

ఇఖ్లా—సరే—అందుకు నా అభ్యంతరము లేదు. కబ్జీని రమ్మను. (గణోజీ కబ్జీలు వత్తురు.)

గణో.—కబ్జీ—నీమరగతులు కొప్పుకొన్నాము.

ఇఖ్లా—ఇకను పోదాము. ఈ ఏర్పాటు సాధిదే కదా? కబ్జీ, సంభాజీని ఎప్పుడు ఎక్కడ ఏరీతిని మాకు స్వాధీనము చేస్తావు?

కబ్జీ—రేపు కోట వెడలిస్తాను. సాహుసాహెబ్‌గారి సంతకమూ మొహరూ ఉన్న దానపట్టా నా చేతిలో పడగానే అతనిని మీకు స్వాధీనము చేస్తాను. ఇక మీకు సమ్మతమేనా? సనదు నా కందేదాకా సంభాజీగాడు మీకు తెలియనివ్వను. ఇదీ మనస్సాంతికి నిశ్చయము.

గణో—సరే. ఇక మాకు సెలవు. సాహెబుగారూ, దయచేయండి. చంద్రోదయము కాక ముందు మన మీ చోటు దాటి పోవలెను.

కబ్జీ—మిమ్ము పంపి నేను కూడా రాయగడముకు పోవలెను. ఖాశాగా! దివిటీ తెమ్ము (అందరూ బైటికి పోవుదురు)

సాహీ—కబ్జీ! నీచా! బ్రాహ్మణుని గర్భవాసాన ఎట్టి చండాలుడవు పుట్టినావు! అన్యాయికుడా, సంభాజీ మహారాజు నీకు పాలుపోసి పెంచినందుకు కాలసర్పము తీరున అతనినే కరవదలచినావు. ఏజన్మానో పగబట్టి ఇప్పు డది తీర్చుకోదలచి మా ప్రభువును నీ వాశ్రయించిన ట్లున్నది. ఎట్టి క్రూరగ్రహమైనా కొన్నాళ్లకు రాశి మారి సౌమ్యమవుతుంది కాని నీవు మహారాష్ట్రకులమునకు ధూమకేతువువై చలనము లేక నిల్చియున్నావు. నాభాగ్య చెర విడిపించవలెనని ఇక్కడికి వచ్చినాను. ఇట్టి పరిస్థితులు నా దేశమునకూ నా ప్రభువుకూ సర్వనాశహేతువులు. మహారాష్ట్ర ప్రభుత్వ మంతటి గుట్టూ మట్టూ ఎరిగిన విశ్వాసఘాతకుడైన కబ్జీ

దురంతముచేత భ్రాంతుడై సుఖనిద్ర చెందుచున్న సంభాజీని మహారాష్ట్రమును కూడా కబళించవలెనని పొదుపొ కాచుకొని ఉన్నాడు—ఈ మహోపద్రవమునుండి నా రాజును రాష్ట్రమును కాపాడకుంటే నాభోగి కృతఘ్నుడనకు పట్టెడన్నము పుడిసెడు నీరు దొరకునా ?

చంద్రా—నాథా!

షాహీ—(ఊరకుండును)

చంద్రా—పలుకవే ప్రాణకాంతా! వియోగదుఃఖముచేత తపించబడుతూన్న నన్ను నీ మౌనముచేత హింసించెదవేమి?

షాహీ—నాకొరకు ఇన్ని పాట్లు పడుతూన్న నీతో ఏరీతి మాట్లాడగలను! నీదుఃఖముపశమింపజేయలేని అసమర్థుడను—కాలము అత్యంత ప్రతికూలము.

చంద్రా—నాదుఃఖము బాపవలెనంటే మీ గుసత్యవాగులు కావలెను—నాకొరకు మీరు ఇలాచారము కూల్చవద్దు—మనస్సు రాయిచేసుకొని ఏదో తీసుకొని ప్రాణాలు బిగపట్టుతాను.

షాహీ—పూచినపువ్వులన్నీ దేవతార్చనకే వినియోగించడానికి వీలులేదు. భవిష్యానుకోరని దూరగించడము వల్ల మన కీకష్టములు ఘటిల్లినవి—భగవంతుడు ప్రసాదించినదంతా మనమేలుకే అని దృఢముగా నమ్మి సంభవించిన కష్టములు సహిస్తూ గుండె రాయిమ చేసుకో.

చంద్రా—ఈ వాక్పుష్పములనే మీ ఉపదేశ ప్రసాదము నాపంచప్రాణములనే దోసిలితో స్వీకరించి శిరసావహి

స్తున్నాను. ఐనా జీవము బాసి దేహ మెన్నాళ్లు మనగలదు? విరహానలముచేత సగ్ధమౌతుందేమో అని భీతిల్లుతూన్నది.

షాహీ—నే నిప్పుడు చేయబూనుకొన్న కార్యము అత్యంత ప్రమాదజనకము—ఇందు విజయము చేకూరిందా మన మదృష్టవంతులమే. అపజయము గాటిల్లి నాకు ప్రాణహానిసంభవించెనా...

చంద్రా—సహగమనము చేస్తాను.

షాహీ—మేలైన పని. కొంతకాలము నీవు చెరలో నుండకతీరదు. నీవు పంచాగ్నిహోత్రమధ్యమున నున్నావు. అందరూ దుర్వినయాగ్నికి నిన్నాహుతిచేయవలెనని సిద్ధముగా నున్నారు. దీని నాధారము చేసుకొని కబ్జీని నామావశేషునిగా నీవు చేయవలెను. లేకుంటే పాదుషాప్రభావ మనే తేనెపూసిన కత్తిపదును గుచ్చి సంభాజీ మహారాజుకు మాపి గణోజీ తన పగతీర్చుకోక మానడు.

చంద్రా—ప్రాణేశా! నేను వీరపత్నిని—ఐదుగురు కాదు ఐదువందలమంది నన్ను చుట్టుముట్టినా నా మానము కాచుకోగలను. ఒకవేళ అట్లు చేయడము అసంభవ మని తోచెనా నా ఒడ్డాణము నాగొంతు కోయగలదు.

షాహీ—సరే— అజ్ఞురాలవు కావు. యోగ్యాయోగ్య విచక్షణ చేసి యుక్తరీతిని నడుచుకో పోయి వస్తాను.

(తెరదిగును)

సంభాజినిర్యాణము

రెండో అంకము

మొదటి రంగము

రహస్యాలోచనా మందిరములో సర్జాఖా

సర్జా—ఏ స్నోకములకు తీసుకొనిపోయి ఖాశాబా రెండు చెంపకాయలు కొట్టినా అవమాన మనుకోను—చంద్రావళిముందర నన్నీసడించినాడు, అందుచేత నాఒళ్లు మండుతూన్నది—నాయందు దానికి గౌరవ ముంటుందా? చంద్రావళికి నాహృదయము మెరిగించవలె ననుకొన్నాను, కాని ఈముండకొడుకు నాగుట్టంతా దానిముందర బైటపెట్టినాడు. నాకు వయస్సు చెల్లిందట, ఇక నేను రామా కృష్ణా అని జపము చేసుకోవలె నట—ఇది తలచుకొంటే అవమానాగ్ని నన్ను దహిస్తూన్నది—ఆతొత్తుకొడుకుని చావజంపి చెవులు మూసి చంద్రావళి నిక్కడినుండి దాటిస్తాను. ఈ గాడిదె కొడుకు గుడ్లగూబలాగు గుహవిడిచి బైటికి రాకుండా

ఉన్నాడు. లోపలనే ఉంచుదామంటే చంద్రావళి ఉంది— ఏమిసాధనము ?

(ఖాశాబా వచ్చును)

ఖాశా—హా! దైవమా! ఈ సర్జాబా కామినీ భూతములాగు నన్ను వదలకుండా ఉన్నాడు...పడుచువాళ్లు పంచబాణుని బారిని పడడము సహజము; పళ్లుపడిపోయి ఆరోప ఆసన్నమై కాటికికాళ్లు చాచిన సర్జాబా కేమి చేటుకాలము వచ్చిందో! బెల్లమును చీమ లాగు చంద్రావళిని క్షణమైనా విడువలే కున్నాడు. ముసలివాళ్ల కి మోహా దాహము కల్గించే మన్మథుడు ఒకసారి కాల్చి మహేశ్వరుడు తిరిగీ బ్రతికించినందుకు శాస్త్రిగా అతనికి త్రిమార్గ నెన్ని టెంకాయలు కొట్టినా నాకసితీరదు—అట్లు బ్రతికించినవాడు వయస్సుచెల్లినవాళ్ల జోలికి పోవద్దని షరతైనా పెట్టినాడు కాడు—నిన్న ఈసర్జాబాను తిట్టినాను, ధిక్కరించినాను, అవ మానపరచి చంద్రావళికి వీరియందు రోత కలిగేటట్లు చేసి నాను. నేడు తిరిగీ సత్రమండలి కుక్కలాగు సిద్ధమైనాడు. మొండిగాడిదెకొడుకు శృంగారచేష్టలు చూచి తీరవలెను. ఆయాల, ఆ గొంతుకసవరింపు, కూనిరాగము, చెముడుకాకి లాగు ఆ ఎర్ర దుస్తులసొంపు! హాయిహాయి! సానివాడకు తగిన వేషము! ఇట్టిది సంపన్నసంసార చంద్రావళిపట్ల సాగునా? ...ఎదవోయినగిత్తలా గున్నాడు.

సర్జా—చిక్కినావు చిలిపిముండకొడుకా, నీకు నూరేళ్లూ నిండినవి.

ఖాశా—వీడు నన్ను చంపుతాడు కాబోలు—గోవిందైనా లేడు దైవమా!

సర్జా—పంజాబుపసును బండబారిందా! పలుకవేమి? చావడానికి సిద్ధముగా నున్నావా?

ఖాశా—ఓరి పీనుగా! చావడాని కెవడైనా సిద్ధముగా నుంటాడా? నీవంటి మూడుకాళ్ల ముసలికూడా మృత్యువు కోరదు, పడుచువాడను నన్ను సిద్ధపడుమంటావా చావడానికి?

సర్జా—అడ్డువచ్చినవాళ్ళని హత్య చెయ్యడమే శూరులకు విధి—నా ప్రేమప్రవాహానికి అడ్డువచ్చినావు, నీ ప్రాణాలు తీసుకపోతాను.

ఖాశా—ఏదీ చంపు ఆవెనుక నా ప్రభావము చూతువుగాని—

సర్జా—ప్రాణము పోయినతరువాత ప్రభావము చూపుతావా?

ఖాశా—అదే నా కిటుకు—బ్రతికి చచ్చినవాళ్లు ప్రాణాల కాసిస్తారు చచ్చి బ్రతికినవాళ్లే సాహసులు.

సర్జా—చంద్రావళి విషయమై నిరాశ చేసుకొంటే నిన్ను చంపను.

ఖాశా—నీ వీలాగనడము న్యాయమేనా?

సర్జా—మాఱుమాటాడకు—దానిమీాఁద ఆశ వదలు కొంటావా?

(కబ్జీ దూత వచ్చును)

దూత—సర్జాఖా!

సర్జా—నీ వెవఁడు?...ఎవ రది?

దూత—పారావిడిచి పసిగట్టినా వేమి?

సర్జా—నీ వెవఁడవు? ఎందుకు వచ్చినావు?

దూత—కబ్జీ పంపితే వచ్చినాను. చంద్రావళిని తోడుకొని మీా రిద్దరూ కొండకిందికి రండి—మూటాముల్లె పట్టుకొని రండి, ప్రయాణము కావలెను.

సర్జా—ఖాశాఖా! ప్రయాణసరంజాము చెయ్యి.

ఖాశా—నన్ను చంపి చంద్రావళిని లోఁబఱచుకోవలె ననుకొన్నావు—నువయిద్దరనోట్లోను బెడ్డకొట్టినాడు కబ్జీ!

సర్జా—కబ్జీతో పని కత్తితో సాము—త్వరగా సరంజాము కానీ.

ఖాశా—లేడికి లేచిందే ప్రయాణము—సరంజాము కేముంది?

(పోవుదురు)

రెండవ రంగము

యేసూబాయి మహల్ — ఖండోజి.

ఖండో — రాత్రి గడచిపోయి, అంతకంతకూ వేళ మీరుగుతూన్నది. ఇంతవరకు షాహీరుజాదా కానరాడు. ఏమి గందరగోళము జరుగుతూన్నదో? పితూరీ మూలముల్నిగా కనుక్కోవలెనని రహస్యమందిరములో దాగినాడో కబ్జీచేతులలో చిక్కినాడో? ఇదే నిజమైతే మే మిద్దరమూ దగ్గర లేకపోవడము చూసి కబ్జీ కార్యము సాధించుకొంటాడు. ఈ గడబిడలో ఎప్పు డేది జరుగుతుందో చెప్పలేము. ఆసన్నములైన ఆపదలకంటె ఆసన్నము కానున్న అరిష్టములే మిక్కిలి భయావహములుగా కనబడుతూన్నవి. ఈ అరిష్టపరంపరాంతరమున నేమున్నదో ఊహించలేకున్నాను. తుపానులో చిక్కుకొన్న ఓడలాగు చిత్త మాందోళిత మౌతూన్నది. ముందూ వెనకా అడుగు పడదు, ఉన్నచోట ఊపి రాడదు. ఎటు చూసినా నిబిడాంధకారము... అయ్యయ్యో ఎన్నో తరములనుండి దట్టముగా అల్లుకొన్న పారతంత్ర్యాంధకారమును నశింపజేసిన మహారాష్ట్రప్రతాపసూర్యు డుదయించి ఎంతో కాలము కాలేదు. ఇంతలోనే అరాజకగ్రహణము ఆసన్నము కావడము చూస్తే స్వర్లోకవాసియైన ఛత్రపతి శ్రీ శివాజీమహారాజావారి కళ్లనుండి అశ్రుధారలు లొలుకవా? హిందూధర్మమును నానావశేషము [illegible] తురకలతో ధర్మ

యుద్ధము జరుగువేళ మహారాష్ట్రులు రక్తనాళములను శక్తి ములు నొసగునని పండరపుర విఠలస్వామిని ప్రార్థించిన భక్తుల కంఠములు గద్గదికములు కాకుండునా? ఔరంగ జేబుతో పోరు పొసగినవాళ్లు సర్వభక్షులమైయుంటిమి. అతను మాయెడ కత్తి ప్రయోజనకారి కాదని స్వానుభవమువల్ల తెలుసుకొని ఇప్పుడు కపటవర్తనమునకు దిగినాడు. ఆ కూట నీతిపటునితో మా బుద్ధిశాలులు సాటికారు — మా రాష్ట్ర సౌభాగ్యవశమున శ్రీమతి సాధ్వీశిరోమణి యేసూబాయి రాణియైనది — ఇదే మా కీడులో మేలు — అమెమూలాన మా ఆశాంకురమునకు అవసానదశ ఆసన్నము కాలేదు. (తెరలో) "అన్నా" అని పిలుపు.

ఆః. రా అమ్మా! రా! (సంతూబాయి వచ్చును)

సంతూ — అన్నయ్యా! బాగా చేసినావు లే.

ఖండో — ఏదో ఆలోచనల గొడవలో నీ మాట మరచి పోయినాను.

సంతూ — నీ ఆలోచనలు బంగారము గానూ! రాజుగారి మహల్ రాణిగారి అంతఃపురమూ చూపించి మహారాణిగారి దర్శనము చేయిస్తానని చెప్పి నన్నిక్కడికి తెచ్చి ఒంటిగా విడిచి వెళ్లిపోతావా?

ఖండో — నీ కేమి భయమే? వెర్రిదానా!

సంతూ — భయపడడము నాతప్పా?

ఖండో — తప్పు కాక?

సంతూ—ఏమి చేయుకొలను? ఎంత పృథపర్చుకొన్నా కడ తప్పలేదు. మాండు, నా కా శ్లేలాగు వనుకుతూన్నావో—నేను అసలు పల్లెటూరి దానను, పట్నవాసాల్లో తిరిగే టప్పుడు కొత్తచేత దిగులుగా నుంటుంది... నే నిక్కడ ఉండ లేను; నన్నింటికి పంపించు—రాజుగారి మహాలూ వద్దు, రాణిగారి దర్శనమూ వద్దు.

ఖండో—ఇదేమి మన ఇల్లనుకొన్నావా? మహా రాజుగారి మహల్. గట్టిగా మాటలాడకు.

సంతూ—మహలైతే మాటలాడకూడదా? అలాగై తే మన ఇల్లే మేలు.

(యేసూబాయి వచ్చును)

యేసూ—అమ్మాయీ! మా నగరులూ మేలైనవే—నిర్భయముగా మాటలాడు—నీవు జంకవద్దు—నిన్నెవరూ అడ్డుపెట్టరు—ఏమి ఖండో, చిన్నపిల్ల నెందుకూ బెదరిస్తూ న్నావు?

సంతూ—నీమాట లెంతో తీపిగా నున్నవి. నీ వెవరో గొప్ప యిల్లాలవు, మాఅన్న వట్టి గంగిగోవు. వీ డతి వినయ శీలుడు; కాని వీడి నేదో తగనిచింత బాధిస్తూన్నది. మహా రాష్ట్రక్షేమభార మంతా వీడే మోస్తూన్నట్టు భావిస్తాడు. మాతండ్రి గారికి వీడు ప్రయోజకుడు కావడము చూసు కొని ముచ్చటపడే యోగ్యత లేకపోయింది. ఈసంభాజీ

మహారాజే మా తండ్రి గారిమీద కోపించి నన్ను కాలికింద తొక్కించినారు. ఆమాట వీను మరచి తన పని చేయుడ ములో తప్పు రానీయడు. మహారాజుగారంటే మావాడి కమితభక్తి, గౌరవమూ భయము.

ఖండో—గొప్పవారిని అలాగేనా మాటాడడము? ఊరుకో.

సంతూ—చూసినావా? అమ్మా! నో రెత్తనివ్వడు, ఏమి అంటే మహారాజు అంటాడు, మహాలూ అంటాడు. మా రాణి యేసూబాయి మనస్సు చాలా మెత్తని విన్నాను. ఆమె చేరదీసి పెంచింది కనుకనే మావాడు ముందరికి వచ్చినాడు. ఆమెఋణము తీర్చుకోలేము. ఆమె నెప్పుడు చూతునా అని ఉబలాటముతో నున్నాను.

యేసూ—నీమాటలవల్ల వెనుకటిసంగతు లెన్నో జ్ఞప్తికి వచ్చినవి. యేసూబాయిని నేనే.

సంతూ—అమ్మయ్యో! ఎంత ప్రమాదము! మీ ముందర మహారాజుగారిని మాటలాడినాను. నాతప్పు మన్నించండి. మూర్ఖురాలను.

యేసూ—అమ్మాయీ! కలవరపడకు. నీమీద నాకు కోపములేదు. నిశ్చయముగా నిజమాడినందుకు నాకు చాలా సంతోషము. నీవు మట్టపుచూపుకై వచ్చినావని ఖండూ చెప్పినాడు. అప్పటినుండి నిన్ను చూడవలెనని ఉండెను. నీవే వచ్చినావు.

(దాసి వచ్చును)

దాసి—సర్కార్, షాహీ రఘునాథరావు సుస్కైడై వచ్చి ఇప్పుడే దర్శనము నను గ్రహింప వేచుతూన్నాడు.

ఖండో—వెంటనే రమ్మని చెప్పు. దాసీ, ఈమెకు తగిన సాయమిచ్చి మా యింటికి పంపు. అమ్మాయి నీవు వెళ్లు...

యేసూ—దాసీ, ఈమెకు సత్కారము చేసి మరీ పంపించు.

దాసి—చిత్తము. అమ్మాయీ, రామ్మా...

(వెళ్లుదురు)

(షాహీరు వచ్చును)

షాహీ—మోసము! ఘాత! ద్రోహము! సర్కార్, మహారాజుగారికి ఘోరమైన ఘాత సంభవించగలదు. పాదుషాచేత పదిలక్షుల జాగీరు పారితోషికముగా ఇప్పించెద నని కబ్జీ కాశ పెట్టి మహారాజుగారిని పట్టి యివ్వనున్నాడు గణోజి—కలుషాత్ముడగు వీ డందుకు సమ్మతించినాడు. ఈతని వలలో పడకుండా మహారాజుగారిని మీరు కాపాడవలెను.

యేసూ—అన్నా! ధనలుబ్ధు లెంత అక్రమమైన పని కైనా సిద్ధపడుతారు. గణోజీ! మన మిద్దరమూ ఏకగర్భ జనితులమే. నా ప్రాణనాధునియెడ నీ కింత పగ యెందుకు? రాజుగారిని రాష్ట్రమును సమూలమూ తురకల కప్ప గింతువా? నీవు చేయదలచిన ఈ అకార్యమువల్ల మన

కులమున కెంత అపకీర్తి ఘటించునో ఆలోచించినావు కావు.

ఖండో—అమ్మా! మీ రీరీతి ఖేదాశ్రుధారాపాతము చేత మా మనస్సులు తబ్బిబ్బు చేయకుండి. మనస్సు రాయి చేసుకొని మాకు ప్రాపుగా నిలుస్తే గణోజీ కఠారి మహారాజుగారి నంటులోపల ఎంతరమో గణోజి ప్రాణములు తీయగలము; మీ సౌభాగ్యసూర్యకిరణప్రసారము నిరాఘాటముగా సాగించగలము.

సాహే—ఖండోజీ, మంచిమాట చెప్పినావు. ఇక నాలస్య మెందుకు ?

ఖండో—గణోజీ ఒక్కడే కాడు, కబ్జీ ఇంకొకడు. ఆ దుష్టసర్పము మహారాజుప్రాపున చెలరేగుతూన్నది. దాని కోరలు క్షణములో నూడబెరికియుందును కాని మహారాజుగారికి కోపము వచ్చి అంతఃకలహములు ప్రాప్తించునేమో అని సంశయిస్తూన్నాను. వాడు బ్రతికియున్నంతకాలము మహారాజుగారికి కుశల మసంభవము.

(దాలతి వచ్చును)

ఏమి వార్తలు దాలతీ ?

దాల—ఇక్కడికి కోసుదూరమున నున్న మామిడితోటలోనికి పోదామని తులసి తన యావచ్ఛక్తి వినియోగించి మహారాజుగారిని ప్రోత్సాహపరుస్తూన్నది. కబ్జీకూడా

అదే వనిలో వ్యగ్రుడైన ట్లున్నది. అనలమున కనిలము తోడౌతూన్నది!

షాహీ—చూచినావా ఖండోజీ! మహారాష్ట్ర ప్రతాపసూర్యుని రాహుకేతువులు గ్రసింప నున్నారు; మనము వారి నంత మొందించి తీరవలెను, రక్తస్రావమునకు జంకకూడదు.

ఖండో—యుద్ధ మాచరించుట కాదు. ఈ దుండగులను బుద్ధిబలముచేత సాధించవలెను. మహారాణీగా రిప్పుడే మహారాజుగారిని సందర్శించబోతే కబ్జీ దూరముగా పోక తీరదు. అప్పు డన్నికష్టములు గట్టెక్కుతవి.

యేసూ—అత్యాదర మాపదనే శంకిస్తూండును. అదేమో కాని లేనిపోని అశుభకార్యసంచయము నా చిత్తమును కలతపెట్టుతూన్నది. ఇప్పటి సంకటములు తొలగునవే ధైర్యము చిక్కుకున్నది. ఈమాట విన్నాను కాను కదా అని పశ్చాత్తాపము పాల బడుదునేమో అనే శంక బాధించకుండా ఉండేటందుకు మహారాజావారిని సందర్శింప బోతూన్నాను. పైన దైవ మున్నాడు. జగదంబ మనకు క్షేమము చేకూర్చుగాక!

ఖండో—భవానీదేవి ప్రభావమువల్ల మన రాష్ట్రమునకు రానున్న రాయిడి తొలగిపోయినది. మీరు ఖిన్నులు కావలదు. గోబ్రాహ్మణపరిపాలనాపుణ్యము సంగ్రహించిన వారిని దైవ మెన్నడూ ఉపేక్షింపదు. దౌలతీ, యువరాజు

గారని తోచుకోనిరా (అతడు వెళ్లును) యువరాజుగారిని ఎదుట పెట్టితివా వీరియందలి మమత చేతనైనా మహారాజుగారు ప్రయాణము మానుకొంటారేమో చూతాము. (సాహసముతో) రహస్యాలోచనామందిరమందలి విశేషములు ఎప్పటికప్పుడు కనిపెట్టుతూ ఉండండి. (తెర వాలును)

మూడవ రంగము

మామిడి తోపు—కబ్జీ

కబ్జీ—ఇంకా సంభాజీ జాడ లేదు. ఇంతవరకూ తులసి ఏమిచేస్తూన్నట్టు? సంభాజీని నేను రాయగడము దాటిస్తానని ప్రతిజ్ఞలు పలికినాను. మహారాణీగారి మహాలులో నేడు జరిగిన గందరగోళముపట్టి నాయత్నము మొదటికే మోసము వచ్చేటట్లుంది. వస్త్రాలావినాహసందర్భమున ఘటోత్కచుడు కార్యభంగము కావించినట్లు ఖండోజీ నా కపట నాటక మెరిగి అందుకు ప్రతికూలముగా అభేద్యమైన వ్యూహము పన్ని నాప్రాణము తీయనెంచినాడు. నా రహస్యము వీడి కేలాగు తెలిసింది? రాజారామ్ మీద రాజుగారికి మొదటినుండి అనుమాన ముంది. అందుపైని గణోజీని కోటలో ప్రవేశపెట్టడము అతని ప్రోత్సాహముచేతనే అని చెప్పి మహారాజుగారి కోపాగ్ని ప్రజ్వలింప జేసినాను. ఇప్పుడు మరికొన్ని సమిధలు చేర్చి సోదరుల నిద్దరినీ వేరు చేస్తాను.

అంతట నామాట సరి. ఇక్కడికి వస్తే అక్కడికి సంభా వచ్చును. (తులసి వచ్చును) కాంత్యాలు తులసీ! మంచిసమయానికి మన కార్యము నెరవేరి మహారాజులో మోహావార్ధిని పడియున్నారా? పెద్దమనిషి నీబోటి పడుచును నమ్మకూడదు. సుమా!

తుల—పెద్దమనుష్యులు నమ్మకూడదు. నీమాట వేరు (నవ్వుచు)

కబ్జి—ప్రాణోపద్రవము ప్రాప్తించినప్పుడూ పరిహాసమే?... చేయరాని సాహసము చేసినాను. ఇప్పుడేనా మహారాజుగారిని కోట దాటించకుంటే మనకొంపలు మూసిపోతవి. సుమా!

తుల—నా తండ్రిని పడరాని పాట్లుబెట్టి తుదకు ప్రాణముకూడా హరించిన పాపాత్ముడు సంభాజీ అనాయాసముగా అంత మొందించబడే టప్పుడు క్షణికవిషయసౌఖ్యములో పడి కంఠమున ఉరి పోసుకొందునా? మనఃపూర్వకముగా నే నెవ్వరికి దక్కేదానిని కాను. ఇంతవరకూ రాజుగారియెడల ముగ్ధలాగు నటించినాను. ఇంకా ప్రౌఢత్వము చూపలేదు.

కబ్జి—ఇం కెప్పుడు చూపుతావు?

తుల—కోటలో జరిగిన కుట్రవల్ల రాజుగారి మనస్సు కొంచెము తల్లడ మొందినది. మనసిచ్చి నాతో మాటాడలేదు. అందుకే అలిగి యిక్కడికి వచ్చినాను.

కబ్జీ—సామ్రాజ్యమునకు హాని సంభవించేటప్పుడు నీ అలుకతీర్చడానికి పాటుపడే బంటు కాను సంభాజీ—అత డెవ్వరినీ మనసారా నమ్మడు. ఎలాగైనా అతనిని వెంటనే కోట దాటించవలెను. మన పన్నుగడ రాణిగారికి తెలిసిందని నీ వెరుగుదువా?

తుల—ఆమె కేలాగు తెలిసింది?

కబ్జీ—సరి స్వరముగా తెలియలేదు. సూచాయగా అనుమానము తట్టింది. ఎవరిమూలాన సాక్షిగా నదో చెప్ప జాలను...ఇదిగో అడలిపోవడానికిది అదను కాదు. కష్ట మాసన్నమైనప్పుడే కార్యవాది ధైర్యము వహించవలెను.

తుల—సుహారా ఇప్పుడే వచ్చును...సరే కాని, అతనిని మాయచేస్తానన్నా నదేమిటి?

కబ్జీ—పాదుషా వద్దనుండి పన్హాలతులజాగీరు సనదు నాచేతిలో శిర్కే పెట్టేదాకా సంభాజీకి శత్రుకబంటిసారాయి పోసి రహస్యమైన చోట సురక్షితముగా దాచి ఉంచుతాను.

తుల—అన్నిపాట్లెందుకు? బైటికి రాగానే పట్టియివ్వకూడదా?

కబ్జీ—కల్లబొల్లి పనులు కబ్జీచేయ కావు. గణోజీ కడుపులో కపటముంటే రెండింటికీ చెడుతాను. పిమ్మట చావే గతి, అది తప్పిందా, చిప్ప చేతబట్టి బిచ్చమెత్తవలసి వస్తుంది.

తుల—చిన్నిపిబుద్ధి శిక్షకి లేదు. అన్నమాట తప్పే వాడు కాడు.

కబ్జీ—అతడు పరమానిశ్చంద్రుడే! ఎవరిపట్ల? అతని జోలికి పోనివారిపట్ల. పగవానియెడ అతను పామువంటి వాడు. అతనికిపులకము సంభాషణ నాశనము చేసినప్పుడు నే నాకుట్రలో నున్నానని గట్టిగా ఎరుగును; అందుచేత నేను పక్కబెదురుతో మసలుకోవలెను, లేకుంటే అపాయము వచ్చునేమో... అదిగో! వస్తూన్నట్టున్నది. పక్కకు జారిపో.

తుల—ఇదిగో! దేవివచనము సత్యముకాదని చెప్పి మహారాణీగారు నిన్న రాజారామ్‌గారి చెర తప్పించినప్పటి నుండి మహారాజుగారికి నీపైని కోపము వచ్చింది. రాజారామ్ సూర్యాజీలపై నీవు మోపిన నేరముగురించి బాహాటముగా విచారణ చేయబూని నీ వాదము స్థిరపర్చి నిదర్శనము చూపించుమని అన్నడుగుతారట. అందుకు నీవు సిద్ధుడవై ఉండవలెను.

కబ్జీ—ఆచింత నీకు వద్దు. రాజారామ్‌పై మోపిన నేరము సిద్ధాంతీకరిస్తానని కదా రాజుగారని బైటికి రప్పించినాను. ఆమాట నురపించడానికి కావలసినన్ని క్లుప్తవస్తువు లిక్కడే ఉన్నవి. వీటికంటె బలవత్తరమైన సమ్మోహనాస్త్రము నీవు. ఇవన్నీ వ్యర్థము లయినప్పటిమాట కదా నిదర్శనము. నీవు చాటున నుండుము. (ఆమె పోవును. కబ్జీ దూరమున నుండును)

(సంభాజి వచ్చును)

సంభా—రాజారామ్ మా కుట్రలో లేడా? ఈమాట నిజమని ఎలాగు నిశ్చయించడము? రాయగడదుర్గము సురక్షితము కదా, శత్రువు లోపలికెట్లు రాగల్గెను? దుర్గాధ్యక్షునికి తెలియకుండా దూరడము దుర్ఘటము. పహరావాళ్లు ప్రమత్తులైనారా? లేక లంచాలు మేసి చూసిచూడనట్లూరకున్నారా? ఏది ఎట్లయినా దుర్గాధ్యక్షుని సాయము లేకుండా ఈపని జరిగియుండదు. అందుచేతనే అతను నా యెదుట పడలేక దొంగవలె నక్కినాడు... ఇక రాజారామ్- అతని తల్లిని కుడ్యస్థాపనము చేయించినందుకు అతనికి నాపై కోపము సహజమే. ఒకవేళ కాదందామూ? నా గర్భశత్రువైన గణోజీ సంబంధమున్న సూర్యాజీ రాజారామ్తోనూ అతని భార్యాతోనూ కలిసిమెలిసి నిస్సంకోచముగా తిరగడము చూస్తే రాజారాము విషయమున కేవలమూ నిర్దోషి యని నిశ్చయింపరాదు. ఈ పరిస్థితులను పర్యాలోచన చేస్తే దుర్గాధ్యక్షుడూ రాజారామ్—ఇద్దరూ అపరాధులే; వాళ్లని కారాగారమున బంధించడము యుక్తము. రాణీ అభిప్రాయము వట్టి భ్రాంతి. ఇప్పటికి తొమ్మిదేళ్లనుండి నా పరిపాలనము రక్తపాతమే కాని శాంతి లేదు. ఎటు చూసినా శత్రువులతో యుద్ధము, అంతఃకలహము; వీటితోనే కాలము గడిచిపోయింది. అహోరాత్రములు అరణ్యములలోనూ అద్రులయందూ తిరుగుతూన్నాను. అఖండ

సేనావాహినులతో నా రాష్ట్రముపైకి పొంగి పొరలివచ్చిన ఔరంగజేబుబలములు హతము చేసినాను, ఇంకను చేయు చున్నాను. నా రాష్ట్రమునకు ఛిద్రములు చూస్తే నాకు వైరాగ్యము కలుగుతూన్నది, ఉత్సాహ మూడుతూన్నది. కార్యశూరునికి స్వకీయులతో విరోధమున్న దౌర్భాగ్య సుంకొకటి లేదు. ఈబాధ ఎంతకాల మోర్వగలను?... ఈ యూరాటము మాన్పవలెనంటే రెండుపనులు చేయవలెను... చావు తప్పి కాళ్ళకు బుద్ధిచెప్పిన శిర్కేను చంపవలెను. రాజారామ్‌కు కుట్రతో సంబంధ ముండెను నిదర్శనము చూపవలెను.

కబ్జీ—(దూరమున నుండి) జగదంబ! జగదంబ! జగదంబ!

సంభా—కబ్జీ!

కబ్జీ—మహాప్రభూ!

సంభా—రాజారామ్ కుట్రలో చేరడము నిజమే కదా? ఇది దేవీవాక్య మేనా?

కబ్జీ—ముహాప్రభూ! ముమ్మాటికీ సత్యమే. లేకుంటే మీతో ఆలాగు మనవిచేతునా? నామాటయందు ప్రభువు వారికి సంశయము పుట్టిందా?

సంభా—మీరు చెప్పినది దేవీవాక్యము కాదని సంశ యము లేదు; దానిని అన్వయించడములో మీరు పొరబడ్డా రేమో అని సందేహము.

కబ్జీ—సుసంస్కృతమైన కార్యనిర్వహణమందు పొరపాటు రాకూడదని కబ్జీ ఎరుగును. ప్రభువుగారివంటి ప్రతిభావంతులయెడ దేవీవాక్యము అసత్యము కానేరదు. అన్యాయమందు పొరపాటు బొత్తిగాలేదు. నామాట నమ్మండి.

సంభా—మీ మాటకు నిదర్శన ముండవలెనా? వద్దా?

కబ్జీ—నేడు వింతమాట వింటూన్నాను. జగదంబ, మహిషాసురమర్దని ప్రత్యక్షమై పల్కిన పల్కులకు నిదర్శనము కావలెనా? దేవవాణిపట్ల మీబోటి దేవాంశసంభూతులకు సందేహము కలుగవచ్చునా? మహారాష్ట్రధాత్రి మాట అసత్యమగునా? అట్లు నాస్తికులు విధర్ములు తలతురేమో కాని ధార్మికులు, సనాతనధర్మప్రతిష్ఠాపకులు, దేవీభక్తులూ ఐన మీవంటివారికి ఇలాగు స్ఫురించడము కాలమహిమ కాక ఇంకేముంది? భవానీకృపాపరిరక్షితులు మీకు ఆమెయెడ శ్రద్ధాభక్తు లుండవద్దా?

సంభా—భవానీచరణపద్మములయందు మాకు పరిపూర్ణభక్తి కలదు. ప్రస్తుతవాదము భక్తిశ్రద్ధలకు సంబంధించినది కాదు... దేవవాణి మీకు సరిగా అర్థమైనదో లేదో అని రాణిగా రనుమానించినారు. అది సహేతుకము కాదని సాధించవలెనంటే మీమాటకు నిదర్శన ముండవలెను. అది లేకుంటే రాజారామ్ కుట్రలో చేరెనని సిద్ధాంతము కానేరదు—ఈవిషయ మాశ్రయాసిద్ధమైతే రాజారామ్ నిర్దోషి

యవును, అట్టివానిని చెరలో నుంచడ మన్యాయ మగును. ఇది రాణీగారి ప్రతివాదము.

కబ్జీ—పరిపోయింది. అమ్మగారు పూర్వపక్షపాతము వహించి వాదిస్తూంటే వారి కొప్పించడ మేలాగు? కత్తితో సాము.

సంభా—మేము నీ పక్షము వహించియున్నాము. నీ కేభయమూ ఉండదు.

కబ్జీ—అంతమాత్రమున నా కాపద తప్పునా? నీళ్లలో నుండదలచినవాళ్లు చేపలతో వైరము పెంచుకో కూడదు—దేవవాణి స్వతః ప్రమాణము, దాని కెట్టి ప్రత్యక్ష నిదర్శనము కావలెను? ప్రభువువారి వంశములో దేవాంశసంభూతు డవతరిస్తాడని భవానీవాక్య మని వదంతి, దాని కేమి నిదర్శనము లున్నవి?...దానిమాట కేమి?...ఇప్పుడు నిదర్శనము చూపించడము అపరాధులను శిక్షించుటకే కదా? ఆశిక్ష యిప్పుడే విధించగలరు ప్రభువువారు. నా ప్రయాసము వట్టి విడంబనమే.

సంభా—కబ్జీ! రా జెప్పుడూ రాజకార్యనిర్వహణపద్ధతికి వ్యతిరేకముగా వర్తించరాదు—రాష్ట్రపరిపాలన ప్రజానురంజనముపై ఆధారపడి ఉండవలెను. జ్యేష్ఠునకు రాజ్యము సంక్రమించడము శాస్త్రీయము కావున నేను రాజు నైనాను. నే నెన్ని హత్యలుచేసినా నా ప్రజలు నోరెత్తలేదు. ఇప్పుడు మా రాష్ట్రచరిత్రలో వ్యాసఘట్టము వచ్చినది. దక్షిణాపథ

మును జయించవలెనని తరుగులేని సైన్యముతో పాదుషా తరలి రానున్నాడు. రాజారామ్ నిరపరాధి యని నా ప్రజలలో కొందరు ప్రమాణము చేస్తూన్నారు. ఇట్టివేళ మన అభిప్రాయము సహేతుకమని స్థాపింపకుంటే మనవారియందు దైకమత్యము చెడి ప్రజలకు ప్రభువునెడ రోత పుట్టును. అప్పుడు గంధాన్వేషణ కతురులగు శత్రువులు మన రాష్ట్రము మట్టిలో కలుపడము...సుకరము...కావున ప్రస్తుతవాద ప్రతినాదము యథావిధిని విచారణచేసి అపరాధులను శిక్షించడమే యోగ్యము.

కబ్జి—నిజమే కాని, బలవంతులతో వైరము తెచ్చుకోవడము భావ్యము కాదు. పరిమారితో బలహీనులు పగ సాధించలేరు. మీ పరిపాలనములో వైపరీత్యములు కలుగడము విధివిలసితము. ఈయవస్థ కడు శోచనీయము. ఇందుకు ముఖ్యహేతువు ప్రభువువారికి పగులయందూ ఆప్తులయందున్నా పరమవిశ్వాస ముండడమే...ప్రస్తుతవిషయమున ఒక్కమాట చెప్పకతీరదు, నా కిష్టములేదు, ప్రభువువారికీ రుచించదు..."స్త్రీబుద్ధి ప్రళయాంతకము"—అమ్మగారు చతురలే; అపర జిజాబాయి అన్నా అతిశయోక్తి కాదు. కాని "ప్రమాదో ధీమతా మపి" అన్న వాక్యము పురుషులతో సమముగా స్త్రీలయెడ కూడా వర్తిస్తుంది. మహారాణీగారు సహజముగా బేలలు కావున పురుషుల గభీరత కనిపెట్టలేరు. రాజకార్యనిర్వాహణమందు స్త్రీల సలహా ఎంతవరకూ పాటించ

వలెనో ప్రభువువారే నిరయించుకోవలెను. నూాబోటి మంది బుద్ధు లందు తలదూర్చకూడదు.

సంభా—రాణిగారి మెడలు మీ మెరాగు వ్యవహరించ వలెనో నీవు చెప్పనక్కరలేదు. అధికప్రసంగమునకు పోరా బోకు. నేరము మోపినవారు నిదర్శనములు చూపనక్కర లేదా ?

కబ్జీ—ప్రతీదానికీ ప్రత్యక్షనిదర్శనము లుండునా ? అతిమానుషవిషయములు అస్మదాదులకు గోచరించునా ? ఎద్దూ ఎద్దూ పోట్లాడి మధ్య లేగదూడకాళ్లు తొక్కిన ట్లుంది నాగతి.

సంభా—నీ కీపాటి వివేకము లేదని నే నెంచలేదు. చూడడానికి పెద్దపులిలా గున్నావు, తీరా సమయానికి పిల్లివి. సామంతులతో వ్యవహారము సామాన్య మనుకొన్నావా ? నోటికి వచ్చినట్లు నుడువరాదు.

కబ్జీ—ఈ దీనుడు తనబుద్ధికి తోచినట్లు రాజ్యక్షేమ మునకు పాటుపడగలడు కాని అంతకన్నా ఏమి చేయగలడు? నాయందు ప్రభువువారికి నమ్మిక లేకుంటే నాకు సెలవు దయ చేయండి, నా దేశమునకు పోతాను.

సంభా—నీమూలాన ఎన్నో గృహచ్ఛిద్రవములు పెరిగి రాజ్యమంతా అరుమూాడు కాబోతూన్నది. ఇప్పుడు నీవు దేశమునకు పోతావా ? నా అరిష్టము లనుక్షణమూ పెరిగి పోతూన్నవి, నిన్న సూర్యాజీని కొట్టించడమువల్ల అపకీర్తి

అతిశయించింది. ఈయవస్థ మాస్తే రాజ్యపాలనమునకు జోత పెట్టి సన్యాసము పుచ్చుకోవలె ననిపిస్తూన్నది—ఛత్రపతి శ్రీశివాజీమహారాజుగారికి జ్యేష్ఠపుత్రుడనై జన్మించడము నా పుణ్యఫలమని లోకు లనుకొందురు గాక, అది నా పాప పరిణతి అని నా కనుభవసిద్ధ మయింది.—తండ్రిగా రున్నప్పుడే కారావాసము, వారి తరవాత సపిస్తుట అష్టప్రధానులతో వైరమూ, అంతఃకలహములూ, నాటి నుంచి అపకీర్తిపాలు కావడమూ, మొదట చిత్తశాంతికోసము కాస్త మద్యము పుచ్చుకొని అందు కాలక్రమమున మితిమీరి తాగుబోతునై ఇంటా వంటా లేని చెడ్డపేరు తెచ్చుకోవడమూ, మావాళ్ల యందు నమ్మకము చెడి ఊహాపోహా లేని పగవాళ్ళను విశ్వసిస్తే వాళ్లు నమ్మకానికి కాళ్లు సాచడమూ...ఇవన్నీ పాపఫలములు కాక వేరేమున్నది?

కబ్జీ—మహాప్రభూ! మహాధైర్యశాలులైన మీరు ఈరీతిని...

సంభా—కబ్జీ! నీపొగడ్త లిక చాలించు—నా ప్రాణమునకు నీ ప్రాణ మడ్డువేస్తానని నమ్మించి కార్యము మించినప్పుడు కాళ్లు చాచినావు—ఇక నీపైని మునుపటి నమ్మకము చెడిపోయినది.

కబ్జీ—మహాప్రభూ! ఒక అల్పవిషయమున జంకినా నని నా యావద్వృత్తమూ శంకింతురా? కానీయండి—నా

గ్రహాచార మన్నారా. విశ్వసనీయుడైన మీ సేవకుడు మీ క్షేమమునకు ప్రతికూలించునా ?

సంభా—ఇంతవరకు నా కర్మ తోచలేదు. ఇప్పటి కుట్రలో మునిగి బేజారయిన చిత్తముతో నున్న నన్ను నా దుర్గతికి విడిచి బైటికి దాటవలెనని ప్రయత్నిస్తూన్న నీపై విశ్వాస మెట్లుంచగలను ?

కబ్జీ—ఇట్టి దుస్థితి దాపురించినది కావున మహిషాసురమర్దనిమహామంత్ర సిద్ధిచేత అపరాధులపై నేను మోపిన నేరమును సహేతుకముగా స్థిరపరచుటకు సిద్ధుడను. మహారాణీగారి మాటయందు మీకు దృఢమైన నమ్మిక కుదిరింది కావున మీరు ప్రసన్నులై నామనవి నొకదానిని చిత్తగించ కోరుతూన్నాను.

సంభా—నీవు చెప్పదలచినది యోగ్యమైతే నా ఆటంకము లేదు. నేరము స్థిరపరచడమే నాకు కావలసినది.

కబ్జీ—అయోగ్యమైన షరతు లడుగువాడను కాను. నామనవి చిత్తగింతునని మీరు వచనబద్ధులు కావలెను.

సంభా—సరే, షరతు లేవి ?

కబ్జీ—నేను చూపినచోటున నా మంత్రము సిద్ధించే వరకూ ప్రభువుగారు ఆగవలెను, ఆచోటు మూడోవారికి తెలియకూడదు. మీ అంగరక్షకులకొరకు విశ్వసనీయులైన యోధులను నియమిస్తాను.

సంభా—మంచిది; నీవు చెప్పిన ప్రకారము కార్యక్రమము నడువనీ. నామాంకిత ప్రమాణము; గుర్రములు తెప్పించు.

కబ్జీ—చిత్తము. నేనకా, గుర్రములు సిద్ధపరుచు. (గ్లాసు నింపి) ఇదిగో దేవీ ప్రసాదము. తులసీబాయిని వెంట తీసుకొని పోదామనా ?

సంభా—స్త్రీ విలాసవతి వెంట నుండవలసినదే.

(యేసూబాయి, యువరాజు, ఖండోజి వత్తురు.)

యువ—కబ్జీ! మహారాజుగారి కిప్పుడు నీ వేమిచ్చినావు?... అమ్మగారు వస్తూన్నారు,... బైటికి తొలగిపో... కదలవేమి?... మహారాణిగారు వేచియున్నారు, వినబడ్డదా? నడువు... మహాప్రభూ! వందనము. అమ్మగారు దర్శనమునకై వచ్చినారు.

సంభా—సరే—యువరాజా! కబ్జీవంటి గౌరవనీయుడుండడానికి రాణిగారి కభ్యంతర మేమి?

యువ—ఎంత గౌరవనీయుడైనా విదేశీయుడు పైవాడూ కావున వారు బిడియపడుతూన్నారు. ద్వారమువద్దనున్నారు.

కబ్జీ—యువరాజుగారి చిలకపలుకులు నా చిత్తమున కానంద దాయకములుగా నున్నవి.

యువ—కబ్జీ! మా మాట వినవా ?

ఖండో—ఏమి నీ అవిధేయత? మహారాజుగారికి

మనెత్తిక్కించి యువరాజుగారిని మహారాణిగారినీ ధిక్కరించేటంత నిర్లక్ష్యమా! వారియన్నము తిని వారిసేవ చేస్తూన్న నీవు ప్రభువులనే సరకుచేయకన్నావు! స్వార్థపరతచేత కన్నులు పొరగప్పినా! నేటి యువరాజు రేపటి మహారాజని మరచినావా! చిన్నమొక్కలే కదా గొప్పవృక్షములవుతవి. యువరాజుగారిమొడ ఉదాసీనత చూపుతావా? మహారాజుగారిదా పుండడముచేతనే నీకు మునుగడ కల్గినది. లేకుంటే ఈ విధేయతకు నిక్షలహము చేయవలసినదే.

కబ్జీ—ఖండోజీ, నీ స్వామిభక్తికి చాలా సంతోషించినాను. ప్రభువుగారి ఆజ్ఞాబలమున నే నిక్కడ నిల్చినాను గాని మహారాణిగారియెడల మర్యాద నెరుగక కాదు. తొందరపడినావు. నీ కేల కలుకు?

యేసూ—నేను వచ్చినా నీవు నాకు సన్నిధ ముండవలసినదని మహారాజుగారు నీ కాజ్ఞాపించినారా?

సంభా—అనతిచ్చినది మేమే. కబ్జీవంటి స్వామిభక్తుని యెదుట పడడాని కెవరూ జంకనక్కరలేదు.

యేసూ—సరే ప్రభుచిత్తము. ఇదే వస్తూన్నాను. (మునుగు తీయును) ఖండోజీ, కబ్జీవంటి ప్రభుభక్తుప దూరాడినందుకు క్షమ యాచించు.

యువ—ఏమి యీ విపరీతన్యాయము.

యేసూ—(ఊరకుండు మని యువరాజుకి సంజ్ఞ చేయును)

ఖండో—కబ్జీ! మీబోటి స్వామిభక్తుని తొందరపడి నిందించినందుకు నన్ను క్షమించండి—(నమస్కరించును)

యేసూ—నేను మహారాజుగారితో మాటలాడవలసియున్నది, కావున మీ రిద్దరూ క్షణమాత్రము బైటికి వెళ్ళండి ఇప్పుడే రావచ్చును.

కబ్జీ—మహారాజావారి యాజ్ఞ?

సంభా—కబ్జీ మా చెంత నుండవలసినవాడు.

యేసూ—ఏమి వైపరీత్యము! మహారాజుగారు కబ్జీని మాకన్న గొప్పచేస్తున్నారు! ప్రభూ! సేవకునియెడ పక్షపాతము వహించి మీ అర్ధాంగి నవమానిస్తారా? ఇట్టి ప్రసంగము మీనోట సహజముగా వచ్చేది కాదు. కబ్జీ! మహారాజుగారు మైమరచి యున్నారు. ఇప్పుడు వారి యాజ్ఞయే ప్రధానమని ఎంచక నామాట చెల్లించి కొంచె మావలకు తొలగండి.

సంభా—వద్దు—కబ్జీ బైట పోవద్దు. మహారాణీ! నీవు అసమయమున వచ్చినావు. కబ్జీతో కొంత కాలక్షేపము చేయవలసిఉన్నది. కావున యువరాజును వెంటబెట్టుకొని నీవు నగరుకు పోవుట శ్రేయము. నే నిప్పుడే వస్తాను.

యేసూ—మీ రెక్కడికో ప్రయాణ మగునట్లుంది. కబ్జీతో మీ రెక్కడి కేగనున్నారు?

కబ్జీ—ఊసుపోలేదని వేటకు పయనమైనారు మహారాజుగారు.

యేసూ—నిన్నేవ రడిగినారు? మైమరచిన మహారాజు వేట కేగునా? వేటనెపమున నాకు నెటు తీసుకొని పోతున్నావు?

కబ్జీ—ఇది మహారాజుగారి ఆజ్ఞయే కాని నా ప్రోత్సాహము కానేకాదు.

యేసూ—ఇదబద్ధము. మహారాజు నియమించియుండరు. నాభర్తను మైమరచియున్నారు, నీ ఆటలు సాగుతున్నవి. నీ వేదో ద్రోహబుద్ధితో వీరిని బైటికి గొంపోతున్నావు...మీ పెద్దలాను, మహారాజుగారితో నీ వను దిన మారగించే మృష్టాన్నమాన! నీవు నిజము చెప్పు. అందువల్ల నీకే అపాయము గాని శిక్ష గాని రానివ్వను. ఇదిగో నాపుత్రుని తోడు. నీవు జంకక నిజము చెప్పు. ఇదే వేడుకొంటున్నాను.

కబ్జీ—సర్కార్, మీ రిట్టి దీనాలాపము లాడనేల? నిజముగా మహారాజావారు వేటకు...

సంభా—కబ్జీ! జాగ్రత్త! మహారాణిగారి యెదుట మాయదారితనము వద్దు. నాకెంత ఆప్తుడవైనా అమాయిక మైన రాణిని మాయ చేయబోకు. అసత్యము నేను సహింపజాలను. శూరునకు అసత్యమూ శత్రువుకన్నా సమానకోపభాజనములే... దేవీ, నేను వేటకు ప్రయాణము కాలేదు.

యేసూ—ఆహా! ఇది అశరీరవాణియా? అమృతపు పానమా? ఔరా! తుదకు మహారాజుగారే మాయమందు

దయజూపినాను...నీచా! మీపూర్వుల గౌరవము బుగ్గిచేసినావు. దైన్యము వహించి నిన్నెంత వేడినా నీ మనసు ద్రవించదాయె ప్రాణము పోయేటప్పుడైనా పెట్టుకొనవని నాచిన్నికుమారునిపై ఒట్టు పెట్టుకొన్నా నీవు నిజము చెప్పవైతివి. సత్యమును నీ వెంత లోతుగా పాతిపెట్టినా, లేక మదిరాసముద్రమున ముంచినా అది బైటికి వచ్చితీరును...ఇప్పుడైనా నిజము చెప్పి మహారాజుగారి నెటు ప్రమాణించినావో.

కబ్జీ—అమ్మగారూ, కబ్జీ సత్యసంధుడు కాకుంటే మీ కార్యాల్లో ప్రధానపదవి చేరియుండడు—నే నిప్పుడు పల్కినది సత్యమే. స్వామిహితముకొరకు కట్టు చేయవలసి వచ్చినది కాని మిమ్ము మోసగించవలెనని కాదు—రాజకార్యనిర్వహణములో ఒకానొకప్పు డెట్టివారికైనా అసత్య మాడకతప్పదు. అది మీ కనుభవసిద్ధమే.

యేసూ—మాతో అసత్యమాడి ఇప్పుడు నీవు నిర్వహించదలచిన రాజకార్య మెట్టిది?

కబ్జీ—అది నేను వివరించతగినది కాదు. తమ బంధువుల నమ్మి తరించవలెనని మహారాజుగారు తలచియుండి వారి ప్రతిన వారే భంగము చేయడానికి జంకకుంటే మీప్రశ్నకు తగిన జవాబు వారే ఇవ్వగలరు.

సంభా—కబ్జీ—ఇక చాలించు. ప్రతిజ్ఞాభంగము కావించేవాడు కాదు సంభాజీ—మన మిక పోదాము. దేవి, ఇప్పుడు

మాటలాడడానికి వ్యవధి లేదు. త్వరలో వచ్చి నీకు సర్వమూ వివరిస్తాను.

యేసూ — త్వరలో వస్తురా? ఈ నాయకుడను దాటిన వెనుక ఈ కాలుని భల్లూకపుపట్టు మీరు విడిపించుకొనగలరా? ఈ యముడు మెడకు చుట్టికట్టిన పాశము తెగిపోవునని యనుకొంటిరా? మహాప్రభూ! ఎందుకట్టి దురాశ? ఇక్కడినుండి దాటినారా మీకు స్వేచ్ఛ, కుశలము కూడా దూరమగును. ఈ మాంత్రికుని మంత్రముచేత కట్టుబడిన నాగరాజువలె వ్యర్థముగా బుసకొట్టుటే కాని వేరేమీ మీకు చేతకాదు. మీ రాష్ట్రమునకూ మీకూ వియోగమయితీరును. తిరిగి మీ దివ్యసుందరవిగ్రహము మాకు కళ్ళ పడుట అసంభవము. వీని మాయలలో పడిన మీకీపాటి విచక్షణ కలుగకపోవడము విధివిలసితము — ఈ విపరీతబుద్ధి మీకేలపుట్టినదో ఎరుగలేకున్నాను. ఈ కఠినాత్ముని మీరు నమ్మవద్దు.

సంభా — దేవీ, నీ వపోహముచేత ఏమేమో కలవరిస్తున్నావు. కబ్జీ నన్నెక్కడికో తీసుకొని పోతున్నాడని నీ ఊహ. నాకు మతిపోలేదు — ఇతడు నన్ను వంచించుననే మాట కల్ల. నా అన్నము తిని నాకు ద్రోహ మొనర్చేటంత కపటి కాడు కబ్జీ — గమ్యస్థానము నాకు తెలియదు కాని అది అపాయకరమైన చోటు కాదు.

యేసూ — ఈమూర్ఖనమ్మకమే ఇంతకు తెచ్చింది — ఇతడు దుశ్శీలుడని మీరు గ్రహించకపోవడము మన రాష్ట్రవినాశమునకు

పోతువు. నేనింత దూరము మొఱపెట్టుకొన్నందుకైనా మీ రీ ప్రయాణము మానవచ్చునే!... ప్రాణకాంతా! ఇక మా మొఱలను విడిచి సహించిగాని మాటలైనా నాకు చెప్పక తీరినది కాదు. ఎక్కడికి పోతే మీ జీవయాత్ర ముగిసి, ప్రాణసమానబంధువులు దూరమగుదురో, ఏచోటికి సకాల మృత్యువు నోరు తెరచుకొని యుండునో అట్టి చోటికి ఈకుల నాశకుడు, రాజద్రోహి, పితృద్రోహి, మిత్రద్రోహి బ్రాహ్మణాపసదుడు మిమ్ము తీసుకొనిపోవలసినాడు. గోవువెంట బోవు వత్సము తెరగున మీరతనివెంట ప్రయాణమైనారు. వెయ్యేల! నాడిమాట వినండి—పరిస్థితుల జాగరూక ప్రభువు గాని యీ పాషండుడు సర్వనాశకుడు పాదుషా కమ్మివేయ నున్నాడు—ఇదే వీని గుట్టు రట్టు చేసినాను—నిదర్శనము చూపి స్తాను; రాముగడను విడిచి బైటికి పోవద్దు—నామాట అసత్య మైతే నాకే శిక్ష విధించినా సమ్మతమే.

సం—దేవి, కబ్జీ విశ్వాసపాత్రుడు కాడని చాలా ముందే వారము—దానిని విచారించడమునకే నేను ప్రయాణ మైనాను—అచిరకాలమున అతని స్వభావము ప్రత్యక్ష మగును. అదే నే నిప్పుడు చేయదలచినది.

యే—మంచిమాట—ముందు నా ముద్దు చెల్లించి నా వాదము వినండి; పిమ్మట నిదర్శనములు చూడండి—అతని హృదయము అద్దమువలె మీ కగపడును—వేరు ప్రమాణము లక్కరలేదు. వద్దు ప్రభూ! వీనిని నమ్మవద్దు.

సం—కబ్జీయం విశ్వాసము కానబడలేదు కాని,అత నిస్తే యింక మోసినవాళ్లే నన్ను హాను చేయవలెనని లెక్కలేని యత్నములు లోగడ చేసినారు, ఇప్పుడూ చేస్తూన్నారు. ఆత్మబంధువులను నమ్మి అన్ని విధములా చెడ్డాను—ఇక డిట్టి వాడో నిశ్చయించి తీసుతాను. ఇతని వెంటా వెళ్లకమానను. మీా రిక మరలండి—కబ్జీ, నడువు—

యే—నేను వెళ్ళను, ఇతనివెంట మిమ్ము వెళ్లనివ్వను. రాజులేని రాయగడము పోయి, రేపు సంభవింపనున్న వైధవ్యపంకమున బడి జనములు గడుపుటకన్న మహారాజుగారిని వ్యామోహ పాశమున బంధించి నే నిక్కడే రాతిబొమ్మవలె నిల్చియుందును. సావిత్రివలె నాపతి ప్రాణముల హరించు యముని హృదయము కరగించి నానాధుని పునర్జీవితునిగా జేయ యత్నిస్తాను; లేదా సహగమనము చేస్తాను. అంతే కాని ఈచండాలుని వెంట నా ప్రాణకాంతుని పో నివ్వను, భవానీదేవి యాన!

సం—ఆడదానిమాటలకు కడలేటంత పిరికివాడను కాను; మే మేగేచోటు నీకు తెల్పి ప్రతిజ్ఞాభంగపాపమున కొడిగట్టి నిన్ను బహూకరించడము కన్న మాధ్యము నహించి నిన్నవమానించి మాదారిని మేము పోవడమే పరమోత్తమము. (ప్రక్కకు తోసి) కబ్జీ! రా! పోదాము—(వెళ్లుదురు)

యే—జగదంబా! నీవే నా నాథుని రక్షింపవలెను. ఖండో, రా, సామోపాయము సాగింది కాదు; దాన భేద

ములు వ్యర్థములు, ఇంక కరవాలమే గతి; నీవు వీరి వెంటనే పోయి కబ్జీ కంఠము తెగవేయుము. అప్పైని దైవమున్నాడు.

ఖండో—మహాప్రసాదము — జే! భవానీ...

(తెరపడును.)

సంభాజి నిర్యాణము

మూడో అంకము

మొదటి రంగము

మొగల్ శిబిరము—గణోజి సూర్యాజీలు.

గ—నీ కింత కోపము రావడానికి హేతు వేమి?

సూ—మీ వేషాలు కట్టిపెట్టండి—మీ మాయ చూచి మోసపోవడానికి నేను పసిబాలుడను కాను. రాజ వంశమున పుట్టకపోయినా చాలామంది రాజులతో అరమర లేక మెలగినాను. కయ్యానికి కాళ్లు దువ్వే అవసరమిప్పు డేమివచ్చింది? శిర్కే! నీబోటివాళ్ల కెందరికో బుద్ధిచెప్పిన వాడను సుమా నేను.

గ—ఈ ప్రసంగము...

సూ—అబ్బా! ఎంతవాడవు! ఆ ప్రమేయమే ఎరుగనట్లు నటిస్తూన్నావే నీవు.

గ—నీ మనస్సును మైకము కప్పలేదు గదా?...

కొంచెము నడుమువాల్చి, కైపు దిగిన తరువాత కలిసి మాటాడవచ్చును. అప్పుడు నీకు తెలివి వస్తుంది.

సూ—ఇం కెక్కడి తెలివి? తెలివి తేటలు నన్ను విడిచి చాలకాల మయినది. ఇక్లాస్‌ఖాన్‌తో చేరి వాయీ దేశముఖ నా కిప్పిస్తానని ఆశపెట్టి కుట్ర అనే మత్తుమందు పెట్టిననాడే నా తెలివి నశించింది. ఆ మైకము పెరిగి పెరిగి తుదకు సంభాజీమహారాజుచేత కొరడా దెబ్బలు తినిపించింది. ప్రాణాలు పోతవేమో అని భయపడి ప్రాగాలుదాటి చావు పరుగున బైట పడ్డాను.

గణో—మనకుట్ర బైట పడినదా?

సూ—అది వెల్లడి కాలేదు—కుత్సితుడా, నీవే దానిని వెల్లడి చేసినావు—వందలకొద్ది ఫిరంగులు పేల్చినా చింతాకంత సందీయని కోటలోనికి సద్దులేకుండా నన్ను చేరనిచ్చిన నన్ను వంచించి యిప్పుడు కపటనాటక మాడుతున్నావా?

గ—పిసాళ్—

సూ—నీ గద్దింపులకు జడిసేవాడను కాను. నీవు కన్నెఱ్ఱ చేసినంతమాత్రాన గడగడ లాడుతూ నడుకొన్నావా? పిసాళ్కెక్కడే పిచ్చివానివలె మనలో చేరినాడు, వీడిని పిలుక్కు మార్చడము సులభమని ఎంచినావేమో? ఆ భ్రమ పోగొట్టుకో. నా కిచ్చిన గడువులోగా నేను రాయగడము చేరకపోతే మనగుట్టు బట్టబయలై కబ్జీ భూస్థాపన చేయ బడును...శిర్కే, నిన్నొక్కమాట అడుగుతాను—మొదటి

నిర్ణయము ప్రకారము నాకు వాయీ దేశముఖి యిచ్చి మొగలులు నన్ను తమకూటములో చేర్చుకొంటారా? లేక కబ్జీద్వారా కార్యము నిర్వహించ నెంచి వాడి ప్రాణములతో కూడా తమ యత్నము ధ్వంసము చేసుకొంటారా? ఏదో నిశ్చయించి చెప్పు.

గ—మొగలులతోడి నీ మైత్రి కంతరాయము కల్పించిన దెవరు? నీ వున్నంతవరకూ మహారాష్ట్రులను మాలో చేర్చుకొనవలెనని మేము యత్నిస్తూంటే మా కార్యము నిర్వహించ సమకట్టిన నీ బోటి దుర్గాధ్యక్షుని మానసమునకు నొప్పి గలిగిస్తామా?

సూ—కబ్జీవంటి కార్యశాలి మీలో కలిసినతరువాత నాబోటి అనామధేయు డొక లెక్కా?

గ—ఇగ నట్టి అపోహము—కబ్జీకన్న మాకు నీవే ఘనుడవు. కబ్జీ ఎంత కూటనీతిపటుడైనా కరణమే కదా! అతడొనర్చగలిగిన మహాత్కార్యము సంభాజీని మా వశము చేయడమే—నీవో వీరుడవు, శూరుడవు, రాయగిడదుర్గము స్వాధీనపర్చుకొన దలచిన మొగలులు నీతోటి చెలిమి చెడగొట్టుకొందురా?

సూ—అలాగైతే నన్ను కోటలోకి చేర్చడములో నేను సాయపడ్డానని కబ్జీ సంభాజీతో చెప్పునా? నాపై నతనికి పగలేదు, ఇద్దరమూ మొగల పక్షమువారమే—మీ ప్రేరేపణ లేకుండా తానే నామీద నిప్పులు చెరగునా?

గ—మనగుట్టు బైటపెట్టినవాడు కబ్జీయేనా ?

సూ—ఆహా, వాడే.

గ—నిజమే ?

సూ—సందేహ మేల ? మీ రిక కాలయాపన చేయక వాటా నాకు లభించే ఏర్పాటు చేస్తే మీ కార్యము కొనసాగుతుంది; నాకు సున్నచుట్టితే మీకు హాళ్లి ! కుట్రా కబ్జీ రెండూ శూన్యమే. మీరు నాకు కీడెంచుతే నేను మీకు మేలెంచుతానా ? ఒకరి కట్టూ ఇంకొకరికి ముఖ్యమా ?

గ—కబ్జీని నేను ప్రేరేపించినానని నీ కనుమాన మెందుకు కల్గింది ?

సూ—ఏరుదాటిన తరువాత తెప్ప తగులవేసే వాళ్ళు లేరా ? నన్ను చుట్టిపెట్టితే కబ్జీ కార్యము సులభతర ముగా నెరవేరుతుందని కాబోలు. అప్పుడు పాదుషాకి లాభ ముంది, నీకూ లాభముంది—సంభాజీమీద పగసాధించ వచ్చును. పాదుషా కోపము తీరుతుంది, దక్షిణాపథ మతనికి దక్కుతుంది, నీకు జాగీరు దొరుకుతుంది,—కబ్జీ గొప్ప నవా బౌతాడు—కాబట్టి కబ్జీని మొగలులూ నీవున్నూ ప్రేరేపించి యుండవచ్చును.

గ—సూర్యాజీ, అక్కరకురాని అనుమానము కల్పించుకొని మనస్సెందుకు కలత పెట్టుకొంటావు ? సంభాజీపై పగసాధించుకోవలెనని నేను మొగలుల సాయము కోరినమాట

నిజమే, కాని యుక్తాయుక్తవివేచన లేకుండా వ్యవహరిస్తా ననుకొన్నావా? అసూయాపరులు చెప్పుతే నాకేమి లాభము? పగ సాధించడమే నాకు పరమసాధ్యము. భోంసలేవంశము నిర్మూలమైనదాకా నాకు భోజనము నిద్ర అక్కరలేదు. నాకు వాగే శత్రువులు—నీమీద చాడీలు చెప్పుమని నేను కబ్జీని ప్రేరేపించలేదు, భగవత్సాక్షిగా చెప్పుచున్నాను.

సూ—కబ్జీతో మీ ఒడంబడిక జరిగిన మాటసత్య మేనా?

గ—అది నిజమే—అందువల్ల సంభాజీని మొగలుల కర్పించడానికి మాత్రమే కబ్జీ బాధ్యుడు. రాయగడము జోక్య మతనికి లేదు—

సూర్యా—ఇది నిజమేనా?

గణో—నీకు నామాటయందు గురిలేకుంటే అదిగో ఆడేరాలో ఖాన్‌సాహెబుగారు నిద్రిస్తూయున్నారు, అక్కడికి వస్తే ఆసంబంధమైన వ్రాతకోతలు నీవే స్వయముగా చూసుకోవచ్చును.

సూర్యా—నాయెడ కబ్జీ ఇంత ద్రోహబుద్ధి ఎందుకు పూనినాడు?

గణో—వాడు పీనుగనెత్తి సంతరించిన నేతిముద్ద నాలుకతో నాకేనాడు—వాడి వర్తనము మన మూహించలేము. సంభాజీవిషయము మేము వాడితో పరామర్శించకముందు నీకూ మాకూ రహస్యసంభాషణ జరిగిందని వా డెరుగును.

మొగలులకు తాను తప్ప గత్యంతర ముంచరాదని నిశ్చ యించి నీ మీద ఈద్రోహము తలపెట్టియుండును.

సూర్యా—ఔను—ఈయూహ నాకు తట్టలేదు—నీవు చెప్పినట్లు ఇదంతా కబ్జీ పని. గట్టిచిక్కే వచ్చింది; ఇందు నాకు కీడు తప్పదు. దేశత్యాగమో దేహత్యాగమో తప్ప నాకు వేరుగతి లేదు.

గణో—మొగలుల ప్రాపున దాపున నీ వున్నన్నాళ్లు నీ కేసంకటమూ కలుగబోదు.

సూర్యా—అదొక్కటే నా విపద్బుద్ధికి శరణోపాయము—నే నిప్పుడు చెప్పినమాటలు మదిలో నుంచక నీవు నాయెడ దయచూపకుంటే నాగతి దుర్భరము. (మోకరించును)

గణో—నా విషయమై నీకు సందేహము వద్దు. కబ్జీవంటి అధముని గట్టిగపట్టుకొని బ్రతిమాలవలసి వచ్చెను కదా అని చింతిస్తున్నాను. వానియెడ నాకుగల వైరము నివురుకప్పిన నిప్పువలెనే నా హృదయమం దున్నది. వాని భయము నీ కావంతా ఉండనక్కరలేదు— ఇతరాసాయములు సంఘటించకుండా సాహెబుగారిచేత జాబు వ్రాయిస్తాను. కబ్జీ కోటలో నున్నాడా?

సూర్యా—లేదు.

గణో—ఎక్కడ వున్నాడు?

సూర్యా—వేటనిమిషమైని రాజును వెంటబెట్టుకొని నారాయమైనాను—సంగమేశ్వరము వెళ్లినాడేమోనని నాఊహ.

గణో—ఎందుచేత ?

సూర్యా—కబ్జీను కడతేర్చి మహారాజుగారిని మర లించి కోటలో భద్రము చేయవలెనని రాణీగారు బహు ఆతృతతో త్వరలో సంగమేశ్వరము చేరడానికి అద్భుతో ఎల ప్రయాణము చేస్తూన్నారు—వారి కాపుదలకై మావళాలు వెంట నున్నారు, వారికి నాయకుడు ఖండోజి—

గణో—రాణిగారి కా ఆత్ర మెందుకు ?

సూర్యా—కబ్జీవర్తనము శంకించడముచేత. కబ్జీవెంట వేటకు వెళ్లవద్దని, అందు మోస మున్నదని పరిపరివిధముల ఆమె పరిదేవన మొనర్చినా ఆమెమాట లక్ష్యపెట్టక కబ్జీ వెంట మహారాజుగారు వెళ్లినారట—అందుచేత ఏలాగైనా కబ్జీని చంపి వేట మాన్పించవలెనని ఖండోజిని నియమిస్తే అతడు కబ్జీని కలుసుకొన్నాడు కాని రాజుగారియెదుట అతని నేమీ చేయలేక ఇంటికి మరలినాడట—

గణో—పిలువలేను నా త్ర తెల్చినావు—నాపని సగ మీాడేరినట్లే. ఒడంబడిక ప్రకారము కబ్జీ రాజు నప్పగిస్తాడు, పిమ్మట వారిద్దరిగతీ ఒకటే అవును. . .సూర్యాజీ, నీవిక రాయ గడమునకు పోయి నిర్భయముగా నిద్రించవచ్చును—సంభాజీ సమసిన తర్వాత మాట్లాడుదాము—ఎవరురా అక్కడ ? ఖాన్ సాహెబుగారిని తీసుకొనిరా.　　(ఇక్లాస్‌ఖాన్ వచ్చును)

మనకు జయము. ఒడంబడిక ప్రకారము కబ్జీ రాజుగా రిని సంగమేశ్వరము చేర్చినాడు—మీారు వెయ్యి సిపాయీా

లతో సంగమేశ్వరము ముట్టడించండి. జాగీరుననదు తనచేతిలో పడ్డదాకా రాజుగారిని మీ కప్పగించడానికి కబ్జీ సందేహించకుండా తగిన ఏర్పాటు బేగేరావుటపామీకు పంపుతాను. రాజుగారిని రాయగడముకు తీసుకొని పోవడానికి రాణి బయలుదేరిం దట. గుఱ్ఱపుసిబ్బందితో ఆమె నెదుర్కొని కైదుచేసి మీకన్న ముందు నేను సంగమేశ్వరము చేరుతాను—త్వరగా బయలుదేరండి.

రెండో రంగము

సంగమేశ్వరములో పాతభవంతి

సాహీరు, చంద్రావళి.

సాహీ—కబ్జీ మహారాజుగారిని సంగమేశ్వరము తీసుకొని రావడమునకు కారణము చెప్పుతూ రాయగడముకు కబు రంపి మూడురోజు లయింది, ఎవరూ అక్కడనుంచి వచ్చే జాడ లేదు—ఎందుచేతనో?

చ—రాయగడమునుండి రావడానికి వ్యవధి ఉండవద్దా?

సా—కష్టకాలమున కాలు వేగము సాగవద్దా?

చం—మీకున్న తొందర అందరికీ ఉంటుందా? మీరు పంపిన దూత కూలివాడు—నిక్కినీల్గి ప్రయాణము సాగించేవాడు కాని తొందరగా పరుగెత్తేవాడుకాడు.

పా—గడియ గడియకూ నా ధైర్యము గళిత మా తూన్నది, మనస్సు తల్లడిల్లు తూన్నది.

చం—ఇన్ని పాట్లు మీారు పడుతూన్నందుకు భగవం తుడు మన రాజుగారికి దీర్ఘాయు వొసంగుగాక!

పా—నేనే రాయగడము పోతే?

చం—మీారు వచ్చేలోగా మహారాజుగారు మొగలు లకు చిక్కితే తప్పించే శక్తేదగు?

పా—భగవంతుడే?

చం—భగవంతుడే ప్రాప్తైతే మీారు రాయగడము వెళ్ళడ మెందుకు? నిష్కల్మషచిత్తులయిన మీా ప్రార్థన విని భగవంతుడే రాయగడమునుండి సాయము రప్పించును. మన దినముల వంకరచేత అలాగు జరుగకపోతే...

పా—ఊరకున్నా వేమి?

చం—మన ప్రాణాలు రాజుగారి ప్రాణాల కడ్డువేసి "యశోవా మృతుర్వా" అని పోరుదాము.

పాహీ—అది నిశ్చయమే కాని నీ వెంతసాంత్వన మొనర్చినా తహతహపడుతూన్న నాచిత్తము శాంతి నొంద కుండా ఉన్నది.

(ఖాశాబా వచ్చును)

ఖాబా—కొంప మునిగింది. సర్జాకు భయపడి గోవిం దుని చేరదీస్తే వీడు నావేలితోనే నాకన్ను పొడిచినాడు... స్త్రీచిత్త మతి దురవగాహ్యము—నేను స్వతః కుయాపిన్నైనా

గోవిందుకన్న సుగుణుడను కాకపోలేదు...వాడే దీని మన సుకి నచ్చినాడు! చూపునిల్లు నడికప్పనకు పారినవి...(ప్రైకి) ఏమండోయి గోవింద జీగారూ! మీకు సౌఖ్యమా?

షాహీ—మీ దయవల్ల నే నిక్కడ హాయిగా నున్నాను.

భాశా—ఏమి చంద్రావళీ, నీ మాట ఏమి? ఈగోవిం దుని చూస్తే నీకు షాహీగుని చూసినట్లున్నదా?

చంద్రా—వ్యర్థముగా న న్నెందుకు బాధిస్తావు?

భాశా—నేను బాధపెట్టుతున్నానా?—ఓహో! ఇంకా కొంతసేపుదాకా రాకూడదు కాబోలు?...ఏమిరా దున్న పోతా! దీనిని మచ్చిక చేసుకొంటున్నావా?

చంద్రా—దేవుని వంటివాడు, అతనిని తిట్టకు—నీ కెందు కంత కోపము అతనిమీద?

భాశా—నీ కెందు కంత దాక్షిణ్యము? రాతిబొమ్మ నీకు దేవు డయినాడా? ఏమిరా, ఇది నీకు దేవతలాగు న్నదా?

షాహీ—బాగా అడిగినావు! ఈమె ఉత్తమురాలు!

భాశా—ఐతే పెళ్లి చేసుకొంటావా?

షాహీ—ఆమె కిష్టమై నీవు పెళ్లి చేయిస్తే నా కభ్యం తరము లేదు.

భాశా—నీవు దీనిని మచ్చిక చేసుకొన్నావా?

షాహీ—ఇంతవరకు అది జరుగలేదు...దీని కింకా

పెళ్లి కాలేదా!...పెళ్లైన పడుచుపట్ల పురుషులు శ్రీరాము నిలా గుండడము మా కులాచారము.

ఖాశా—అందరూ శ్రీరాములైతే అతని గొప్పపది!

షాహీ—ఇంకోడి పెళ్లాముమీాద కన్ను వేసినవాడిని కత్తితో నరకడము మా కులధర్మము...నీ వృత్తిమీాద నీ విక్కడున్నావు. నీ పెళ్లాముమీాద ఎవడైనా కన్నువేస్తే నీ వేమి చేస్తావు? ఒప్పుకొంటావా?

ఖాశా—ఆ మాట ఎత్తకు. దీనికి పెళ్లి కాలేదు. అందుకనే మచ్చిక చేసుకొంటున్నాను—

(సర్జాబా వచ్చును)

సర్జా—కొంప మునిగింది!

ఖాశా—ఏమి? ఏమి?

సర్జా—కబ్జీ మనమాటలన్నీ విన్నట్టుంది.

ఖాశా—నీ కెలాగు తెలిసింది?

సర్జా—అది తర్వాత చెప్పతాను—ఇక్లాస్‌ఖాను రాజుగారిని పట్టుకోవడానికిన్నీ శిర్కే రాణిగారిని కైదు చెయ్య డానికిన్నీ తలా ఒకదిక్కునుంచి వస్తూన్నారు. కబ్జీ పని సాను కూల మయింది—"నీకూ కాదు నాకూ కాదు, గోటికి పోయిరా తలంబ్రాలు" అన్నట్లు కబ్జీ చంద్రావళిని కట్టుకొం టాడు, మన ప్రాణా లుండవు—ఏమి గతి?

షాహీ—నా కొకటి తోంచింది—మనమే ముందుగా మహారాజుగారిదగ్గరకు వెళ్లి ఈ కుట్రమాట చెప్పుదాము...

కబ్జీని రాజుగారే కడతేరుస్తారు, మీరు సుఖముగా నాలుగు కాలాలుండవచ్చును—

ఖాశా— ఛీఛీ పో—మాకు బుద్ధి చెప్పవచ్చినావా?

సర్జా—మనకు రాజుగారి దర్శన మయ్యే దేలాగు? చలిచీమ కూడా దూరడానికి సందులేకుండా కబ్జీ కత్తుల పారాలు కాపు పెట్టినాడు.

చంద్రా—అందు కుపాయము నేను చెప్పనా?

ఖాశా }
సర్జా } చెప్పు చెప్పు.

చంద్రా—ప్రాణాలు నిలువవని మీలాగే నేనూ భయపడుతూన్నాను. అంతఃపురమూ రాయగడముకు పారిపోదామా?

ఖాశా—ఇది నాకు నచ్చింది.

సర్జా—(ఖాశాతో) మనకు దీనివల్ల ప్రాణాలూ చంద్రావలీ కూడా దక్కవచ్చును. ఇది నాకూ నచ్చింది.

ఖాశా—సెబాస్! ఒకవైపునుండి ప్రాణాలు పోతూన్నా చంద్రావళిమీద మనసు నిల్పడము మానినావు కావు; వలపంటే నీదే వలపు. బలే!

చంద్రా—ఈ ముట్టుపట్ల దాగుకోవడానికి తగిన తావు చూడుమని ఈ వేటకానిని పంపుదాము.

సర్జా—సరే—ఇది మంచి ఆలోచన.

ఖాశా—సర్జా—మొగలాయీ సేనలలో నాసుందో కనుక్కొందాము రా—(పోవుదురు)

చంద్రా—నాథా! ఇంకా కాలస్య మెందుకు!—మీరు రాయగడమువైపు పయనము కావలెను—అమ్మగారు దగ్గరకే వచ్చియుందురు—

షాహీ—ఇదే బయలుదేరుతూన్నాను—(పోవును)

మూడో రంగము

సహ్యాద్రిగిరి అడవి—సంతూమాయి—దౌలతి.

సంతు—ఇదెక్కడి దారి దౌలతీ! ఏపక్క చూసినా గుండెలు పగులుతూన్నవి. సూర్యుడస్తమిస్తూన్నాడు. రాయగడము విడిచి మూడు రోజు లయినది, ఎద్దు నడవలే కున్నవి; కొంచెము విశ్రమింతా మంటే అంతా అగమ్యగోచరము; తోవ కాన్పించదు, ఏమి తెలుచుకొన్నా తలప్రాణము తోకకు వస్తూన్నది.

దౌల—ఏమి చేయు మందువు? మహారాజావారిని కలశా మాయము చేసినాడని తెలియగానే మొగలులు దారులన్నీ కట్టివేసినారు—అడ్డుతోవ త్రొక్కవలసి వచ్చింది; భయపడకు, కాస్త ఓపికపట్టితే రేపు మన రాజ్యము చేరుకొందాము.

సంతు—ఈ రాత్రి గడిచి రేపన్నరోజు వస్తుందా అనిపిస్తూంది.

బాల—నీ కెందు కమ్మా ఇంత [illegible], మన కేమి ఆపద రాగలదు?

సంతు—నా మనస్సు నెంత సమాధానపర్చుకున్నా ఈరాత్రి మన కేదో కీడు మూడుతుందని నాకు తోస్తూన్నది. రెండుపక్కలా ఉన్నతపర్వతకందరములూ కాలపురుషుని బోలిన ఉత్తుంగసానువులూ, కీచురాళ్ళతో నిండి నిబిడనీరంధ్ర వృక్షరాజిన్నీ "బాలా, ఇక నీ కేటి పుట్టిల్లు, ఏటి అత్తిల్లు" అని అరుస్తూన్నట్లున్నవి.

బాల—ఇట్టి పిచ్చి ఊహాలు నీ మనస్సులోనికి రానీయకు. నాయం దెంతో నమ్మక ముంచేనే కాని మీఅన్న నన్ను నీకు తోడిచ్చునా? నా కంఠములో ఊపి రున్నంత వరకూ నీకు ప్రమాదము రానిత్తునా? దాచిపెట్టు మన్న ధనము లాగు ప్రాణములకన్న ప్రియతరముగా కాపాడుతాను. ఎల్లప్పుడూ నగిళులలో కాలము గడిపే నీ వంటి పడుచు కీ ప్రయాణము భయావహము కావడ మొక వింత కాదు... అదిగో దిగుడు బావి—మోట ఏలాగు నడుస్తూన్నదో చూడు—అక్కడికి పోయి కాళ్ళూ చేతులూ కడుగుకొని కొంచెము నీరు తాగి కాస్త చల్లబడుదాము.

సంతు—మంచిది, నడువు.

బాల—ఓహో! కాపన్నో!

కాపు—వచ్చే! వచ్చే! (కాపు వచ్చును.)

దాల—అంతా బాగుండారా?

కాపు—ఏమి బాగా గిన్నా? రోజంతా రొమ్ము పగిలేటట్టు పాటుపడినా పట్టెడన్నము పూరాగా చిక్క లేదు—ఇప్పుడు కానిదినాలు వచ్చినాయి, పిల్లా జల్లా ఇంటినిండా ఉన్నారు. ఏదో సాగలేక సాగుతూన్నాము...మీరెక్కడినుంచొస్తుండారు? ఎక్కడికి పోతూండారు? అయ్యో బాబో, ఆడోళ్ళు కూడుండారా?

దాల—ఇది మా అమ్మాయి—అత్తింటికి తీసుకో పోతున్నా.

కాపు—ఎంత ఘటికుడవయ్యా నీవు! ఎంతపని చేస్తూండావు! పాడుకాలాల్లో పడుచుపిల్లతో పయనమవుతావా?

దాల—ఇక్కడేం భయమా?

కాపు—నీకు మతుందా? లేదా?

దాల—ఈశ్వర కొత్తది, నాకేం తెలియదు.

కాపు—తురకసర్దారు లెదురైతే ఒక్కడవేం చేస్తావు? పిల్లని చేతులార చంపుకొంటావా? లేకుంటే వాళ్ళ నెదాన పెడతావా?

దాల—తురకలీ అడవిలో తిరుగుతూన్నారా?

కాపు—మహారాజెక్కడో మాయమైనాడట—ఎవరికీ తెల్దు—ఆయన్ని పట్టుకోవాలని తురకలు తండతండలు

తిరుగుతూండాగు. ఇప్పుడే యీదారిని కొందరు పోయారు, మీాకంట పడ్డా రనుకొన్నా.

దాం—మేము భయపడినట్టే జరిగినదే!

సంతు—అమ్మయ్యో! నే ననుకొన్న కీడు మీాద నున్నది కాబోలు!

కాఫు—ఈమాత్రంకే అడలిపోతూండారా? ఈచోటి కిప్పుడు మేమే రాజులము. మీాకు కావలసిన సాయము నేను చేస్తాను. మన మంతా ఒక్కతల్లి బిడ్డలము. ఒకరి కొకరు దన్నుగా నుండాల.

సంతు—నీకడుపు చల్లగా మంచిమాటాడినావు.

కాఫు—మా గూడెంలోకి దబ్బున పదండి. ఈరాత్రి అక్కడ గడుపుదాము, రేపటిమాట ఆమెనక చూతాము.

సంతు—మా ప్రాణాలకి దేవుడిలాగు కనబడ్డావు.... (ముందుచూచి) అమ్మయ్యో! ఎవడో గుఱ్ఱముమీాద వస్తూ న్నాడు. చచ్చినాము దాంతీ!...ఎవడో భిల్లుడువలెడున్నాడు. కాదు కాదు—తులసీరామ్ సాహేబు...తులసీరామ్!

సాహే—ఎవరు నన్ను పేరుపెట్టి పిలిచినారు?

సంతూ—నేను సంతూని—నమస్కారము!

సాహే—ఖండోజీ చెల్లెలవా, అమ్మా! ఇక్కడి కెందుకు వచ్చినావు?

సంతూ—అత్తవారింటికి పోతూన్నాను.

సాహే—తో డెవరు?

దాల—నేను దాలతిని.

షాహీ—తగిన సమయానికి తటస్థించినావు. దాలతీ, ఆసన్ననిర్వాణమైన జ్యోతి అధికముగా ప్రజ్వరిల్లుతుంది. చచ్చేముందు మానవునకు తెలివి వస్తుంది.

దాల—మహారాజుగారికి కుశలమా?

షాహీ—రాజుగారు! కుశలము! నేను బయలుదేరే సరికి కుశలమే.

దాల—తరువాత ఆపద వాటిల్లిందా?

షాహీ—అది నాకు తెలియదు.

దాల—వారు విపద్దశలో నుంటే మీరు ఇటుల వచ్చినారు?

షాహీ—ఒంటివాడను, నాచేత నేమవుతుంది? శత్రువులచేత చిక్కకుండా మహారాజుగారిని కాచుకొని యుందునా? మహారాణీగారిని ఖైదు చేయవలెనని గణోజీశిర్కే వస్తూన్నాడని ఖండోజీకి రహస్యవార్త తెలియజేతునా?

దాల—ఈమాటలు వింటే నాకు మతిపోతూన్నది. అమ్మగారు రాయగడము వదలి ఇటుల వస్తూన్నారు?

షాహీ—మహారాజుగారిని రాయగడముకు తీసుకొని పోవలెనని సంగమేశ్వరముకు బయలుదేరినారు—కాలయాపన చేస్తే కార్యము మించుతుంది—ముందు ఖండోజీని కలుసుకోవలెను—నేను పోతాను.

దాల—వెర్రివాడా! మహారాజుగారు శత్రువులకు చిక్కకుండే సాధనము చూడవద్దా? త్వరగా సంగమేశ్వరము చేరుకో.

షాహీ—అమ్మగారి మాట? ఆమె కవమానము తప్పించవద్దా? ఖండోజీ కీ రెండువార్తలు చెప్పేవా రెవరు?

దాల—ఆపని నే జేయగలను.

షాహీ—సంతూ నేమి చేస్తావు?

దాల—ఈ రెండు పనులూ నేను చక్కబెట్టగలను. నీవు మహారాజుగారిని కనిపెట్టి వుండు. (షాహీ పోవును) కాపునాయకుడా! స్వజాతీయుడవు. పేదవాడవైనా ఉదారుడవు. ఈపడుచు ఖండోజి చెల్లెలు—నీ కప్పగిస్తూన్నాను, జాగ్రత్తగా కాపాడు.

(ఖండోజి వచ్చును)

ఖండో—దాలితీ! నేను కాపాడగను.

సంతూ—అన్నయ్యా! కంటపడ్డావా? కలకాలము బ్రతుకు!

ఖండో—ఈమె నిక్కడ దిగవిడిచి నీ వేమి చేయ నెంచినావు?

దాల—ప్రభూ! ఘోరసంకటములు ప్రాప్తించినవి. గణోజీ అమ్మగారిని కైదు చేయవలెనని ఆరువందల అరబ్బీలతో వస్తూన్నాడు. మహారాజును పట్టుకొందామని ఇఖ్లాస్ ఖాను సంగమేశ్వరము పోతూన్నాడు.

ఖండో—ఇది నీ కేలాగు తెలిసింది ?

దౌల—షాహీ గిప్పుడే చెప్పి పోయినాడు.

ఖండో—ఇంతతో మన దుర్దశ నురతిక్రమణీయమయింది. హా ! దైవమా! మా నుదుట ఏమి వ్రాసినావో ? మహారాజుగారికి ఘటింపనున్న ఆపద తప్పించడానికి చరమోపాయ మని ఎండక న్నెరుగని మహాసాధ్వి మహారాణిగారిని ఘోరారణ్యములకు తెచ్చి, రాజుగారిని వెంటబెట్టుకొని రాకుండా రాయగడములో కాలు పెట్టనని రాజారామ్‌గారితో ప్రమాణము చేసినాను. "ఇంటి గుట్టు లంకకు చేట" న్నట్లు కృతఘ్నుడు రాజద్రోహి అయిన గణోజివల్ల నా యత్నములన్నీ ధ్వస్తము లైనవి. నలుగురు మావళాలతో నావల్ల నేమౌతుంది ? దక్షిణాపథసార్వభౌముడైన మహారాజును కాచుకొని యుండనా, లేక మాజాతికి నోములపంట ఐన మహారాణిని కాచుకొనియుండనా ?

సంతు—అన్నయ్యా, పాతరాజుగారు పట్టెడు మావళీలతో మన రాష్ట్రము ప్రతిష్ఠించలేదా ?

ఖండో—ఆయన అవతారమూర్తి; అతనికి సాటివీరు డీఅవనిలో లేడు. ఆయన కార్యము లతిమానుషములు, అవన్నీ వారి మహత్త్వముచేత సాధింపబడినవే కాని ఉపకరణముల చేత కాదు. ఆయన చర్య అదృష్టశ్రుతపూర్వము.

సంతు—మర్రి చెట్టు మొదలు తెగ నున్నప్పుడు ఊడలు దాని నిల్పవలెను ఏనాడో రాక్షసకులనాశనము

కావించి ప్రజలను బిడ్డలవలె పరిపాలించిన శ్రీరాముని కీర్తి ఆచంద్రార్కము నిల్చినట్లు నిర్జీవములైన గుళ్ళూ గుండములూ, కొండలూ, చెట్లూ, చేమలు కాపాడుతూన్నవే. మొన్ననే కలికాలమున రామరాజ్యము స్థాపించిన మహారాజుగారి కొడుకుని కోడలిని కాచి వారి యశము నిలువబెట్టుటకు శూరులు వీరులు విర్రవీగే మీబోటి సజాతీయులకే సాధ్యము కాకున్నది! ఏమని చెప్పుదును?

ఖండో—అపోహముచేత స్పష్టముగా మమ్ము తృణీకరిస్తూన్నావు. బాల్యమునుండీ నన్ను లాలనపాలనచేసి ఏ సాధ్వి తన దేహమునకు శ్రమ కల్గించుకొన్నదో ఆమె చరణకమలములకు నా సర్వస్వ మర్పించుటకు నేను లేశమైనా జంకను. కాని ఏమి చేసినా సార్వభౌమసంపదలను విపత్సాగరమునుండీ తప్పింపజాలను... దౌర్భాగ్యమా! పాషాణనిష్ఠురపరికరములతో పగులపడగున రా! జన్మజన్మాంతరములయందు మే మొనర్చిన పాతకములారా! ఒక్కపెట్టున మామీద పడండి. మిమ్ము ప్రతిఘటించి నిల్వలేము... అమ్మాయీ! ఇటు రా! పురందరుకోటముట్టడిలో ఒక పఠాను రౌతు హఠాత్తుగా మురారిబాజీ కంఠమును ఖండించెనట. ఆ మొండెము ముప్పై అడుగులు వేసి ముప్పైమంది శూరులను దునుమాడి ధరపైని కూలెనట...విశాలగడముకు పోవు త్రోవలో అర్ధరాత్రి వేళ మతాబుల వెలుగున ఎనిమిదివేల మొగలులు ఆ శాసాహెబుగారిని వెంబడించినప్పుడు ప్రభురక్షణార్థము

వంకల మహావళీలతో రాజీప్రభువు కొండలోయ
ను నిల్చి తన శరీరము జల్లెడవలె తూట్లుపడి రక్త
లు ప్రవహిస్తూన్నా మహారాజుగారు కుశలముగా
ప్రాసాదము చేరినారన్న వార్త చెవిని పడేవరకూ పోరి
టి వీరస్వర్గము చేరినారు. అట్టి కాయస్థులమైన మనము
ంచినాము. వారిఖ్యాతి మనము నిలువబెట్టవలెను.

సంతు—ఇప్పుడు మనము చేయవలసిన పనియేమి ?

ఖండో—మహారాణిగారి మానప్రాణములకు హాని
యున్నదని ఎరుగుదువా ?

సంతు—విన్నాను.

ఖండో—అమ్మగారి రక్షణార్థము వారిస్థానే మేనాలో
కూర్చుండి వారికి రానున్న ఆపద నీవు తొలగించవలెను.

సంతు—ముడిమాట చెప్పక ఇన్ని మాటలెందుకు ?
దానవని ఇంత అనుమానించినావా ? నాకు ప్రాణములు
తీపనుకొన్నావా ? లక్షలకొలది ప్రజల పోషించే మహారాణి
మానప్రాణములకు హాని వచ్చేటప్పుడు దానిని తొల
గించే ఉత్తమ కర్తవ్యమును ఊరక పోనిస్తునా ? నీవు సర్వ
ము బలివేయనెంచి కార్యాంబుధిని మునుగుటకు సిద్ధుడ
వైనప్పుడు నీచెల్లెలిని నేను మాత్రము వెనుక తీస్తానా? నీ వేలి
కున్న ఉంగరము ఇస్తివా కరకర నమిలి కార్యము సాధిస్తాను.

ఖండో—ఇదిగో ఉంగరము (చూపుతు) రాజహంసను
పెంచడానికి భగవంతుడు ముత్తెపుపొడి మేపించునట.

ఆలాగు నిన్నంతో మొందించడానికి నేను వజ్రపుపొడి ఇస్తు న్నాను. ఈసజ్జనుడు కొద్దిగా నములి మింగితివా వచ్చని నీబల్లు బూడిదె వలె నల్లపడుతుంది; పిమ్మట యమయాతన అనుభవిస్తావు. కాని శీఘ్రముగా నీ ఆత్మకు నిరతిశయానం దము నిచ్చే సాయుజ్యము లభిస్తుంది (ఇమ్మను.)

(యేసూబాయి పెద్దబోయీలా వత్తురు)

యేసూ—ఆపిల్లకు ఉంగర మెందుకిచ్చినావు? ఆమెతో నేమి చెప్పుతూన్నావు?

సంతు—దీనిని నేను పెట్టుకోవలెనని ముచ్చట పడ్డాను—అందు కిచ్చినాడు.

యేసూ—మీ రేదో ఘోరకార్యము తలపెట్టిన ట్లుంది.

ఖండో— స్వామి భక్తులకు సహాజమైన పని చేస్తూ న్నాము కాని ద్రోహ మేమీ తలపలేదు.

యేసూ—మీరు కేవల మానవులు కారు, శాప భ్రష్టులై జనించిన దేవతలో ఋషులో! మీ చిత్తవృత్తి నెరుగ నాకు వశమా?

ఖండో—మీతో ఎప్పుడైనా అసత్య మాడినానా?

యేసూ—ఈపిల్ల ఉంగర మమ్మని పోరుపెట్టినదా? దీని కుంగరమే కావలిస్తే మన భాండారములు లేవా?...ఖండోజీ, నీ వేమన్నా సరే. ఈపిల్ల ప్రాణముపట్ల నీమనస్సులో నేదో కీడు జనించిన దని నాకు తోచినది. నాకురానున్న కీడు...

(వేగు వచ్చును)

వేగు—భద్రము, భద్రము, ఖండోజీ—అమ్మగారిని జాగ్రత్తగా చూడు. శత్రువులు సమీపిస్తూన్నారు—అందరిలో ముందు గణోజీ చావుపరుగున వస్తూన్నాడు.

(పోవును)

ఖండో—పిడుగువంటి వార్త తెల్పినాడే!

యేసూ—శత్రువు చేరవచ్చెనా? నన్నవమానించవలెనని నాఅన్న గణోజి వస్తూన్నాడా?...ఇప్పటి కంతా తెలిసింది. ఈవార్తకు వెరచియే కాబోలు సంతూమాయికి వజ్రపు టుంగర మిచ్చినావు!...మాటాడవేమి?

ఖండో—నిజము. నన్ను మన్నించండి.

యేసూ—ముక్కుపచ్చలారని ముగ్ధను చంపి నా ప్రాణము దక్కించుకొంటూనా? సాధ్వియైన ఈ సుమంగళిని చంపుతే నాసౌభాగ్యము సాంద్రముగా సాగునా?

ఖండో—ఈపట్టున మీరు మామాట వినక తప్పదు—మనమాట వినకపోవడము చేతనే మహారాజుగారు దురపనేయమైన దుస్థితిలో నున్నారు—మీరు ఈక్షణమే అడ్డుతోవల రాయగడమునకు ప్రయాణము కావలయు. మహారాజుగారి విషయమున మీకు బెంగవద్దు, త్వరలోనే వారిని రాయగడము చేర్చగలము. కష్టమని వెనుదీయక కుశలప్రదమైన రీతి అవలంబించండి, పరుగుడంచీలపై పస్తుండియైనా రాజప్రాసాదము ప్రవేశించండి. (రాణీ మాలతీ పోవుదురు)

(సంతూతో) చెల్లీ, ఇవే మన తుదిచూపులు, అమ్మగారి సవారీలో కూర్చో.

(తెరలో దీన్‌దీన్ అని కేకలు.)

అదిగో శత్రువులు సమీపిస్తూన్నారు.

సంతూ—నీవిధి నిర్వర్తించు. ఇదే నమస్కారము.

ఖండో—మన కులదేవతలకు, నీ పతికి, మనపెద్దలకీ మొక్కి కాలానుగుణ్యముగా వవ్యహరించు. (తెరలో దీన్‌దీన్)

ఇంక కావలసినంత అరవండి. ఇదే నేను సంగమేశ్వరము పోతూన్నాను. బోయీనాయకా! అమ్మాయి వజ్రము మింగగానే (చెవిలో చెప్పును)

నాయ—సాగనీయండి సవారి! (గణోజి వచ్చును)

గణో—ఆపు సవారి.

నాయ—అడ్డు లే. నీవెవడ వాపుమనడానికి?

గణో—ఎవరితో మాటలాడుతూన్నావో ఎరుగుదువా?

నాయ—తెలియకేమి? తురకసైన్యము వెంటబెట్టుకొని తన సోదరికి ఘాతుకము ఒనర్చిన కంకణము కట్టిన కలుషాత్ముడు గణోజీతో. నడవండి—ఈ నీచునికి జడియవద్దు.

గణో—ఓరీ, వదరబోకు, నీ ప్రాణము లుండజూసుకో.

నాయ—ఓరి కసాయివాడా? మహారాణిగారి ప్రాణములకన్న మాప్రాణా లెక్కువా? నీవంటి తుచ్ఛుడను కాను స్వకీయుల మానప్రాణములు తీయుడానికి.

గణో—మీ మహారాణిని ఖైదు చేయక మానను. తీయండి కత్తులు. (యుద్ధముజరుగును—తెరలో శిర్కే! శిర్కే! ఖండోజీ కొంతసైన్యముతో సంగమేశ్వరము చేరుతూన్నాడు. మించిపోయె! మించిపోయె) ఏమిది? ఖండోగాడు రాజుగారిని రక్షించడానికి పోతూన్నట్లుంది. రిసల్దారూ! నీవు వెంటనే పో! సంభాజీమీద ముందు పడుదాము. సవారీకూడా సాగనీ (పోవుదురు).

నాయ—పో—కుత్సితుడా! పొంగి పోతున్నావు కాని, నీవంటి తుచ్ఛునిచేత చిక్కేటంత పాపము చేయలేదు మహారాణీగారు. ఇలాగే మహారాజుగారు కూడా నీకంట్లో దుమ్ము జల్లితే నీ పాపము పండుతుంది. సంతూషమాయి జన్మ సఫలమయినది. (తెరపడును).

నాల్గో రంగము

సంగమేశ్వరములో ప్రాసాదము

(కబ్జీ ప్రవేశించును).

కబ్జీ—అబ్బా! ఏమి ఘోరమైన రాత్రి! గాఢాంధకారము విశ్వమును గ్రసించినది. జీవితకాలమంతా పాపాచరణమే తప్ప పుణ్యమేమో ఎరుగక శల్యమాత్రావశిష్టుడై క్రియానష్టుడైనదీర్ఘరోగివికటాట్టహాసముకన్న భయానకముగానుంది. క్రిమికీటాదుల కర్కశరవము, త్రోవలమధ్య భూత

ప్రేతముల కొసగబడిన బలిరాసు లారగింప వీకులాడే బక్క కుక్కల వికృతభోంకారములు, కుళ్లినశవముల యెముకలకై పోట్లాడే సివంగుల కూతలు, తోడేళ్ల అరుపులూ—ఈ ధ్వనులు తప్ప ఇతర మేదీ చెవిని బడలేదు. నడిమింట భానుని పూర్ణముగా గ్రసించిన కేతుమూటకేమి ద్వాదశాదిత్యులనే కాక విశ్వమునంతా పొట్టను పెట్టుకొన్న ప్రళయరాత్రి కూడా ఇట్టి అశౌచపు కళ ప్రసరింపజాలదు—ఈ నిబిడనిశీథమున ఎటుచూచినా అనుభవశిష్టములైన మహాపాతకుల ఘోర వాసనాబృందము దాల్చిన భూతప్రేతపిశాచఢాకినీ రూపములు తప్ప వేరు దృశ్యము కాన్పించదాయెను!...ఏదో ధ్వని విన బడ్డట్టు లుంది...సంభాజి కలవరింపు కాబోలు. చేసుకొన్న పాపసంచయము దుస్స్వప్నరూపమున అతని నిద్రను కలత పెట్టుతూన్నది! గాఢనిద్రాసుఖ మితని కీజన్మాన లేదు...... ఇంకెంతకాలము జీవించగలడు? కృతాంతుని బోలిన ఇఖ్లాస్ ఖాన్ రానున్నాడు—అతనిపాలబడిన వెనక ఇతని జీవయాత్ర సమాప్త మగును. ఖండోజి ప్రాణములపై నాస విడిచి వచ్చి నాడే కాని ఇతని నుదుటివ్రాత తప్పింప నతనికి తరమా? నక్షత్రము లెంత కాంతివంతములైనా గాఢాంధకారమును తొలగించగలవా? ఉల్కాపాతమువలె ఉట్టిపడ్డ ఖండోగాడు కూడా ఈ దెబ్బతో కన్ను మూసితీరుతాడు. ఒకవేళ ఈ గండము తప్పిందా ఈశ్వరానుగ్రహ మనుకోవలెను... ఏదో కాలిచప్పుడు వినబడ్డట్టుంది...మొగలనేన వస్తూన్న

దని తెల్పడానికి దూత ఎవడైనా వచ్చినా డేమో ! లేకుంటే......

(తులసి వచ్చును)

తుల—కబ్జీ ! కబ్జీ !

కబ్జీ—ఎవ రది ?......తులసీ !

తుల—మొగలు సైన్యాలు రాలేదా ?

కబ్జీ—లేదు—ఆ జాడే కానరాలేదు.

తుల—నా గుండె జారిపోతూంది.

కబ్జీ—ఏ మది?

తుల—ఏమి పీడకలలు ? తరుమండి—చంపండి—అని వెర్రి కేకలు వేస్తూన్నాడు మహారాజు.

కబ్జీ—మేలుకొల్పి మరొక పెగ్ పోస్తివా నోరు కట్టి పోతుంది.

తుల—అలాగే చేతా మనుకొన్నాను—తీరా గ్లాసు నింపేసరికి ఏదో కాలిచప్పుడు వినబడ్డది.

కబ్జీ—ఇన్ని పారాలు దాటి ఎవడు రాగలడు ?

తుల—నిజమే, నామాట నమ్మవేమి ? చప్పుడు వినబడగానే నాల్గువైపులా పరికించి చూచినాను. అప్పుడు సన్నని గొంతుకతో "రాజా ! పగవారి పంచ ! పదిలము ! పగవారి పంచ ! బహు జాగ్రత్త !" అని హెచ్చరిక వినిపించింది—అదిగో రాజు లేచినాడు. (పక్కకు జరుగుదురు).

సంభా—ఎవరా పగవారిపంచ అని అన్నది? నాపై పగబట్టి నన్ను మోసగించ దలచిన కాలసర్ప మేది?... ఎటుచూచినా ఎవరూ కానరారు. పీడకల గని అరతెలివిలో నుండగా "రాజా! పగవారి పంచ! జాగ్రత్త!" అని నన్ను హెచ్చరించిన దెవ్వరు?... ఈ ఇంటికి నేలమాళిగ యున్నదా? అందలి భూత మేదైనా అరచియుండునా? కరుణార్ద్రమైన ఆ కంఠధ్వని నాచెవిని బడినతోడనే కలుషాత్ముడైన కబ్జీ కుట్రనుంగూర్చి మహారాణి పల్కిన పలుకులు జ్ఞప్తికి వస్తూన్నవి—ఇదంతా మోసమా! కబ్జీ ఏడీ?

(తెరలో రాజా! పగవారి పంచ! బహుజాగ్రత్త!)

తిరిగీ అదే హెచ్చరిక! కబ్జీ!

కబ్జీ—మహాప్రభూ!

సంభా—నీ ఏర్పాటులో ఏదో పరామరిక జరిగిన ట్లున్నది—పహారాజవానులు మత్తెక్కినారా?

కబ్జీ—లేదు—మహారాజా! ఇప్పుడే చూచి వచ్చినాను—ప్రభువులవద్ద నుంచిన పహారాలో పరామరిక ఉంటుందా? నేను బహు జాగ్రత్తతో పరికిస్తూన్నాను.

సంభా—ఇప్పు డొకధ్వని వినబడ్డది విన్నావా?

కబ్జీ—లేదే—ప్రభువువారు భ్రమపడుతూన్నారు.

సంభా—కాదు కాదు—నేను స్పష్టముగా విన్నాను—నాకు నే డేమో దుస్స్వప్నము లనేకములు వస్తూన్నవి—మా తండ్రిగారు నాకు పదేపదే కనబడి "బిడ్డా! మోసము

నకు గురి కాకుమా! ఈక్షణమే రాయగడముకు ప్రయాణము కమ్మ"ని హెచ్చరించినారు. వెంటనే... .....

(తెరలో) "రాజా! పగవారి పంచ! జాగ్రత్త!" విన్నావా ఆధ్వని—ఇదే పలుసార్లు వినబడ్డది.

కబ్జీ—(స్వ) ఓహో! ఇది చంద్రావళి కంఠధ్వని.

సంభా—పోయి చూడు—ఈ ధ్వని ఎక్కడ పుట్టుతూన్నది? మాతండ్రిగారి హెచ్చరిక, నా భార్య చెప్పిన మాటలూ, ఈ కేక—ఈ మూడింటిని సంప్రతించి చూస్తే నేను శత్రుమధ్యమున ఉన్నానని నిశ్చితమవుతూన్నది. పహరా జవానులు ప్రమత్తులు కాకుంటే ఈ విపరీత మేలాగు జరిగింది?

కబ్జీ—మహాప్రభూ! ఇవన్నీ భూతచేష్టలు. చండముండ మహిషాసురమర్దని మహామంత్రము సిద్ధించే వేళ గనుక—

"అపక్రామంతి భూతాని పిశాచా స్సరతో దిశామ్ సర్వేషా మవరోధేన...—"అనే మహామంత్రముతో ఈ చోటు అరికట్టివేసినాను—అందుచేత నిల్వ నీడలేక భూతములు అంతరాళమున సంచరిస్తూ వికటప్రతికూలచేష్టలు చేస్తూన్నవి—ఇదొక వింత కాదు.

సంభా—భూతముల బొబ్బ లన్నా సరే, మా కులదేవతల కుశలవచనము లన్నా సరే, మా తండ్రిగారి హెచ్చరికతో సరిగా మేళవిస్తూన్నవి. అందుచేత నాకు వాటియందు

నమ్మకము కుదిరింది—ఇక నిక్కడ కాలయాపనము చేయవల
సని లేదు. ఈక్షణమే రాయగడమునకు బయలుదేరి తీరు
తాను—నీవు ఏర్పాటులు చెయ్యక తీరదు.

కబ్జీ—జగదంబ! జగదంబ! ఎంత తెలివిమాలిన
యోచన మహాప్రభూ! మీవంటి ధైర్యశాలురు సాహస
వంతులు భూతముల బొబ్బలకు భయపడుట భావ్యమా?
పసిబాలుడైనా పరిహసించడా?

సంభా—వ్యర్థముగా నిక్కడ కాలక్షేపము చేయ
రాదు-ప్రాణభీతిచేత కాకపోయినా సామ్రాజ్యక్షేమము కొర
కైనా ప్రమత్తుడనై పరుండ నుండరాదు—యుద్ధభూమిని
సాటిశూరులతో పోరి సమసినట్లైతే చింతలేదు—ఇక్క డది
లేదు—మంత్రతంత్రము లనే నీ మాయకు లోబడి శత్రువుల
పాలని పడితే—తాగుబోతురాజు తాగుడు చేతనే చచ్చినా
డనీ, తులసి మోహావాగురులలో జిక్కి సంభాజి తాను చావ
డమే కాక సామ్రాజ్య మంతా నున్నచుట్టినా డనే అపఖ్యాతి
నా నెత్తిపై కెక్కుతుంది—త్వరగా రాయగడప్రయాణమున
కేర్పాటులు చేయవలెను.

కబ్జీ—(వెడనవ్వుతో) సుఖముగా కుడిచి కూర్చుండి
లేనిపోని ఆపద లాహ్వానిస్తా రేల? చిన్న మేఘము సూర్యుని
చాటుచేసినప్పుడు గ్రహణము పట్టునా? మేఘ గర్జనమునకు
భూమి కంపించునా? అతిమానుష చర్యలకు మీ రెల్లు అదల
నేల?

సంభా—అహోరాత్రములు నా అడుగులకు మడుగులొత్తి సేవచేస్తూ అతివినయముతో నాయాజ్ఞలుమన్నించే కబ్జీ నేడు నామాట లక్ష్యముచేయక మాటలతో కాలము గడుపడము చూస్తే వీ డేదో ద్రోహము తలపెట్టినట్టుంది. ఇదివరకు వీనిమాట లెంతో శ్రోత్రపేయముగా నుండేవి, వాటియందు నాకు దృఢమైనవిశ్వాస ముండేది—ఇప్పుడు అవి యమయాతన కలిగిస్తూన్నవి. రాణి చెప్పినట్లు వీడు ధనాశచేతనన్ను శత్రువుల కమ్మునా ఏమి? (ప్రైకి) కబ్జీ! నామాట నీకు వినబడ లేదా? ఇదివర కెన్నడూ నా కెదురాడని వాడవు ఇప్పుడు నా యాజ్ఞ లక్ష్యము చేయవేమి?...ఇంకోసారి చెప్పుతూన్నాను—నే నిక్కడింకొక క్షణమైనా నిల్వను. పద రాయగడమునకు—రాణీని యువరాజనూ చూడవలెనని నాచిత్తము తత్తరపడుతూన్నది.

కబ్జీ—మహాప్రభూ! మీ యాజ్ఞ నే నిప్పుడు మన్నించలేను.

సంభా—ఎంత తలబిరుసు! పేనుకి పెత్తన మిచ్చినట్లాయెను నీ కధికార మివ్వడము—ఖలచిత్తా! నీవు కపటివని ఇప్పుడు స్పష్ట మయినది.

కబ్జీ—మహాప్రభూ! మీ రనవసరముగా కొందలపడుతూన్నారు. మీయాజ్ఞ లొకదాని కొకటి వ్యతిరేకముగా నున్నవి—మంత్రసిద్ధి అయ్యేవరకూ నా మనవికి ప్రతికూలముగా వ్యవహరించ నని నాకు వచన మిచ్చినారు—సిద్ధి సమీ

పించినది, ఇప్పుడు వచనభంగపాతకమునకు ఒడిగట్టి రాయగడ మునకు ప్రయాణము చేయుడ మన్యాయము—సిద్ధి పరిసమాప్తి కానున్న సమయమున విఘ్నము రాకూడదు; అందువల్ల మంత్రము బెడిసికొట్టి మీకో మీ రాష్ట్రమునకో చేటు తెచ్చి తీరును. కావున నాకెంత ఇష్టము లేకపోయినా మీయాజ్ఞ నుల్లంఘించక తీరినది కాదు.

సంభా—గర్భదరిద్రుడవైన నిన్ను కలవానిగా చేసి నాను—గోచిపాతరాయనికి గొప్పపదవి కల్పించినాను—ఇంత చేసినది నాకు ప్రాణసంకటము వచ్చినప్పుడు నామాట నిర్లక్ష్యము చేయుడమునకా? నీమాట నమ్మి ప్రాణపదమైన నారాణి నవమానించినాను—ఇంతవరకూ నిన్ను బహూకరించినదానికి ప్రత్యుపకారముగా కుట్ర పన్ని నన్ను మోసగించి నా కపకార మొనరింతువా?

కబ్జీ—నేను కుట్ర పన్నినానని ఎవరు నిరూపించ గలరు?

(చంద్రావళి వచ్చును)

చంద్రా—నేను నిరూపిస్తాను.

సంభా—చంద్రావళీ, నిన్ను రాయగడమున బందిఖానాలో నుంచినానే—ఇక్కడి కెలాగు రాగల్గినావు?

చంద్రా—మహాప్రభూ! మన్నించండి—నే నిచ్చటికి కోరి రాలేదు.

సంభా—ని న్నెవరు రప్పించినారు?

చంద్రా—మహాప్రభూ! నిజము చెప్పుతున్నాను—మహారాష్ట్రప్రభువును మరణద్వారముకడ చేర్చిన మహాద్రోహి, నవకోటి రాజనరేంద్రుని నాశముంగింప నానాకపటవ్యూహములు పన్నిన కూటనీతిపటుడు—గోబ్రాహ్మణరక్షణాధురంధరుని గంగిగోవును కసాయివాని కమ్మజూపిన కఠినాత్ముడు—మంత్రతంత్రప్రవీణత అను మిషచేత మాయాజాలము పన్ని మహామహితాత్ముని మచ్చుమాప యత్నించిన మహేంద్రజాలికుడు—నీచాతినీచకులోత్పన్నుడై నికృష్టముష్టింపచజీవనము సల్పెడు రుగ్ణశునకతుల్యుడై కనకాభిషేకముననైనా కరవుతీరక వెనుకటి గుణమహాత్మ్యమున మొగలుల ఉచ్ఛిష్టరాజ్యకబళమున కాసించి అన్నదాత అపరవిధాత ఐన మహారాష్ట్రమండలేశ్వరుని మానప్రాణములకు వారి గర్భశత్రువు, సర్వగ్రాహక దురాశాపరుడైన మహమ్మదీయసార్వభౌమున కప్పగించ నెంచి తరుణ మాసన్న మగువరకు, తాటోటుమాటలు తథ్యేతరములైన ఆత్మస్తుతి పరనిందావహములైన ఆకాశభాషణములతో కాలయాపనము చేస్తూన్న కపటి, తుచ్ఛుడు, భీరుడు, అసత్యవాది అయిన కలశా కబ్జీ, మానమర్యాదలు కాపాడుకొంటూ మూల నుండవలసిన ముగ్ధను నడిబజారున కీడ్చినాడు.

(తెరలో ఫిరంగిధ్వని—దీన్ దీన్—హరహర మహాదేవా అని కేకలు. కిటికీనుండి ఖండోజి దుముకును.)

సంభా—ఎవ రది ?

ఖండో—దగా! దగా! మహాప్రభూ! విశ్వాస ఘాత! ఇఖ్లాస్‌ఖాన్ సైన్యము హఠాత్తుగా ఈ యింటిని ముట్టడించినది. ద్వారముకడ నిలిచి శిర్కే మావళేల తెగ నరుకుతూన్నాడు. తప్పించుకొను దారిలేదు. ఈ చండాలుని పన్నాగమేయిది. మహారాష్ట్రమును మట్టిలో కలప నెంచినాడు.

తెరలో—దీన్ దీన్—హరహరమహాదేవ!

సంభా—హృదయము పాషాణమయ మయింది, ఇంక పగిలిపోనున్నది. మహాత్యాకాంతు కుంటితొంటి యైనది. చండాలుడా! స్వజనధ్వంస మొనర్చి శత్రువులను ప్రశంసిస్తూన్నావా? ఇదిగో నీ కర్మఫల మనుభవించు (వీక నరుక బోయి) చీచీ! నిన్ను చంపను. గోబ్రాహ్మణప్రతిపాలన ఛత్రపతులకు కులధర్మము, వ్రతము. ఆసననిర్యాణుడనైన నే నిప్పుడు బ్రహ్మహత్యకు పూనను. పో! నాయెదుట నుండకు. (తన్నును).

ఖండో—మహారాష్ట్రశూరులారా! మావళా ప్రభువు మర్యాద నిల్పినారు? శిర్కేని చితకపొడవండి...అయ్యో! అయ్యో! సింహద్వారము చీలిక లయింది. మహాప్రభూ!

సంభా—వాయువేగమున శత్రువుల ఖండించి పోదామా? జయమేనా కల్గును, లేదా వీరస్వర్గము చేరుదాము. శూరు డెప్పటికైనా సంగరరంగమందు శయనించవలసినదే! కులదేవతలకు మొక్కి "హరహరమహాదేవ" అని గర్జించి అరుల చెండాడుదాము.

చంద్రా—వద్దు—మహాప్రభూ! వద్దు. సాధారణ భటునివలె మహారాష్ట్ర సార్వభౌముని కర్కశ పటాణి బృందము బారిని పడనీయము. మిన్ను కూలినప్పుడు మృత్యువు వాత బడవచ్చును. అంతవరకూ నేను వచ్చిన రహస్య మార్గము...

సంభా—శత్రువులు సమీపవర్తులై గర్జిస్తూండగా, సద్వీరవంశసంజాతులైన సంబంధీకులు మహాగ్రహముతో శత్రువుల చీల్చి పోరుతూండగా, పిరికినై బిలమార్గమున బైటికి పరుగెత్తుదునా? చీ ఛీ! ఇది శూరునకు తగదు. పోరికి జంకువాడను కాను.

ఖండో—ఇప్పు డీ సుమంగళివచనము పాడిసేయక పోవడ మాపజ్జనకము. చంద్రావళి సలహా ప్రకృతపరిస్థితు లలో పరమమంగళదాయకము. సాధారణు లెంతమంది సమ సినా వారి పాలకుడు బ్రతికియుండవలెను. రక్షణ మసంభవ మైనప్పుడు రహస్యమార్గము ననుసరించడము రాజనీతి. మీ శౌర్యము అనివార్యము, అకుంఠితము; ఐనా పగవారి సైన్యము అమితమై పైన బడ్డప్పుడు కపటోపాయమున గడప దాటడమే ఉత్కృష్టమార్గము. (తెరలో దీన్ దీన్.) అదిగో, దగ్గరపడ్డారు, దాటుదాము త్వరలో—(చంద్రావళి ముందూ ఖండోజి తరువాత ఆ వెనక సంభాజి పోతూం డగా అకస్మికముగా గోడ కూలి సంభాజీ లోపల ఉండి పోవును.)

గణో—పగ! పగ! పగ! పొగరుబోతా! ఇదిగో శిర్కే కసితీర్చుకొన్నాడు.

(గోడమీదినుండి దుముకును)

సంభా—శిర్కే! కులాంగారమా! ఇదిగో నీ పాతకములకు ప్రాయశ్చిత్తము.

(కత్తితో నరుకబోవ అరబ్బీలు రెక్కలు విరిచి కట్టుదురు)

గణో—జాగ్రత్త! మదోన్మత్తుడా! మృత్యుముఖమున పడిన నీకు ప్రాణాలపై ఆశ ఎందుకు? చావుకు సిద్ధపడు. నా బంధువుల జంపి కులనాశ మొనరించినావు. ఆ మానధనుల వంశజుడను నీ నేరములకు ప్రాణదండనము విధిస్తూన్నాను. తల వంచు.

సంభా—తులువా! మా ఛత్రపతుల శిరస్సు పాదుషా ఎదుటనైనా వంగదు, తుచ్ఛుడవైన నీ ఎదుట వంగునా? నీ బంధువులను నేను బహిరంగముగా కూల్చితిని కాని పిరికివాడనై పగవారి చెప్పులు మోసి కార్యము సాధించలేదు. నాపై పగ ఉంటే నాతో బాహాటముగా పోరుము. మగవాడు చేయదగినపని అది. ఆడదానివలె తెర కలపంచ జేరి తులువా! నీ ప్రభువునకే గాక రాష్ట్రమంతటికీ ముప్పు తెచ్చినావు—నీబోటి కులపాంసను డుండబోడు.

గణో—బలవంతుడను గాన పగతురను నీ చిత్తము వచ్చినట్లు కూల్చినావు, నేను బలవంతుడనైనా ఒంటివాడను కావున బలిష్ఠుల నాశ్రయించవలసి వచ్చినది. నీవు ఉత్తమ కులద్రోహివి రాజవు; నే నుత్తమకులజుడను రాజద్రోహిని. ఇద్దరము సమాన పాపులమే. నీవు ఛత్రపతివైనా, మహారాష్ట్రసార్వభౌముడవైనా నిన్ను చంపక మానను—శివలింగముపై నున్న తేలుపై దయచూపుతారా?...నీ కుల దేవతల స్మరించుకో—నీచావు దగ్గరపడ్డది—పాపసంచయము పరిహరించుమని పరమేశ్వరుని వేడుకో...(కత్తి నెత్తును).

(ఇక్లాస్‌ఖాను వచ్చును).

ఇక్లా—ఆగు శిర్కే—ఏమి చేయ నెంచినావు?

గణో—నా పగవానిని పరిమార్చుతాను.

ఇక్లా—వల్లకాదు—ఇతడు నీకు పగవాడైనా సరే కాని అతనిపై నీవు కత్తి నెత్త వీలులేదు.

గణో—ఖాన్‌సాహెబా! ఇంత మహాప్రయత్నము చేసి మహమ్మదీయసేనల రప్పించినది ఇతనిపై పగతీర్చుకోవలెననే—అది నేను మానుదునా?

ఇక్లా—మహారాష్ట్రసార్వభౌముని మామూలుమర్యాదలతో మావద్దకు తేవలెనని పాదుషావారి యాజ్ఞ!

గణో—అందుకు కారణము?

ఇఖ్లా—ఇతడీస్లాముదీక్ష స్వీకరిస్తే పాదుషావారి ప్రాపు బడయగలడు.

గణో—ఈతనిపై పగదీర్చుకోవలెననే కదా పాదుషా వారి ప్రాపుకోరినాను. నా ప్రతిజ్ఞ పాలించకుండా విడుతునా?

ఇఖ్లా—పాదుషావారి ఎదుట నీపగ తీర్చుకో వచ్చును.

గణో—అయ్యో! రెండింటికీ చెడితినే!

(తెర వాలును).

సంభాజి నిర్యాణము

నాల్గో అంకము

మొదటి రంగము

తులాపురంలో పాదుషాసేనామధ్యమున గణోజి.

గణో—అంతటా తురకలే! మహారాష్ట్రుడొక్కడూ లేడు. గోరుచుట్టుమీద రోకలిపోటు! తలయెత్తితే తురక ప్రత్యక్షము! వారిని చూస్తే అరికాలిమంట నెత్తికెక్కుతూన్నది—సంగమేశ్వరములో వీరు చూపిన స్వార్థపరాయణత కన్నులకు కట్టినట్లున్నది. సంభాజీపైని తీర్చుకొందామన్న పగ వీరిపై ప్రసరిస్తూన్నది. ఈసేనా సముద్రములో మునిగియున్న నేను దీని తరించడ మేలాగు? మనసులోని దుఃఖము పంచుకొనే మరాటావా డొక్కడు లేడు కదా? పాదుషా కోరిక తీర్చడానికి నే నొక సాధన మయినాను. నాకోర్కె తీరడ మేలాగు? పారా జవాన్!

జవా—క్యా హోనా?

గణో—నాకోస మెవ్వరైనా వస్తే లోనికి పం

(అతడు వెళ్లును)

తలవ్రాత తప్పించలేము—నే నొనర్చిన పాతకము పరిహారము నేనే చేయకపోతే నాకు చిత్తశాంతి లభించ చిత్తము స్వాధీనమైతే పసిబాలికవలె పరిదేవన ము నక్కర యుండదు. నా ద్వేషము దీర్ఘమై నన్ను దు చేసింది—మహారాజుపై కసి చేత నిసర్గవైరి అని తలం మహామ్మదీయునితో మైత్రి చేసినాను. ఎండమావులవె పారి ప్రాణములు గాయసున్న లేడిపిల్లవలె నెత్తురు కక్కు సిద్ధుడనై యున్నాను. పగతీర్చుకో లేకపోయినాను, సరేక ఆప్తులకు శత్రువు నైనాను; ఏకాకినై శత్రునేనా వారముప జెండాలేని కొయ్యలాగు వ్యర్థముగా పాతుపడినాను. ప పంచను పదికాలాలు పడియుందా మంటే స్వాభిమాన సాగనీయకుండా ఉన్నది. ఊపిరి సలుపక గుండెలు చె లవునేమో అని సంశయిస్తూన్నాను. మావాళ్లను క మొగలుల ప్రయత్నము విఘ్నము చేతామంటే మహారా శత్రువుల కల్పించిన పాతకము నాకంటినది, అందుచేత ద దరికి రానీయరు. చెట్టున కుళ్ళి కిందపడిన కాయ తిరిగీ క కతుకుకొంటుందా ?...ఇతో భ్రష్టః తతో భ్రష్టః అన్నట్ల నా బ్రతుకు. మహారాష్ట్రవంశములకు అపకీర్తి తెచ్చినాన

తెరలో—(చాటింపు) పాదుషావారి పవిత్ర సేన తెల్పే దేమంటే—మొగల్‌సామ్రాజ్యమునకు ముఖ్య

శత్రువు సంభాజీగారిని బంధించి ఇక్లాస్‌ఖాన్ పాదుషావారి సమక్షమున నిలువబెట్టినాడు. ఈ సమయమున పాదుషావారి పరమసంతోషమును వ్యక్తపరిచే నిమిత్తము సైనికులు కందరికీ వారివారి చిత్తమువచ్చినట్లు తినడానికీ తినిపించడానికీ తాగడానికీ తాగించడానికీ మందుగుండుసామానును యథేచ్ఛముగా వాడుటకున్నూ పూర్ణస్వాతంత్ర్యము ప్రసాదించినారు. కనుక అందరూ ఇష్టమువచ్చినట్లు చేయవచ్చును.

గణో—అబ్బా! కర్ణకఠోరములైన మాటలు. పంచప్రాణములూ భగ్గున మండుతూన్నవి. మహారాష్ట్రసార్వభౌముడు బంధింపబడి బానిసవలె పాదుషాయెదుట నున్నాడు! ఈ దురవస్థకు నేనేకదా కారకుడను. క్రోధమాత్సర్యము లినుమడించి నాకు వెర్రెత్తించినవి. క్రోధాంధతమసమందు నాకు యుక్తాయుక్తములు గోచరించలేదు. పగసాధించుకోవడమే చూసినాను కాని తత్ఫలము పరికించలేదు. విషబీజము విషవృక్ష మగును, దానిఫలము కూడా విషఫలమే...అబ్బా! ఎంత ఘోరమైన పని చేసితిని! నా అన్నదాతను చేతులారా పెద్దపులినోట్లో పెట్టినాను. ఇకనాతడు మాకు దక్కడు. కీడు చేయుడ మతిసులభము, దానిని క్షమరించడ మతికష్టము.

(మాల్వీ వచ్చును)

మాల్వీ—శిర్కేరాజాగారూ, మీహిందువులు అతిథిసత్కారమునకు పేరుపడ్డా రంటారే, మీరు నన్ను చూసి తిరస్కారభావముతో ఊరకున్నా రేమి?

గణో—అయ్యా, దయచేయండి. నామనస్సు చింతా గ్రస్త మయిందు...మాకు పరమతస్థులమెడ అసహనము లేదు. విధర్ములమైత్రి పునఃపూర్వకముగా అభినందిస్తాము. ఈ కారణముచేతనే మా దేశమునకు వచ్చిన పరదేశస్థులు మమ్ము విడిచి పోలేక ఇక్కడే స్థిరపడి ఇల్లూ వాకిలీ సంపాదించి కాలక్రమమున రాజ్యములుకూడా స్థాపించుకొన్నారు. ఇంతే కాదు—మా హిందువులకు అంతఃకలహములు పెంచుకోవడ మనే దీర్ఘరోగ మొకటుంది. అట్టి కలహములు ప్రాప్తించినప్పుడు మాలో మేము వాటిని తీర్చుకోలేక విదేశీయులు విధర్ములు నైనవారి సహాయమున మావాళ్లపై పగ దీర్చుకొంటాము. అదే తగిన అదనుగా గ్రహించి వారు మా రెండు తెగలవారిని పుచ్చపూపి మాకన్న బలవంతు లవుతారు. సంభాజీమహారాజు పాదుషావారికి అతిసులభముగా వశ్యుడు కావడమే ఇందుకు నిదర్శనము.

(తెరలో పూర్వపు చాటింపు)

పరులమైత్రి నాసగాని స్వీయుల నెట్లు మేము ధ్వంసము చేసుకొన్నామో ఈ పండోరా విన్నవారికి విదితమవుతుంది.

మాల్వీ—(చెవులు మూసికొని) హిందువులే తమ రాజు నిట్లు పరుల కర్పించినారా! ఎంత కష్టము! ఎంత కష్టము!

గణో—మీ జాలిగుండె చూసి మాకు లజ్జావహమైనా సత్యేతరముకాని ఈ వృత్తాంతము విన్నవించి నా

మనోవ్యాధి కొంత తీర్చుకొంటాను. మహాపాతకమైన ఈ రాజద్రోహము, ఈ విశ్వాసఘాత చేసినవాడు కులీనుడూ రాజబాంధవుడూ ఐన ఒక మహారాష్ట్రుడు.

మాల్వీ—ఇంతటి పాపాత్ము డెవడు? తన ఇంటికి నిప్పంటించడానికి అతని చేతు లెట్లు వచ్చినవి! బంధుద్రోహము, రాజద్రోహము ఐన ఈ కృత్య మమానుషము. ఇది రాక్షసులకే తగును.

గణో—పగ అనే క్రిమిచేత అతనిమతి చెడిపోయినది. సంభాజీకి ఘాత చేయవలెనని మత్సరముచేత పొరగప్పిన అతని మనస్సుకు తన పనివల్ల మహారాష్ట్ర మేమవునో స్ఫురించలేదు. ఆత్ర మత్యంత నాశక మని అతనికప్పుడు తోచలేదు.

మాల్వీ—ఆ నష్టకారి ఎవ డండీ?

గణో—ఆ ద్రోహి, ఆ పాపాత్ముడు, ఆ యధముడవే.

మాల్వీ—దైవాంశ లేక రాజు కాడని కృతవిశ్వాసముగల మా హిందూమాతృ గర్భమునకు భారభూతుడవై నీ రాజేశ్వరుని ద్రోహపాశమున కట్టి శత్రువులకు కైదిగా అర్పించినావా? నీ జీవిత మెంత వ్యర్థము చేసుకొన్నావు! కసాయివానికన్న కఠినుడ వైతివే!

గణో—ఇప్పుడు న న్నేమంటే ఏమి లాభము? నా పాపపరంపరోత్తుంగతమము ప్రాయశ్చిత్త పతంగుని చేత ధ్వంసము చేయడము తప్ప వేరుపాయము లేదు.

మాల్వీ—గోడ్డు గోతిలో పడ్డప్పుడు బెడ్డవేయుడము హీనపద్ధతిమైనా పశ్చాత్తాపాగ్నిచే తప్తుడవైన నీయెడ జాలిపుట్టి సన్ను కార్య ప్రవాహమున త్రోసి నీవుచేసిన ఈ ద్రోహమునకు ప్రతిక్రియ చేయడమువల్ల ప్రయోజన ముం దని ఎరిగి నీకు బోధచేయ వచ్చినాను.

గణో—మీరు సహృదయులు కావున అపర చితులైనా నాపై జాలిగొన్నారు. ఇది ఉదారుల లక్షణము... ఇక నా నాటకముందు జరిగే ఘోరకార్యసంచయము నా కళ్ళకు కట్టిన ట్లుంది—క్రూరాత్ముడైన పాదుషా సంభాజీకి యమయాతన తెచ్చితీరును—సంభాజీ వీరశిఖామణి; అతని మతాభినివేశము మచ్చునకైనా మరియొకరియందు కాన రాదు. అట్టి హిందూమతదీక్షాపరతంత్రుని ఇస్లాముమతము స్వీకరించుమని పాదుషా ఎట్టి బాధలు పెట్టునో కదా! ఒక్కొ క్కటి తరచిచూస్తే సంభాజీపై నా కున్న కోపమూ ప్రతి క్రియా పరాకాష్టా పాదుషాపైకి దాటుతూన్నది. పరిస్థితులు అనుకూలిస్తే ప్రాణాపాయము పాటించక పాదుషాపై పగ దీర్చుకొంటాను, కాని ఇది గొంతెమ్మ కోరిక.

మాల్వీ—దేశకాలము లనుసరించి వర్తించవలెను, లేకుంటే ప్రమాదము. అన్యాయవర్తనులయెడ కోపము యుక్తమే, ఇష్టానిష్టపరిణతి మాత్రము గణించవలెను.

గణో—బ్రతుకంతా వ్యర్థపరుచుకున్న నాకు ఇష్టా

నిష్ట విచక్షణతో పనిలేదు. పాదుషా అంటే ఆపాదమస్తకమూ మండిపోతూన్నది.

మాల్వీ—ఇప్పుడు మీరు ప్రమత్తులైతే ప్రయోజన మేమీ లేదు. సంగమేశ్వరమున ఇక్లాస్‌ఖా నడ్డు రాకుంటే మీరు సంభాజీని చంపియుందురు కదా? అదిప్పుడు పాదుషా చేయనున్నాడు. ఏలాగైతేనేమి సంభాజీచావు తప్పనిసరి—. పాదుషాపైని మీకు పాపచింత ఎందుకు?

గణో—పాదుషా నన్ను నమ్మించి మోసము చేసినాడనే నాకు కోపము.

మాల్వీ—ఇందులో మీ తక్కువ ఏమి? ఇద్దరూ స్వార్థపరులు, ఏకకార్యావలంబకులైనారు. అతడధికారి కావున మీ యిద్దరికీ మోదావహమైన కార్యమునే చేయ నెంచినాడు—ధార్మికులు లేక కార్య పరతంత్రులైనప్పుడు వారికి సమిష్టి కుదురుతుంది; స్వార్థపరులకట్టియెడ వ్యష్టి అలవడుతుంది కాని కలయిక కలుగదు—కార్యపరిణామి అయ్యేవరకూ కలిసి ఉంటారు, తీరా కార్యము ముగించేసరికి ఒకరి నొకరు కబళించ యత్నిస్తారు. వారికి పోరాటము తప్పదు...దాని కేమి—శిర్కాణ్ జాగీరు సందర్భమున సంభాజీ మీకు శత్రువైనాడు, అతనిని చంపవలెనని మీ కుద్దేశము కలిగింది. అందు కడ్డుతగిలినందున కదా ఆ కోపము పాదుషామీదికి పరుగెత్తింది. ఇప్పుడు సంభాజీయెడల మీ కనుతాపము కల్గింది. వ్యక్తిద్వేషమువల్ల పగవారి సాయము కోరి దక్షిణ

సామ్రాజ్యము ధ్వంసము చేసినారు కదా అని యిప్పుడు మీరు చింతిస్తున్నారు... మనోవికారములు మట్టుబెట్టి స్వార్థ మహామంత్రము సదా జపిస్తూ భేదోపాయమున తనకార్యము నిర్వహించుకోవడమే పాదుషావారి నీతి... అది అలా వుండనీ—మొగలులయెడ మీకు నిర్బాధ్యమైన శత్రుత్వ మున్నది కదా? శంభురాజును పట్టి పడిపించి పాదుషాపై పగ సాధించ రాదా?

గణో—మీ రెవ్వరో యెరుగలేకున్నాను...విధర్ములైతే మా రాజుగారియెడ మీ కింత విశ్వాస మెందుకు? జాతి మా పగవారిది, వర్తనము మాది. ఇదెట్లు సంభవించును? పాదుషా నా గుట్టు తెలిసికొనుటకై పంపిన గూఢచారుడవా? లేక నావలెనే మొగలులచేత మోసగింపబడిన హిందువుడవా? ఎవడవో చెప్పు.

మార్వా—దైవగతి దురవగాహము. ఏ మని చెప్ప గలను? రాజకార్యధూర్తులైన శంభురాజును చేతులారా ఓడి, చావుకు వెరువనివాడనైనా ప్రాణాధికమైన వాంఛ సఫల మయ్యేవరకూ దైన్యజీవనమున బ్రతుక నెంచి దౌర్భాగ్య దశలో నున్నందున మారువేషము వేసినాను. అజ్ఞాతవాస దీక్ష వహించిన పాండవులు అకాలమున బయలుపడితే వారి గతి ఏమై యుండును?

గణో—నే ననుమానించినట్లే అయినది—మొగల సేనావారము చొచ్చిన మహారాష్ట్రుడవా?

మాల్వీ—చిత్తము. సంగమేశ్వరముతోవలో గుర్రపు దళము తోడుచేసుకొని మీరు మహారాణిగారి సవారి నెదిరించగా ఆమె నా మూపునుండి తప్పించి రాయగడము చేర్చి "మహారాజుగారికొరకు బెంగవద్దు; వారిని త్వరలోనే వెంటబెట్టుకొని వస్తా"నని నచ్చచెప్పి ప్రస్తుతము ఏకాకినై ఆ సాధ్వి యెదుట పడవలసిన భాగ్యహీనుడను—ఖండోజీని—మహారాజుగారి ప్రాణభిక్ష యాచింపవలెనని మీదరి జేరినాను. సంభాజీ మహారాజును సంగ్రహింపనేరక నా ఏబ్రాసి మొగము రాజారామ్‌గారి కేలాగు చూపుదును? మహారాణిగారి కేమి సమాధానమివ్వగలను? ముద్దులమూటకట్టు బాలరాజుగారు తండ్రిగారిని చూపుమని కింకపట్టితే ఏమని బుజ్జగించగలను?

గణో—ఈశ్వరా! నాకీ లజ్జాస్పదమైన బ్రతుకు వద్దు. మూర్తీభవించిన స్వార్థత్యాగమా అన్నట్లు నా యెదుట నిలిచిన ఈ మహాత్మున కేమి సమాధాన మివ్వగలను? జీవచ్ఛవప్రాయుడనైన నన్ను నిష్కళంక నిరాతంక స్వామిభక్తుడైన ఈ మహాపురుషుని ఎదుట నిల్పడముకన్న నాకు మరణము ప్రసాదిస్తే దైవమా! యమయాతన మాన్పినవాడ వగుదువు.

ఖండో—పశ్చాత్తాపోద్రేకమున మరణము కోరితే భగవంతుడది ప్రసాదించునా? కేవల పశ్చాత్తాపము చాలదు. అది కార్యరూపమున పరిణమించవలెను.

గణో—సంభాజి రాజు కాకపోయినా, నేను ఒంటరినై

అతనిపై పగదీర్చుకొన యత్నిస్తే నాపని లెక్కకి మిక్కి అయి యుండును. ఎన్నో తరములనుండి హిందువులకు శత్రువులైన మహమ్మదీయులకు మనరాజు నర్పించి రాష్ట్ర మంతా ధ్వంసము చేయడానికి వాళ్ళ కవకాశము కల్పించి తగని తల్లడము కోరి తెచ్చుకొన్నాను. ప్రమాదవశమున కొంపకు నిప్పంటితే అది ప్రజ్వరిల్లక ముందు దానిని సులభముగా ఆర్పవచ్చును. నా మౌఢ్యముచేత అగ్నిపర్వతమే పగిలింది. ఏమీ చేయనేరని బాలునివలె బెగడొందుతూన్నాను. నాచేత నే మవుతుంది?

ఖండో—నిరాశ చెందకండి. ప్రాణ మున్నంతవరకూ ప్రయత్నము మానరాదు. బడబానలము సముద్రములో తొక్కి హాలాహలము కంఠమున భరించినట్టి పరమేశ్వరుని దయ అపరిమేయము. భవిష్యత్తు గర్భమం దేమి ఇమిడి యున్నదో ఎవ రెరుగుదురు? నిరుపాయులని యెంచి నిరాశా పరవశులై కర్తవ్యపరాఙ్ముఖులైనవాళ్లు కృతకృత్యులు కాలేరు.

గణో—సాధారణమానవకృత్యము నా పాపపంకమును తుడిచివేయలేదు; ఏదైనా అతిమానుషకర్మ చేయవలెను, నా ఆర్తి తీరవలెను.

ఖండో—పాపపరిహారమున కొక్కటే సూత్రము. పాదుషాపిడికిట బెగ్గిలుచున్న మహారాజును విడుదలచేయడమే. సర్వశుభప్రదమైన ఆ మహత్కార్యమే మీకు తప్పకుండా చిత్తశాంతి చేకూర్చగలదు.

గణో—నా దౌర్భాగ్యవశమున ఆ త్రోవ కప్పబడ్డది. అట్టి అవకాశమే ఉంటే సంభాజీని బంధించిన సంకెళ్లు పటాలున తెంచి యుందును. గతమున కార్యభంగము కావించుకొన్న పాదుషా అట్టి విపరీత మేమీ జరుగకుండా జాగ్రత్త పడ్డాడు. మన మహారాజును తన కళ్లయెదుట కారాగారమున ఉంచి చుట్టూ మనకు నిసర్గవైరులైన పఠాను రోహిలా సిద్దీ పటాలములతో షేక్ నైజామును అహోరాత్రములు కావలి వేసి మన రాజును వజ్రపంజరమున భద్రముగా బంధించినాడు. అతని విడుదల అసంభవము, అసాధ్యము.

ఖండో—అయ్యో! నా ప్రతిజ్ఞ వ్యర్థమేనా? ఈ పాపుల సేనాసముద్రమున దుమికినానే కాని చేతులు నులుముకొంటూ చేష్టలు దక్కి యుండవలసిందే? ఇక నేను జీవించిన లాభ మేమి? ఇంతవరకూ వచ్చి ఊరకపోనేల? ప్రాణములమీద ఆశ లేనే లేదు...అయ్యో! మనరాష్ట్రమున అరాజక మారంభ మవుతుంది, అంతఃకలహములచే రాష్ట్రము నశించే దినములు రాకుండా మన చేతనైనంత పాటు పడుదాము. మీరు మాతో కలిసి మహారాజుగారిని విడిపించే యత్నము చేస్తారా?

గణో—అది వ్యర్థప్రయత్నమని అలాగు చెప్పినానే కాని నాకు సమ్మతిలేక కాదు. ఇదివరకు చేసిన ద్రోహమే చాలును నన్నాచంద్రార్కము నరకములో త్రోయడానికి.

ఇప్పుడేనా బుద్ధితెచ్చుకొని మీతో కలిసి పాటుపడుతాను. నాతల దిమ్మెత్తింది, రక్షణోపాయ మేదీ స్ఫురించలేదు; నీవే నా కది ఉపదేశించవలెను.

ఖండో—అలాగే కాని మి మ్మొక టడుగుతాను చెప్పండి...మహారాజుగారికి ఆహారము తీసుకొనిపోయే వానిని మంచిచేసుకొనుటకు కాని, పాదుషావారి కమిత ప్రేమభాజన మైన జనతున్నిసాను ఒప్పించడానికి కాని వీలు లేదా ?

గణో—ఇది మంచి ఉపాయమే. వా రిద్దరినీ చూడ వచ్చును. కాని నే నొక్కమాట ముందే చెప్పుతాను, కోప గించుకోవద్దు. నేను పాపాత్ముడను, ఏవేళ కే దుష్కర్మ చేతునో చెప్పలేను. ఈ మహాత్కార్యము నా నెత్తిపైని పెట్టి తే అందేమి చెడగొట్టుదునో తెలియదు. ఇప్పుడే మహా రాజును విడిపించగలమనే ఆశ మినుకుమినుకు లాడుతూన్నది. నా దౌర్భాగ్యవశమున అది ఆరిపోయి మహారాజు కెక్కువ కీడు దాపురిస్తుందేమో? మనము చేయదలచినది సత్కార్య మైనా నే నందులో తలదూర్చితినా అది దుష్కార్యముగా మారి మన అవస్థను మరింత హీనముగా మార్చును. కాబట్టి నన్ను తటస్థునిగా ఉంచి యావత్కార్యము నీవే నిర్వర్తించు. నా శక్తికొలది వాక్సహాయము చేస్తాను. నీమాట మీరను.

ఖండో—సరే, మీ ఇష్టమువచ్చినట్లే కానీయుండి.

రెండవరంగము

పాదుషా స్కంధావారమునందు డేరాలో సంభాజీ

సంభా—సృష్టి తల్లక్రిందైనట్లున్నది, లేకుంటే నా జీవితము ఇట్లు వక్రగతి పట్టునా? మేటిశూరుడనై వ్యర్థునివలె శౌర్యాలాపము లాడుతూన్నాను. అహో! దైవమా! రాజకార్యమహావార్ధి ననుయానకౌశలము గల నావికుని రసాతలమునకు క్రుంగించితివా?...మాయామేయమైన ఈ జగత్తున జయప్రదమైన చారిత్రము, అనాయాసము సగౌరవమైన మృత్యువున్నూ ఎక్కడో అదృష్టశాలికి ఘటిల్ల చేస్తావు కాబోలు!...సంభాజీ—నీవు స్వాభిమానివి, ఉద్వేగిపరుడవు, క్రూరస్వాంతుడవు—నిసర్గసరళుడవే కాని విచక్షణుడవు కావు. మానవస్వభావపరిశీలనాపటిమ యెందుకైనా నీయందు లేదు. అయోగ్యులను చేరదీసి పెడదారి పట్టినావు. స్వీయులను విశ్వసించక పరులను నమ్మి పాడయినావు. నిశ్రేయోభిలాషులను చెంతజేర్చక యుక్కుమొగి మొగగని నికృష్టోపజీవుల వ్యామోహమున బడి వ్యసనాసక్తుడవై పేరు చెడగొట్టుకొన్నావు. కాలచక్రమునకు కనికరమన్నది లేదు. శిరశ్ఛేదమే నీ కిర్వాణమైన శిక్ష. ఇంగ్లో ని అపరాంధమానిక—ఆబాసాహెబుగారితో భుజముకలిపి పోరినవాళ్లు, సామ్రాజ్యస్థాపనకు మూలస్తంభములై తమప్రాణములను త్యజించినవాళ్లు నిష్కారణముగా నీచేత వధింపబడిన మహనీయులు ఎందరో

కలరు—ఇదిగో అన్నాజీదత్తో ప్రేతము చింతనిప్పులుబోలు కళ్లతో ఏలాగు చూస్తున్నదో! శిర్కేలు పటపట పళ్లు కొరుకుతూ పగతీర్చుకొనుటకై పిడికెళ్లతో పొడవనున్నారు! మరపు తేనుగ కాలుక్రింద మడిసిన బాలాజీ ఆవ్జీ అతినిష్ఠురమైన ధ్వనితో "రాజా! శివాసాహెబుగారు అతిప్రయాసతో మహారాష్ట్ర సేనాసముద్రము మధించి సేకరించిన వీరరత్నములను రూపుమాపుతూన్నావు, ఇక నీసేన విశృంఖలవృత్తితో విహరించి నీ గౌరవమునూ ప్రతిభనూ గంగలో కలుపును. అప్పుడు వీళ్ళకొరకు భోరున నీ వేడ్వవలసి వచ్చును" అని అనుచున్నాడు. అదిగో కుద్యస్థాపితమైన నా సవతితల్లి కరుణాక్రందనము. మహారాణీ, నేనే సచ్ఛీలుడనైతే మీకు నాపై సహితానురాగ ముండియుండును. స్వయంకృతాపరాధములచే సంభాజీ వ్యర్థుడని తేలిపోయింది—అన్నపానములివ్వక పలువుర సంతాపమొందించిన సంభాజీ ఇక బ్రతుకడు... నిశ్చయముగా నాకు కూడా బ్రతుకవలెనని లేదు. ఈశ్వరా! స్వాభిమానికి తగిన మృత్యువు నాకు ప్రసాదించు...అయ్యో! నా కెట్టి కష్టగతి ప్రాప్తించింది! చిన్నతనమున ముదుకనై తండ్రిగారి ప్రేమకు తప్పితిని—పడుచుదనమున పాడుమిత్రుల పాలబడి ప్రాణసమానులైన బంధువుల ప్రేమకు దూరపడనైతిని—భగవానునివంటి భ్రాతను పదేళ్లు బంధిఖానాలో బంధించి ప్రజాప్రేమను పోగొట్టుకొన్నాను. ప్రాణాధికమైన భార్యను నా మాటలతో తన్ని పగుగొని వచ్చి బాదుషాచేతిలో పడ్డాను.

తండ్రినీ పోగొనీ చంపి సర్వస్వము నపహరించినా తప్పులు మన్నించి నిరుపమభక్తితో సేవించిన ఖండోజీ మాట...

(ఖండోజీ వచ్చును)

ఎవరది? ఖండోజీ!

ఖండో—మహాప్రభూ! నేనే!

సంభా—ఎందు కింత సాహసము! ఈ వేష మెందుకు వేసినావు?

ఖండో—మహారాష్ట్రసామ్రాజ్య పునర్వృద్ధికి-నిష్కర్త నైగాంశ్యము ముల్లమీరి ఉనికి అని మా కులధర్మమైన కృతజ్ఞత ప్రేరేపించగా ఈ కపటవేషము వేయవలసి వచ్చింది. భగవంతుడు ప్రత్యక్ష మానవుని పరీక్షిస్తూన్నా పాండవుల కజ్ఞాతవాసము తప్పలేదు.—రాజరాజేశ్వరా! ఇది ఈశ్వరసంకల్పము—మీ అన్నము తిని పెంచిన ప్రాణము లని విర్రవీగే నేనీ నాటికి మీ శత్రువుల అన్నము తిని మారువేషముతో విద్వేషుల మధ్య నివసించవలసి వచ్చింది!

సంభా—ఖండోబా! కశ్యపప్రజాపతి కడుపున దైత్యులూ దానవులూ పుట్టినట్లు, జగజ్జీవనదాత సూర్యుని కడుపున శని పుట్టినట్లునన్నా ఛత్రపతి శివాజీ మహారాజు కడుపున బుట్టి వారి గుణములు కూడా చెరచినాను. అట్టి నిర్భాగ్యుడైన సంభాజీకొఱకు నీ వెందుకు శ్రమపడుతూన్నావు? ఇదివర కొకసారి నా ప్రాణములు కాచినావు. మొన్న సంగమేశ్వరములో శత్రుబృందమును సరకుచేయక

నీచేతనైనంతవరకూ నన్ను కాపాడ యత్నించినావు, కాని కార్యము లేకపోయినది—తిరిగీ నేను కామక్రోధానలమున శలభముల వలె కాలుచు మీరాని పని తలపెట్టినావు. నీబోటి నిష్కల్మషస్వామిభక్తులగు సేవకుల విలువ నేను కనిపెట్టలేక పోతిని. ఎన్ని జన్మలకు నీ కడుపున పుట్టినా నీ ఋణము తీర్చ లేను.

ఖండో—ప్రభూ! మీరు మా కొనర్చిన మహోపకారము ముందర నా కృత్య మే పాటి! సిద్ధోజీ మా కులము నెల్ల ఓడలో ఎక్కించి పరదేశములందు పాడు గానిసలుగా అమ్ముటకు సిద్ధ యుంచినప్పుడు ఆ స్వప్రాణపరాయణులైన ఆ బాసాహేబుగారు దయపడి మా పిల్లలను చేరతీసి పెంచినారు. అందుమూలముగా మా కులము నిర్మల ప్రఖ్యాతి వడసినది—ఆ ఋణము తీర్చడానికి నేను చేయరాని దేమైనా ఉన్నదా?

సంభా—నీ వేమీ చేయ నక్కరలేదు. ఇకపైని నాకొరకు మీ రేవిధమైన శ్రమ పడనక్కరలేదు. నా మాన్యులైన మీరు నా అపరాధము లన్నియు మన్నించి ఆ బాసాహేబుగారు కూడా నాయెడ కనపరచిన అభిమానము, అపేక్షలతో నన్ను రక్షించినారు—మీ రాజభక్తి పరమావధి నొందినది. నాయనా, నీవు వచ్చిన ట్లే పో. ఇప్పటికన్న దారుణమైన అనిష్టపరంపర మహారాష్ట్రమును దాపురించ మున్నది—పనికిమాలిన నాకొరకు మీరు ప్రాణములు త్యజించవద్దు—సురక్షితముగా రాయగడము చేరి రాజారామ్‌తో—“మహా

రాష్ట్రమునకు నీవే తగిన సార్వభౌముడవు— ప్రభుత్వమంతా నేను పాడుచేసినాను, దానిని సవరించుకొనే బాధ్యత నీది" అని నామాటగా చెప్పు—ఇక రాణీగారితో "పాడుపా నన్నా మహారాష్ట్రమునే కాక సర్వహిందూమతము సమయ జేసి ఇస్లాముమతము ప్రతిష్ఠింప నెంచినాను—నీ మాట వినక నేను చెడినానని దైవసాక్షిగా చెప్పగలను—నామూర్ఖత్వము మన్నించ ప్రార్థిస్తూన్నా"నని చెప్పు.

ఖండో—మీకింత నిరాశ ఎందుకు మహాప్రభూ ?

సంభా—ఖండోజీ, నాజన్మము వృథా ! అరిషడ్వర్గము నదుపులేక అనితాపచారము కావించినాను. దుస్సహవాస మున దుష్టుడనై పయోముఖవిషకుంభమైన కబ్జీని నమ్మి కాలునివాత పడినాను. దుర్వ్యసనాసక్తి నన్ను దుండగుని చేసింది. అష్టప్రధానులను కూలపెట్టి అధికారమంతా ఆ యపాత్రుని నెదాన పెట్టినాను, అందుమూలాన మహారాష్ట్రము నిరంకుశ రాజకమై రంధ్రాన్వేషులకు సుగమమైనది. బంధువులతో పగ, పగతురతో యుద్ధము—వీటితో నా కాల మంతా గడిచింది, చిత్తశాంతి చిన్నమెత్తైనా లేదు. ఇక బ్రతికి ఏ మనుభవించగలను? యోగ్యుడైన రాజు కుండవలసిన సుగుణ మొకటైనా నాకు లేదు ; అందుచేత ఇక బ్రదుకుపై ఆశలేదు. త్రికరణశుద్ధిగా చావవలె నని నిశ్చయించినాను— ఇక నాకొరకు ఎవ్వరూ పాటుపడవద్దు.

ఖండో—ప్రభూ! నా మనవి చిత్తగించండి—మీరు శత్రువులకు చిక్కారన్న వార్త రాష్ట్రమును అట్టుడికించినట్లు చేసింది—ఆ కల్లోలము మిమ్ము చూస్తేనేకాని పోదు. శిర్కేని మంచి చేసుకొని యువరాజ్ఞి జినతున్నిసాగారి ప్రాపు సంపాదించి మిమ్ము విడుదలచేసే ఏర్పాటు జయప్రదముగా జరిగించినాను. పాదుషావారు మీ విషయము విచారణ చేయడానికి ఇంకా వ్యవధి ఉంది. ఇంతలో మన సైన్యము వచ్చి “జయోవా మృత్యుర్వా” అని నిర్ధారణ చేసుకొని వీళ్లపై సకస్మాత్తుగా చీకటిలో పడి మిమ్ము తప్పక విడిపించగలదు.

సంభా—స్వమతోద్ధారణకు ప్రాణము లర్పించే భాగ్యమయాచితముగా నాకు ప్రసాదిస్తుంటే నేను దానికి పరాఙ్ముఖుడనై సిగ్గు మాలి రాయగడము చేరవలెనా! కొరగాని కొడుకు కులమునకు చెరుపు. నేను మావళీలముందర పడలేను. నాచే ఇస్లాము మతము స్వీకరించజేయడానికి పాదుషా పలువిధముల పాటుపడుతూన్నాడు. అదంతా వ్యర్థ మనిన్నీ హిందూరాజులకు ప్రాణముకంటె మతమే ఎక్కువ ప్రేమపాత్రమని నిదర్శనము చూపించి నాజన్మ సార్థకము చేసుకొంటాను.

ఖండో—మీ యభినివేశము ప్రశంసనీయమే—కాని మహారాజా! ఆచంద్రార్కము హిందూమతము నిలువబెట్టి ఉద్ధరించవలెనని కదా ఆబాసాహెబుగారు మనరాష్ట్రము ప్రతిష్ఠించినారు. దానిగతి ఏమి కానున్నదో మీరాలోచించవలెను—యువరాజు పసిబాలుడు, రాజారామ్‌గారికి రాష్ట్ర

పాలన మపరిచితము, కార్యసక్తులైన సర్దారులు కాలముచేసినారు, కొందరు కొలువు మానుకొన్నారు, వారిని మీరు సుపేక్షిస్తే జీవనోపాధి లేనందున వారు శత్రుపక్షము చేరవలసి ఉంటుంది. ఇట్టియెడ దేశమందలి సంక్షోభము నడిచి పరిపాలనాకలము గడుపు నావికు డేడీ? ఇట్లు దేశ మారుమూలను కాగా పాదుషా ప్రభావము నిరంతరాయముగా సాగి అతడు కృతకృత్యుడు కాడా? మహాప్రభూ! మరణ మాశించి మహారాష్ట్రమును మట్టిలో కలుపుతారా?

సంభా—ఖండోబా, నీవు కేవలవీరుడవే కావు, రాజకార్యప్రవీణుడవు, రాజ్యతంత్రనిర్మాణచతురుడ వని స్పష్టమైనది—కాని నీయత్నము సఫలమై నాకు బంధమోక్షమౌ నని ఏలాగు నమ్మడము?

ఖండో—జయము ఉత్సాహమును యత్నమునూ అనుసరించి యుండును. మనశక్తి కొద్ది పాటుపడుదాము; భోంసలేకుల దేవత భవానీమాత సర్వసమర్థురాలు!...ఆమె కృపచే జయము మనకు ప్రాప్తించగలదని మా అందరికీ ఆశ ఉన్నది.

సంభా—కానీ, నన్ను నిరుత్సాహపరచను—భవానీదేవిపై భారము వేసి ప్రయత్నము చేతాము—నీకు జయమగుగాక! (అతడు పోవును) ఆహా! తానొకటి తలప దైవ మన్య మొనర్చును. ఏ దేలాగున్నా ఖండోజివంటి స్వామిభక్తులు, సంతాజీధనాజీలవంటి శూరులు, ఖరాజీ రామచంద్ర

పంత్ వంటి రాజ్యకార్యప్రవీణులు—ఏ రాష్ట్రమున నుందురో దాని కుత్కృష్ట సంభవించితీరును.

(తెరలో) "దగా, దగా, పరుగెత్తండి, పట్టుకోండి."

ఏమిటీ గోల? ఖండోజీ నన్నేమీ పోల్చుకో లేదుకదా!

(ఇక్లాస్‌ఖాన్ వచ్చును.)

ఇక్లా—రాజాసాహెబా! ఇప్పు డిక్కడికి వచ్చిన వారెవరు? మీ భోజన మెవరు తెచ్చినారు?...మాటాడ రేమి?...మీరు చెప్పకపోయినా చింతలేదు. ఇక్కడి కెవరు వచ్చినారో, ఎందుకు వచ్చినారో—అంతా సవిస్తరముగా కబ్జీ చెప్పినాడు. మారువేషమున నున్నంత మాత్రమున ఖండోజి కబ్జీ కంటిలో దుమ్ము గొట్టగల డనియా మీ ఊహ? ఇట్టి జిత్తులవల్ల మీ కార్యము నెరవేరదు సరేకదా, పాదుషావారి కోపము హెచ్చినది. ఐదారుదినములకు రాబోవు మృత్యువు మీకు నేడే కలుగనున్నది. (పోవును)

సంభా—ఈ కబ్జీ బ్రతికి ఉన్నంతకాలము మహా రాష్ట్రమునకు శని వదలదు—ఈ విషసర్పము తలప్రాణము తోకకు వచ్చినా కాటు వేయకమానదు—నన్ను చంపితే వాడి కడుపు నిండదు—ఇదంతా స్వయంకృతాపరాధమే—మొదటి నుండీ దుస్సాంగత్యమే నా దుంప తెంపినది.

(తెరలో) పాదుషావారు దయచేస్తున్నారు హుషార్

అదిగో దండధరుడు వస్తూన్నాడు—నా కాయువు సరి—భవానీదేవీ—మహారాష్ట్రమును కాపాడు తల్లీ!

(పాదుషా పరివారముతో వచ్చును)

ఔరం—ఇతడేనా శివాజీ శూరపుత్రుడు?

ఇక్లా—ఔను—మహాప్రభో!

ఔరం—నిర్భత్యస్వభావుడు, వీరవ్యాఘ్రుడు, సుందరుడు! ఇట్టివాడు ఇస్లాముమతము స్వీకరిస్తే హిందూదేశమంతా ధన్యమగును. ఇట్టి మహనీయు నాశ్రయించి నీచుడు విశ్వాసఘాతకుడూ ఐన కబ్జీ ఇతనినే భంగపరచినాడు...(ప్రకి) ఏమండీ మహారాష్ట్రసార్వభౌములు!

సంభా—(పెడ మొగమున నే ఉండును)

ఇక్లా.—ఏమండీ, పాదుషావారు పిలుస్తే పలుకరేమి? తెలివి తెచ్చుకొని వినయ విధేయతలతో వర్తించండి.

సంభా—పట్టెడన్నము నాసించి పసులపంచ జేరి బ్రతుకదలచినవారు ప్రభువుల నాశ్రయించి వారి యనుమతి చొప్పున మెలగవలెను—సేవకుల కది ధర్మము.

ఔరం—శూరాగ్రేసరా! నిజము—వేటకాని తుపాకి దెబ్బవల్ల గాయపడిన పెద్దపులి వానిపైకి లంఘించడము స్వాభావికమే—నీ స్వాభిమానము మా అనురాగమునకు హేతువైనది—పరవంచనచేతనే మీకిట్టి అవస్థ చేకూరినది, కాని దీనిని దాటే ఉపాయము మీ వశమున నున్నది—అందువల్ల పరమేశ్వరుడు మేలు కూర్చగలడు—

సంభా—అట్టి ఉపాయ మేదో వినగోరుతున్నాను.

ఔరం—తప్పు దోవల పోక యదార్థమైన ధర్మము నాశ్రయించినవారికి భగవంతుడు మేలు కూర్చును. సత్యమైన ఇస్లాముమతము మీరు స్వీకరిస్తే మీకు గొప్పపదవి నొసగ దలచినాము.

సంభా—స్వార్థపరత్వావిష్టమైన పరధర్మానురక్తి స్వమతాభినివేశముచే అన్యమతావలంబనము చేయించు ననే భ్రాంతి వదలిపెట్టండి—పదవులనే ఎర చూపి భారతవర్షమున ఇస్లాము మతము ప్రసరింపజూచుకొన్నారా? హిందువులందరూ పరోచ్ఛిష్టభోజులవుతారా? ఈ మహారాష్ట్రకేసరికిశోరము స్వధర్మము విడిచేది కాదు.

ఔరం—పలుమాటలేల? ఇస్లాముమతము స్వీకరించ నిష్టపడితివా దక్షిణాపథమునకు నిన్ను సుబేదారుని చేస్తాము. ఈ గౌరవ మింతవరకే హిందువునకూ చేయలేదు—మొగల యువరాజులకు తగిన పదవి అది.

సంభా—నేనూ ముడిమాట చెప్పుతాను. స్వమతాభినివేశము రాజులకు విధి. అది మానినవారు అంతా పోగొట్టుకొన్నట్లే—సుబేదారు పదవి యిచ్చి సేనకోత్తమునిగా గౌరవించినా, లేక కూతు నిచ్చి బందువుగా బహూకరించినా నేను ఇస్లాముమతము స్వీకరించను. ముమ్మాటికీ నిజము—

ఔరం—సైనికులారా! ఈ కాఫరును గాడిదె మీద నెక్కించి ఊరంతా త్రిప్పి తీసుకొని రండి...ఆఁ మరచితిని, కబ్జీకి కూడా ఇట్టి గౌరవమే కావలెను—మిత్రులను ఎడబాప

కూడదు...మూర్ఖా! నీ నిర్లక్ష్యభావమునకు శిక్ష అయింది. నోటువడితనమునకు నాలుక కోయిస్తాను.

సంభా—నీ చిత్తము వచ్చినట్లు చేయవచ్చును.

ఔరం—అటుపిమ్మట నీ దుండగమునకు చిత్రవధ చేయిస్తాను. కబ్జీకి కూడా ఇదే శిక్ష!

సంభా—నన్నెలాగు బాధించినా సరే—ఈ సంభాజీ స్వధర్మముకొరకు ప్రాణములు త్యజించి హిందూసామ్రాజ్యమునకు సంధానసాధకమైన స్వాతంత్ర్యభావోన్నతిని స్థాపించి తీరును.

స్వస్తి ప్రజాభ్యః, పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం
మహీశాః, సర్వే జనాః సుఖినో భవంతు. శాంతిః శాంతిః శాంతిః.

సమాప్తము.